

# పొందూరు మరో పోర్‌బందర్





పొందూరు పైడితల్లి అమ్మవారు

శ్రీశైలం తలపాగ

కోదండరామాలయం



మాడుగుల నాగఫణిశర్మ



పత్తిని శుభ్రం చేస్తూ...



బాల విజయ్



వస్త్రాన్ని నేస్తూ....

పొందూరు వస్త్రాలివే...





అంగ అప్పారావు కుంచె నుంచి...
వినోబాభావేచే ఖాదీ భవన్ శంకుస్థాపన



దారం తీస్తూ...

ఖాదీకి జీవం



ఈ చేపముల్లే

## ఖాదీ జాతీయ అవార్డు గ్రహీతలు



అంగ సాంబశివరావు కుంచె నుంచి...



మాడుగుల సూరమ్మ



మలిపెద్ది రామారావు



జ్ఞాపికలు (మెమెంటోలు)



హార్మోనియం తయారీలో...

పరబ్రహ్మ పరమేశ్వర

పురుషోత్తమ సదానంద

పరంజ్యోతి పరాత్పరా పతిత

పావన సుప్రకాశ

వరదాయక సకలలోక

వందిత సుఖదాప్రమేయ

పాహిపాహి మాం పాహి మాం

: అంకితం :

**అమ్మ, నాన్నలు : కీ॥శే॥ రాధాకాంతమ్మ, చినగురుమూర్తి**


రచయిత

# వొండ్రంగి కొండలరావు



ప్రచురణ

**ప్రెస్ క్లబ్ - పొందూరు**

శ్రీకాకుళం జిల్లా.

# పొందూరు మరో పోర్‌బందర్

వాండ్రంగి కొండలరావు

ప్రథమ ముద్రణ సంవత్సరం 2014

ప్రతులు : 1000

వెల : రూ॥ 20.00

ముద్రణ :

వాసవి ప్రింటర్స్

మార్కెట్

పొందూరు - 532 168

శ్రీకాకుళం జిల్లా

సెల్ : 9573577898

vasaviprinters.ponduru@gmail.com

ప్రతులు కావలసినవారు పై చిరునామాను సంప్రదించవచ్చు.

**GOVERNMENT OF INDIA**
DIRECTORATE OF FIELD PUBLICITY
Ministry of Information & Broadcasting
SRIKAKULAM UNIT



**Dr. G. Kondala Rao, IIS.,**
M.A(Litt), MJMC, PGDIL, SPGDIS, DIH, Ph.D(Jour.)
Field Publicity Officer

Srikakulam,
Dt.20-12-2013

# ఖాదీని అక్కున చేర్చుకోవాలి...

మహాత్మా గాంధీ పిలుపుతో మనదేశంలో ఖాదీ-చేనేతలు మంచి గౌరవం, పేరు-ప్రఖ్యాతులు పొందాయి... మహాత్ముడు స్వహస్తాల్లో తిరిగిన "రాట్నం" మన స్వదేశీ ఉద్యమానికి మార్గదర్శకమైంది.. ఆ దిశగా "రాట్నం" ప్రగతికి దిక్సూచి అయింది, పురోభివృద్ధికి చుక్కానీ అయింది.

చరఖాతో వడికి, పడుగుమీద పాలిష్‌పెట్టి, నాడితో నేసేటప్పుడు చూస్తే ఒక యుద్ధ వీరుడు ఏరకంగా అయితే యుద్ధరంగంలో విజృంభిస్తాడో అలాగే నేతగాడు (నేత వీరుడు) మగ్గంమీద తన నైపుణ్యంతో చెలరేగిపోతాడు.. ఈ దృశ్యం " కన్నులకు నిజంగా పండుగే (a feast to the eyes..)" అసలు మన జీవితాన్ని కవులు పడుగు, పేకలతో పోల్చడం చూస్తే ఈ వృత్తి నుంచే చాలాచాలా పదాలుపుట్టుకు రావడం; జీవితంతో అన్వయించుకోవడం అనేక సందర్భాల్లో చూస్తున్నాం...

వ్యవసాయం తరువాత, ఎక్కువ శాతం నేత వృత్తిలో ఉన్న వీరికి తగినంత, రావలసినంత ఆదరణ రావడంలేదు.. కారణాలు శతకోటి.. అటుపోట్లకు ఎదురెల్లి ఈ వృత్తిని నమ్ముకొని ముందుకు సాగిపోతున్నవారు నిజానికి ఈ నేత వృత్తిని పనితనాన్ని బతికిస్తున్నవారేనని చెప్పక తప్పదు.

ఇక, పొందూరు ఖాదీ గురించి ఎవరికి తెలియదుచెప్పండి? దేశ నాయకుల నుంచి సినీ పరిశ్రమవారి వరకు చాలామంది పొందూరు ఖాదీని అభిమానిస్తున్న వారే. అయితే ఈ ఖద్దరు జిలుగు-మెరుగులతో; రంగు-హంగులతో ముందుకు వెళ్లినట్లైతే ఇంకా మంచి ప్రజాదరణ పొందే అవకాశముంది. అలాగే, ఇలాంటి దుస్తులు సామాన్య మధ్య తరగతి వారికి కూడా అందుబాటులో ఉండే విధంగా రూపొందిస్తే మరీ మంచిది... సింథటిక్ దుస్తులతో చికాకుపడే ప్రజల్లో ఖాదీ-చేనేత చిద్విలాసం గురించి తెలిసేటట్టు చెబితే ఈ తయారీకి మరింత గిరాకీ లభిస్తుంది...

ఇప్పటికే...ప్రతి శనివారం చేనేత దుస్తులు వినియోగించాలనే ప్రోత్సాహం ఉద్యోగుల్లో ఉండగా; ఈ ఆచరణ జన బాహుళ్యంలోనికి చొచ్చుకు వెళ్లడం చారిత్రక అవసరంగా అందరం గుర్తెరగాలి... గౌరవించాలి... ఆదరిద్దాం... ఈ పుస్తక రచయిత వి.కొండలరావును అభినందిస్తున్నాను.

Ph : 08942-223154
Mob : 9440112865
email:gkrau@rediffmail.com

(Dr. G. Kondala Rao)
FIELD PUBLICITY OFFICER
SRIKAKULAM UNIT.

**GOVERNMENT OF ANDHRA PRADESH**
Information & Public Relations Dept. (I&PR)
SRIKAKULAM - Dist.,



L. RAMESH,
M.Com., B.Ed., B.P.R.
District Public Relations Officer
Ph : 08942 - 278299

Srikakulam,
Dt.21-12-2013

# దేశ కీర్తికిరణం సన్నఖాదీ

భారతజాతి కీర్తి కిరణం సన్నఖాదీ. 1920లో గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమానికి, విదేశీ వస్తు బహిష్కరణకు " రాట్నం " అసమాన ప్రతీకగా నిలిచింది. రోజులు గడిచేకొద్దీ పల్లెలు, పట్టణాలు, పేద, గొప్ప అన్న తారతమ్యం లేకుండా భారతీయులందరినీ సమైక్యపరచింది ఈ రాట్నమే.

జవహర్‌లాల్ నెహ్రూ అభివర్ణించినట్లుగా ఈ 'స్వాతంత్ర్య వస్త్రం' ఎందరికో స్ఫూర్తిదాయకం. దేశంలో వందలాది ఖాదీ సంస్థలు ఉన్నప్పటికీ పొందూరు ఖాదీకి ఎనలేని ప్రత్యేక స్థానం ఉండటం గర్వకారణం. అయితే ఖాదీ పరిశ్రమను కంటికి రెప్పలా కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉంది. పర్యావరణ పరిరక్షణకు, మంచి ఆరోగ్యానికి ఖాదీకి మించిన వస్త్రాలు లేనేలేవు. అలాగే చేనేత వస్త్ర పరిశ్రమను సైతం మనం ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పూజ్య బాపూజీ ఆశించిన స్వదేశీ విధానాన్ని మనమంతా అనుసరించడమే ఆయనకు సరియైన నివాళి అవుతుంది. ఖాదీ, చేనేత పరిశ్రమలు నేతకార్మికులకు, రైతులకు, అద్దకం పనిచేసేవారికి, వండ్రంగులకు, రజకులకు, తదితర వర్గాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. ఆయా సందర్భాల్లో పౌరసంబంధాల శాఖ పక్షాన ఖాదీ, చేనేతలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నాం. పొందూరు ఖాదీపై వర్ణ చిత్రాలతో చక్కని పుస్తకాన్ని రూపొందించిన వి. కొండలరావు అభినందనీయులు.

# పొందూరుకు నా తొలి ప్రణామం...

ముక్కుపుడక చిన్నదిగా ఉంటేనే అందంగా ఉంటుందని వేరేగా చెప్పనక్కరలేదు. జాతిపిత గాంధీజీ ప్రశంసలు అందుకొని పర్యాటక రంగంలో స్థానం పొందిన పొందూరుపై సంక్షిప్తంగా ఓ చిన్న పుస్తకాన్ని అందించే ప్రయత్నమే ఇది. చుట్టూ ఉన్న చీకటిని తిట్టుకొని కూర్చోడం కంటే చిన్న దీపమైనా వెలిగించాలని భావిస్తూ ఈ పుస్తకంలో ఖాదీ, చేనేత, పట్టు పరిశ్రమలు, మెమొంటోల యూనిట్లు, విద్య, కళా, సేవా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక తదితర రంగాలపై పలు కథనాలను పొందుపరచాను. ఇది ఏ ఒక్కరి చరిత్ర కాదు. ఇది అందరి చరిత్ర, పొందూరు సంక్షిప్త చరిత్ర. కొండంత దేవుణ్ణి, కొండంత పత్రితో ఆరాధించలేం. అంచేత విషయాన్ని క్లుప్తంగా చంద్రుణ్ణి అద్దంలో చూపించే విధంగా సమర్పించడమైంది. వివరాల సేకరణకు అన్ని వర్గాలవారు తమ సహకారాన్ని అందించారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ఓ పట్టణం లేదా గ్రామంపై తొలిసారిగా ప్రత్యేకంగా పుస్తకం రాసిన అవకాశం లభించినందుకు ఎంతో ఆనందిస్తున్నాను. ఈ పుస్తక రచనకు తగు సూచనలిచ్చిన పొందూరు ప్రెస్‌క్లబ్ సభ్యులకు, హిందీ మంచ్ జోనల్ కార్యదర్శి, కోనే శ్రీధర్, ఆత్మీయులు, ప్రముఖ సాహితీ విమర్శకులు డా॥ డి.వి.సూర్యారావు(విశాఖ), ప్రథమశ్రేణి తెలుగు పండిట్ బి.భూపతిరావు, యువజన నాయకుడు కోరుకొండ సాయికుమార్, గుడ్ల అన్నాజీరావు, బోను ఈశ్వరరావు, ఉపాధ్యాయులు కుప్పిలి రవికుమార్, జి. వెంకటరావు(డి.టి.ఎఫ్), ప్రోత్సాహకులకు, పుస్తకాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన చి॥ బండారు మనోజ్ కుమార్ (వాసవి ప్రింటర్స్)కు ప్రత్యేక ధన్యవాదాలను అందజేస్తున్నాను. పాఠకులు నా ఈ ప్రయత్నాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

"నలుగురు కూచొని నవ్వేవేళల
నాపేరొకపరి తలవండి"

**- వాండ్రంగి కొండలరావు**, ఎం.ఎ.,బి.యిడి.
గౌరవ అధ్యక్షులు, ప్రెస్‌క్లబ్, పొందూరు

# పొందూరు ఖాదీపై " అత్తరు జల్లులు "

## : జాతీయ సంస్కృతికి సంకేతం :

ఖాదీ వస్త్రాలు ఎంతోసౌకర్యవంతంగా ఉంటాయి. వేసవి కాలంలో చల్లగా, శీతాకాలంలో వెచ్చగా వుంటాయి. వీటిని ధరిస్తే ఎంతో హుందాగా కనిపిస్తాయి. నేను సినిమాల్లో చేరకముందునుంచే ఖాదీని వాడుతున్నాను. ఖాదీ వస్త్రాలకు ఖాదీ వస్త్రాలే సాటి. వీటికి ప్రత్యామ్నాయం లేనేలేదు. ఈ వస్త్రాలను ధరిస్తే ఓ ప్రత్యేకమైన ఆనందాన్ని అలౌకికమైన అనుభూతిని పొందుతుంటాను. ఖాదీపై ఉన్న ప్రేమతోనే పలు సినిమాల్లో పొందూరు ఖాదీ కలిసొచ్చే విధంగా పాటలను చిత్రీకరించాను. ఈ పరిశ్రమను పదికాలాలపాటు నిలదొక్కుకునేందుకు ఇటు ప్రభుత్వం అటు సమాజం ప్రోత్సహించాలి. జాతీయ సంస్కృతికి, సంప్రదాయ వారసత్వసంపదకు ఖాదీ ఓ సంకేతంగా నిలుస్తుంది.

**- నటసమ్రాట్ డా॥ అక్కినేని నాగేశ్వరరావు**

**(ఎ.ఎన్.ఆర్.)**

## : పొందూరు ఖాదీ ఓ గంగోత్రి :

ఖాదీని గంగానదిగా భావిస్తే, పొందూరు ఖాదీని గంగానదికి జన్మనిచ్చిన గంగోత్రిగా అభివర్ణించవచ్చు. ఖాదీ ఒక వస్త్రమే కాదు. నిజాయితీకి, శుచికి సంకేతంగా నిలుస్తుంది. పొందూరులో నేను గడిపిన కొద్ది రోజులు తిరుమలలో పొందిన అనుభూతిని పొందాను.

**- తారా భట్టాచార్జి**

**(గాంధీ మనుమరాలు)**

## : హంసల ప్రతిబింబం పొందూరు ఖాదీ :

పొందూరు ఖద్దరనగా
అందమ్మును చిందు అంచు
అంచల వలె - రూ
పొందిన సరస్వతీ శ్రుతి
సుందర వాహనము ఘనము
శుభమౌ మీకున్!

**- డా॥ మాడుగుల నాగఫణిశర్మ,**
సహస్రావధాని
అవధాన సరస్వతీ పీఠం,
మాదాపూర్, హైదరాబాద్

## ఓ హరివిల్లు పొందూరు ఖాదీ :

పొందూరు ఖాదీ వస్త్రాలను ఓ అందమైన హరివిల్లుగా భావించవచ్చు. కేవలం మన రాష్ట్రంలోనే కాకుండా జాతీయ అంతర్జాతీయ రంగాల్లో మా ఖాదీ పరిశ్రమ ఎంతో ప్రసిద్ధికెక్కడం గర్వకారణంగా ఉంది. ఈ పరిశ్రమను పరిరక్షించాల్సిన బాధ్యత ఇటు ప్రభుత్వంపై అటు సమాజంపై ఎంతైనాఉంది.

**కోరుకొండ జయలక్ష్మి**, సర్పంచ్
పొందూరు.

# అక్కినేని (ఎ.ఎన్.ఆర్)తో ప్రత్యేక ఇంటర్వ్యూ

- వి. కొండలరావు, రచయిత.

## : చౌక ధరల్లో ఖాదీ లభించాలి :

## నట సమ్రాట్ డా॥ అక్కినేని నాగేశ్వరరావు

ఖాదీ వస్త్రాల ధరలు సామాన్యునికి ఏమాత్రం అందుబాటులో లేవు. ఇలాఐతే ఖాదీ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చౌక ధరల్లో వస్త్రాలు లభించాలి. ఇందుకు ఖాదీ యాజమాన్యాలు నడుంబిగించాల్సిన అవసరం ఉందని డా॥ అక్కినేని స్పష్టంచేసారు. గత ఆరున్నర దశాబ్దాలుగా పొందూరు ఖాదీ వస్త్రాలనే ధరిస్తున్న ఎ.ఎన్.ఆర్‌తో ఈ పుస్తక రచయిత కొద్ది రోజులక్రితం జరిపిన ఫోన్ ఇంటర్వ్యూలో కుండబద్దలుకొట్టినట్టుగా ఖాదీపై తన అనుభవాలను పంచుకున్నారు.

ప్రశ్న : నమస్తే సార్ బాగున్నారా. ఆరోగ్యం ఎలా ఉంది?

అక్కినేని : ఆరోగ్యమా బాగుందంటే బాగుంది. చెప్పండి.

ప్రశ్న : ఖాదీ వస్త్రాలను ఎన్నాళ్లనుంచి ధరిస్తున్నారు.?

అక్కినేని : నేను సినిమాల్లో చేరకముందునుంచే ఖాదీ వస్త్రాలను ధరిస్తున్నాను. 1940 ప్రాంతంలో ముగ్గురు శ్రేయోభిలాషుల సూచనలు మేరకు గుడివాడలో జవహర్ ఖాదీ బాండారును ప్రారంభించాం.

ప్రశ్న : ఖాదీ వస్త్రాలపై మీ అభిప్రాయం?

అక్కినేని : అదే చెప్పబోతున్నాను. పంచె, లాల్చి కొనాలంటే ఆరేడు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నా విషయం వదిలేయండి. ఖాదీ వస్త్రాల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేవు. ఈ పరిస్థితి మారాలి.

ప్రశ్న : మీ సూచనలు, సలహాలు తెలియజేస్తారా?

అక్కినేని : కొంచెం తక్కువ రకం నూలు కలిపైనా ఖాదీ వస్త్రాలను చౌకగా

విక్రయించాలి. అలాఐతేనే పరిశ్రమ నిలదొక్కు కుంటుంది. మీ పొందూరు వాళ్లుసైతం సింథటిక్ వస్త్రాలను ధరిస్తున్నారనుకుంటాను. పాత పద్ధతుల్లోనే పరిశ్రమ కొనసాగడం వాంఛనీయం కాదు. అందరూ ఖాదీ ధరించాలంటే చౌకగా లభించాలి. మరీ సీత, సావిత్రిలా మడి కట్టుకుంటే ప్రయోజనం ఉండదు (నవ్వులు).

ప్రశ్న : ప్రతీ రోజు మీరు ఖాదీ వస్త్రాలు ధరిస్తుంటారా?

అక్కినేని : గతంలో 365రోజులు ధరించే వాడిని. ప్రస్తుతం 160రోజులు మాత్రమే వాడుతున్నాను.

ప్రశ్న : ఎందుకిలా ?

అక్కినేని : వస్త్రాలు ఒక్కపూట ధరించినా ముడతలుపడుతున్నాయి, నాణ్యత లోపించింది, సరైన జరీ రావడంలేదు, మనవళ్లను సరదాగా ఎత్తుకోవాలనుకున్న వస్త్రాలు నలిగిపోతాయని సంకోచిస్తున్నాను. చలువ చేయడానికి సరైన రజకుడుకూడా దొరకడంలేదు. సినిమాల్లో రకరకాల దుస్తులు వేసుకోవాల్సి ఉంటుంది. అయితే రొటీన్‌కు విభిన్నంగా మీటింగులకు ఎళ్లేటప్పుడు తప్పనిసరిగా ఖాదీనే వాడుతుంటాను. కనీసం 60శాతం మందైనా ఖద్దరు ధరించే పరిస్థితి రావాలి. ఇప్పటికే ఖాదీ వినియోగదారులు తగ్గిపోతున్నారు.

ప్రశ్న : చివరగా మీ అభిప్రాయం చెబుతారా?

అక్కినేని : నేను ఖాదీ ప్రేమికుణ్ణి. ఈ వస్త్రాలను ధరిస్తే ప్రత్యేకంగా కనిపిస్తాం. ఈ పరిశ్రమకు మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నాను. మీరు ఖాదీపై పుస్తకం రాస్తున్నందుకు సంతోషంగా ఉంది. మంచి జరగాలని కోరుకుంటున్నాను.

---

**కవర్‌పేజీ ముఖచిత్రాలు :** మొదటి వరుసలోగాంధీజీకి ఎడమ పక్కన దేవదాస్‌గాంధీ, కుడి పక్కన తారాభట్టాచార్జీ (గాంధీజీ మనుమరాలు), రెండో వరుసలో 1) ఎ.ఎన్.ఆర్. 2) వినోబాభావే 3) మల్లెమడుగుల కోదండ రామస్వామి.

# : రచయిత పరిచయం :



రచయిత : **వాండ్రంగి కొండలరావు**

జన్మస్థలం : వాండ్రంగి

స్థిర నివాసం : పొందూరు

సంచార వాణి : 9490595391

తలిదండ్రులు : **రాధా కాంతమ్మ, చిన గురుమూర్తి**

ధర్మపత్ని : రమాదేవి

గురువులు : వి.కృష్ణదాస్(వాండ్రంగి)
అల్లంశెట్టి కాశిబాబు
డా॥ కె.వి.ఆర్.నరసింహం (ఎ.యు).
డా॥ చిలుకూరి సుబ్రమణ్యశాస్త్రి (ఎ.యు).
డా॥ ఎక్కిరాల కృష్ణమాచార్యులు (ఎ.యు).

వృత్తి : విశ్రాంత ప్రథమశ్రేణి తెలుగు పండిట్

ప్రవృత్తి : సీనియర్ పాత్రికేయులు, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
(పత్రికా రంగంలో 37ఏళ్ల అనుభవం)

రచనలు : ఈనాడు, సాక్షి, ఆంధ్రభూమి దినపత్రికలు, బాలబాట, పండిత భారతి తదితర మాస పత్రికల్లో వివిధ వ్యాసాలు ముద్రితమయ్యాయి.
శ్రీ.గురమ్మపేరంటాలు కథ-మహిమలు (గ్రంథం)
సాయి శరణు (గ్రంథం)
శ్రీ సురవరం బాల అన్నమ్మతల్లి కథ - మహిమలు (ఈ రచనను మిత్రులు శ్రీ బి.భూపతిరావు గారితో కలసి విడుదలచేయడమైనది).

అవార్డులు : ➢ తే05-09-1980దీన"ఈనాడు"లో ప్రచురితమైన "చెయ్యని నేరానికి చిత్రహింసలపాలు" అనే సంచలన కథనానికి తే17-09-1980దీన గౌ॥ ఛైర్మన్ సి.హెచ్.రామోజీరావు నుంచి ప్రశంసాపత్రం.

- ఈనాడు దిన పత్రికలో విశిష్ట సేవలకు గుర్తింపుగా తే20-03-1991దీన ఛైర్మన్ సి. హెచ్. రామోజీరావు చేతులు మీదుగాఉత్తమ అవార్డు.
- తే23-03-2001దీన శ్రీకాకుళం, జన కళ్యాణ్‌మంచ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం పురపాలిక మాజీ ఉపాధ్యక్షురాలు శ్రీమతి గుండ లక్ష్మీదేవి, మంచ్ అధ్యక్షులు కోనె శ్రీధర్ చేతుల మీదుగా ఉగాది పురస్కారం.
- తే08-01-2006దీన పండిత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం హిందీ విద్యాలయంలో ఘన సత్కారం.
- తే 21-02-2006దీన పొందూరులో ఉపాధ్యాయ పండితపరిషత్, వివిధ స్వచ్ఛందసంస్థల ఆధ్వర్యంలో జరిగిన మాతృభాష పరిరక్షణ సభలో జిల్లా కలెక్టర్ అట్లూరి కోటేశ్వరరావు నుంచి భాషా పురస్కారాన్ని అందుకున్నారు.
- తే 25-03-2006దీన పొందూరులోని యర్రావారి కళ్యాణమండపంలో మైత్రీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మాతృభాషా పరిరక్షణ సదస్సులో అప్పటి జిల్లా ఎస్పీ ఎ.ఎస్.గురప్ప, ఐ.పి.ఎస్. గారి చేతులమీదుగా పురస్కారం.
- తే29-10-2010దీన శ్రీకాకుళం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో డి.కె.స్మారక అవార్డు ప్రదానం.
- తే17-01-2013దీన గుర్రాలపాలేంలో జరిగిన శ్రీ గురమ్మపేరంటాలు జాతర సందర్భంగా ఎచ్చెర్ల శాసనసభ్యులు గౌ॥ మీసాల నీలకంఠం నాయుడు, ఎచ్చెర్ల మార్కెట్ కమిటి అధ్యక్షులు రొక్కం బాలక్రిష్ణ చేతులుమీదుగా ఘన పురస్కారం.
- తే23-04-2013దీన ప్రపంచ పుస్తక దినోత్సవ సందర్భంగా ఆ ఇల్లే ఓ గ్రంధాలయం అనే శీర్షికతో కొండలరావు మాస్టారిపై విశాలాంధ్ర దినపత్రిక ప్రధాన సంచికలో ప్రత్యేక కథనం.
- పొందూరు ఎ.ఎఫ్.కె.కె. సంఘం యాజమాన్యం పక్షాన అప్పటి కార్యదర్శి దున్న పాపారావు చేతులుమీదుగా పురస్కారం.
- పొందూరు లయన్స్‌క్లబ్ పూర్వ అధ్యక్షులు, ప్రముఖ రచయిత, ఎ.వి.రాజాగారి చేతులుమీదుగా సత్కారం.

# పొందూరు మరోపోర్‌బందర్

మహాత్మా గాంధీ గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించినప్పటికి ఆయన ఆశయాలైన ఖాదీ, చేనేత, గృహపరిశ్రమలు, వ్యవసాయం తదితరమైనవి శ్రీకాకుళం జిల్లా పొందూరులో చక్కగా అమలౌతున్నాయి. గ్రామ స్వరాజ్యం, స్వయం సమృద్ధితో పొందూరు విరాజిల్లుతోంది. గాంధీజీ మెచ్చిన పొందూరు నేడు పర్యాటక కేంద్రంగా కూడా విలసిల్లుతోంది. మహాత్ముని పేరుతోనే గాంధీనగరం ప్రాంతం ఇక్కడ వెలసింది. ఆయనపై కృతజ్ఞతాపూర్వకంగా ఈ పేరును ఖాదీకార్మికులు పెట్టుకున్నారు. గృహ పరిశ్రమలతో పాటు కళా, విద్యా రంగాలలో ఈ గ్రామం అగ్రగామిగా ఉంది. అంచేతనే పొందూరును మాలతీచందూర్ (బహుముఖ ప్రజ్ఞాశాలిని) గా పలువురు వ్యాఖ్యానిస్తుంటారు. జాతీయ, అంతర్జాతీయ రంగాల్లో పొందూరు ఖాదీ కీర్తి కిరణాలు వ్యాపిస్తున్నాయి.

మెరుపు మెరిసినట్టు, వానజల్లు కురిసినట్టు, చిత్రకారుని కుంచె కదిలినట్టు, సంగీత వేత్త తానం ఆలపించినట్టు, పాడవే రాట్నమా ప్రణవ భారతి గీతి అని ఆడుతూ, పాడుతున్నట్టు నేటికిని పలు పల్లెల్లో ఖాదీ వైభవం చెక్కుచెదరకుండా జీవన ప్రవంతిలో కొనసాగడం బాపూజీ సంకల్ప బలమే. రాజనీతిలో అహింస, అర్థ శాస్త్రంలో ఖాదీ నిత్యనూతన సాధనం.

సత్యం అహింసలపై నిర్మితమైన ఆర్థిక, సామాజిక వ్యవస్థ నిర్మాణానికి కుటీర పరిశ్రమలు పునాది వంటివి. అందులోనూ ఖాదీ పరిశ్రమ గ్రహమండలంలో సూర్యునివంటిదని గాంధీజీ అంటారు. రాజనీతిలో అహింసకు ఎంతటి ఉన్నత స్థానం ఉందో, అర్థ శాస్త్రంలో ఖాదీకి అట్టి ప్రముఖ స్థానం ఉంది. కదురు, కవ్వం ఆడేచోట కరువు, కాటకాలు ఉండవు. ఈ స్ఫూర్తికి పొందూరు ప్రతీకగా నిలుస్తుంది. నాట్యం అనగానే కూచిపూడి ఎలా గుర్తుకువస్తుందో, పొందూరు మాట వినగానే స్ఫురించేది ఖాదీయే. స్వరాజ్య సమరంలో తెల్లవారి గుండెల్లో దడ పుట్టించిన అంశాలు ఉప్పు, చరఖా, ఖాదీ. విభిన్న మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు కలిగియున్న ఈ దేశంలో ప్రజలందరినీ ఏకోన్ముఖం చేసిన ఘనత ఖాదీకే దక్కుతుంది.

గాంధీజీ పిలుపు మేరకు విదేశీ వస్త్ర బహిష్కరణ, వస్త్ర దహనంలో ఉద్యమం పతాక స్థాయికి చేరుకొని ఖాదీ స్వదేశీ ఉద్యమంగా రూపుదిద్దుకుంది. ఇది ఇలా ఉండగా ఆంధ్ర ప్రాంతంలో అప్పటికే బాగా వాడుకలో ఉన్న సన్ననూలు వస్త్రాలు 1921లో గాంధీజీ దృష్టికి వచ్చాయి. ఆ వస్త్రాల నాణ్యతను చూసి బాపూజీ ఆశ్చర్యపోయారు. ఆయన వెంటనే వడుకునేత విధానాలను పరిశీలించి నివేదికను సమర్పించాలని తన కుమారుడైన దేవదాసు గాంధీకి పురమాయించారు. ఈ మేరకు దేవదాసు గాంధీ అంపోలు, బొంతలకోడూరు తదితర ప్రాంతాల్లోని సన్ననూలు వడుకునేత విధానాలను స్వయంగా పరిశీలించి తండ్రికి నివేదించారు. ఆ విషయాన్ని బాపూజీ " యంగ్ ఇండియా " పత్రికలో ప్రకటించారు. అప్పటి నుంచి శ్రీకాకుళం జిల్లా సన్ననూలు వస్త్రాలకు అందున పొందూరు ఖాదీ వస్త్రాలకు అఖిల భారతంలో ఎనలేని ప్రచారం ఆదరణ లభించాయి. చరిత్ర పేజీలను తిరగేసి చూస్తే ఒకప్పుడు జమిందారులు, సంస్థానాధీశులు ఈ పరిశ్రమకు చేయూతనివ్వగా ప్రస్తుతం ప్రజలు, ప్రభుత్వం సహకరిస్తున్నాయి. మరీ గొప్ప విశేషమేమిటంటే 1924లో వెంబ్లెలో నిర్వహించిన బ్రిటిష్ ఎంపైర్ ఎగ్జిబిషన్‌లో పొందూరు, బొంతలకోడూరుకు చెందిన ఖాదీ వస్త్రాలను ప్రదర్శించారు. ఇది ఖాదీ చరిత్రలోనే మరో మైలురాయి. ఈ ఎగ్జిబిషన్‌కు బ్రిటిష్ రాజు అధ్యర్యం వహించారు. ఈ సందర్భంగా ఖాదీ పక్షాన ప్రతినిధిగా వెళ్లిన శంకరశాస్త్రికి ఓ పతకాన్ని, యోగ్యతా పత్రాన్ని అందజేశారు

కొన్ని వందల ఏళ్ళ పాటు పొందూరు ఖాదీ అసంఘటిత రంగంలో ఉండేది. తే06-04-1949దీన ఆంధ్ర పట్టుశాలి కార్మికాభివృద్ధి సంఘం(ఎ.పి.కె.కె.)గా అవతరించింది. అయితే పేరులో కుల ప్రస్తావన ఉన్నందున ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు చేయడం సాధ్యంకాదని 1953 అక్టోబర్ 1న ఏర్పాటైన ఆంధ్రరాష్ట్ర మంత్రివర్గంలో ఆర్థిక శాఖా మంత్రిగా పనిచేసిన తెన్నేటి విశ్వనాథం పేర్కొన్నారు. ఈ మేరకు ఖాదీ సంఘం పేరును, ఆంధ్ర సన్నఖాదీ కార్మికాభివృద్ధి సంఘం(ఎ.ఎఫ్.కె.కె.)గా మార్పు చేసారు. ఖాదీ పరిశ్రమ ఆంధ్ర సన్నఖాదీ కార్మికాభివృద్ధి సంఘం (ఎ.ఎఫ్.కె.కె.) గా

అవతరించింది. 1955 అక్టోబర్, 13న సంఘ భవనానికి ప్రముఖ సర్వోదయ నాయకుడు ఆచార్య వినోబాభావే శంకుస్థాపన చేసారు. ఆయనకు సన్ననూలుతో తులాభారం చేసిన సంఘటన ఖాదీ చరిత్రలో ఓ సువర్ణ అధ్యాయమని పేర్కొనక తప్పదు. దేశం మొత్తంమీద అత్యున్నత ప్రమాణాలు గల సన్నఖాదీ (నూరవ కౌంటు) కేవలం శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే తయారవడం విశేషం. సన్నఖాదీ ఉత్పత్తి వ్యవస్థను శాస్త్రీయ దృక్పదంతో పరిశీలించి దానికి సాంకేతిక ప్రమాణాలను నిర్వహించి క్రమబద్ధం చేసిన మనీషి, ఖాదీ ఉద్యమ పితామహుడైన మల్లెమడుగుల కోదండరామస్వామి. ఆయన చేసిన నిరంతర సేవలు ఇక్కడ ఖాదీ పరిశ్రమకు ఊపును, స్ఫూర్తినిచ్చాయి. దేశం మొత్తం మీద కేవలం శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే కొండపత్తిని ఉపయోగించి ఖాదీ వస్త్రాలను రూపొందిస్తున్నారు. ఇక పొందూరు సన్నఖాదీ వస్త్రాలను తయారు చేయడానికి ముఖ్యంగా కావలసింది ఒక చేపముల్లు అంతే. ఒకింత ఆశ్చర్యం కలుగుతుంది. పత్తిలోని ఆకుపొల్లును తొలగించి దానిని ధగధగ మెరిసేలా చేసేది ఈ ముల్లే. వాలుగు చేప దవడక్రింది, మీది భాగాలను శుభ్రపరచి ఎండలో ఆరబెట్టి నాలుగు ముక్కలుగా కోస్తారు. తరువాత ముక్కలను పెన్సిల్ సైజ్ కర్రలకు కదలకుండా కట్టి దాని సాయంతో గింజలో ఉన్న ముడి పత్తిని శుభ్రం చేస్తారు.

పొందూరు ఖాదీ సంస్థ పరిదిలోని 40 గ్రామాల్లో 1100 మంది వడుకుపని మహిళలు ఈ చేపముల్లును వాడుతున్నారు. బాణం వంటి సాధనంతో పత్తిని ఏకి, ఏకులుగా చేసి రాట్నంపై సన్నటి నూలు తీస్తారు. సన్నఖాదీ, పాట్నూలు వస్త్రాలు ఇక్కడి పట్టుశాలీపేట, వాండ్రంగి వీధితో పాటు చాటాయవలసల్లో నేస్తున్నారు. మొత్తం 100 మంది నేత పనివారు పరిశ్రమను అంటిపెట్టుకొని జీవనయానం సాగిస్తున్నారు. ఈ పరిశ్రమ వడ్రంగులకు, రజకులకు పరోక్షంగా ఉపాధి కల్పిస్తుంది. తయారైన వస్త్రాలను ఇక్కడికి సమీపంలోని ఆనందపురంలో గల రజకులు చలువ చేస్తుంటారు. 1971-72 ప్రాంతంలో ఈ ఖాదీ సంస్థ రూ॥ 5 లక్షలు విలువచేసే వస్త్రాలను మాత్రమే ఉత్పత్తి చేసేది. ప్రస్తుతం రూ॥ 2కోట్లకు పైగా వస్త్రాలను ఉత్పత్తిచేస్తూ ముందంజలో ఉంది. ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకొన్న ఈ పరిశ్రమ కీర్తికిరణాలు విదేశాలలో కూడా ప్రసరిస్తున్నాయి.

ఖాదీ సంస్థ ప్రగతికి అప్పటి అధ్యక్షులుగా వ్యవహరించిన అల్లంశెట్టి గవరయ్య ఎంతో కృషిచేసారు. కెనడా, అమెరికా, జర్మనీ, డెన్‌మార్క్, నార్వే, స్వీడన్, జపాన్ వంటి దేశాల నుండి కూడా పర్యాటక బృందాలు ఇక్కడి ఖాదీ పరిశ్రమను సందర్శించి ప్రశంసించాయి. 2000 సం॥లో అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ హైదరాబాద్ వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పొందూరు ఖాదీ వస్త్రాలను సమర్పించింది. 1996 మే నెలలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ **(NIFT)** తమిళనాడు కేంద్ర పరిశోధన విభాగం విద్యార్థులు స్థానిక ఖాదీ సంస్థను సందర్శించి కార్మికుల హస్తకళానైపుణ్యాన్ని పరిశీలించి తన్మయులయ్యారు. సింహాచలం దేవస్థానానికి ఇక్కడి ఖాదీవస్త్రాలను సమర్పించిన సందర్భాలున్నాయి.

ఢక్కా మస్లిన్ వస్త్రాలతో పొందూరు ఖాదీని సరిపోల్చవచ్చునని జాగృతి (ముంబై) పత్రిక ప్రశంసించింది. 1992లో న్యూఢిల్లీలో ఆసియా 72 ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన సన్నఖాది వడుకునేత ప్రక్రియలను నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్వయంగా పరిశీలించి కార్మికుల హస్తకళానైపుణ్యాన్ని అభినందించారు. ప్రతి ఏటా ఇక్కడి కార్మికులు దేశంలో జరిగే వివిధ ఎగ్జిబిషన్‌లలో పాల్గొని తమ సత్తా చాటుతున్నారు. అఖిలభారత ఖాదీ మిషన్ కన్వీనర్ బాల విజయ్ (వార్ధా) ఈ సంస్థను సందర్శించి ఆశీస్సులందజేసారు. మాజీ గవర్నర్ శారదా ముఖర్జి, మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు, ప్రముఖ సినీ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సహస్రావధాని, అవధాన సరస్వతి మాడుగుల నాగఫణిశర్మ, ప్రముఖ సంపాదకుడు అప్పటి అధికార భాషా సంఘం అధ్యక్షులు గజ్జల మల్లారెడ్డి ఈ పరిశ్రమను సందర్శించిన వారిలో ఉన్నారు.

పొందూరు ఖాదీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షునిగా అల్లంశెట్టి సూర్యనారాయణ (కాకినాడ సూర్యం) వ్యవహరించారు. మాడుగుల పాపారావు, పమ్మిన సూర్యం ఆతరువాత భాస్కరభట్ల వెంకటరమణ (చిట్టిపంతులు), కొద్దికాలం ఈ పదవిని నిర్వహించారు. ఆ పిమ్మట ప్రముఖ గాంధేయవాది, ఖాదీ ఉద్యమ నేత, మల్లెమడుగుల కోదండరామస్వామి అధ్యక్షపదవిని చేపట్టిన తరువాత ఖాదీ సంస్థ రూపురేఖలు మారిపోయాయి. సన్నఖాదీకి శాస్త్రీయమైన నిబంధనలను రూపొందించిన ఖ్యాతి కోదండరామస్వామికే దక్కుతుంది.

ఆయన హయాంలో ఖాదీ నిర్వహణ స్వర్ణయుగంగా తలపించింది. వాడపల్లి

హనుమంతురావు ఆర్గనైజర్‌గా పనిచేసి విశిష్ఠ సేవలందించారు. ఆ తరువాత అల్లంశెట్టి మల్లిబాబు, చందనాల జగన్నాధరావు, మల్లెమడుగుల కోదండరామాస్వామి, అల్లంశెట్టి గవరయ్య, పేకల చిట్టిబాబు, మాసాడ నారన్నాయుడు, జి.కె.ప్రసాద్ సంస్థ అధ్యక్షులుగా పనిచేసారు. వీరిలో కోదండరామస్వామి, అల్లంశెట్టి గవరయ్య సుదీర్ఘ కాలం ఈ సంస్థను ముందుకు నడిపించారు. ప్రస్తుతం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులుగా ఆట్ల పైడి సూర్యం, గుంటుకు గౌరీ శంకర్, ఉపాధ్యక్షులుగా ఆకాశం మల్లిబాబు, కోశాధికారిగా ఎం.శ్యామలరావు, కార్యవర్గ ప్రతినిధులుగా ఆట్ల వెంకటరమణ ఉరిటి వెంకటసత్యన్నారాయణ, దండా వెంకటరమణ, వంకా జనార్ధన, ఆనెం సూర్యారావు, దుంపా కళావతి, బత్తుల చిన్నమ్మడు వ్యవహరిస్తున్నారు.

1992 గణతంత్ర దినోత్సవం నాడు కె.వి.ఐ.సి. ఛైర్మన్ డా॥ యశ్వీర్‌సింగ్ స్థానిక ఖాదీ సంస్థను సందర్శించి పొందూరు ఖాదీకి ఉన్న ప్రత్యేకత మరిదేనికీ లేదని కితాబునిచ్చారు. మహాత్మాగాంధీ మనుమరాలు కె.వి.ఐ.సి. తూర్పుమండల ప్రతినిధి తారా భట్టాచార్జీ మొత్తం 3సార్లు ఇక్కడి ఖాదీ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమం కోసం రూ॥ 30వేలు ఆర్థిక సాయాన్ని అందజేసారు. 1997 డిసెంబరు 9న ఇక్కడి ఖాదీ కార్యాలయ ఆవరణలో ప్రముఖ శిల్పి దివిలి అప్పారావు రూపొందించిన బాపూజీ విగ్రహాన్ని తారాభట్టాచార్జీ ఆవిష్కరించారు.

పొందూరులో 2, రాజాంలో 2, శ్రీకాకుళం, పాలకొండ, మిళియాపుట్టి, చీపురుపల్లిలలో ఒక్కో ఖాదీ విక్రయశాల వంతున ఉన్నాయి. కురిమిపేటలో ఖాదీ వస్త్ర ఉత్పత్తికేంద్రం ఉన్నాయి.

**: అక్కినేని అంచు పంచెకు ఎనలేని గిరాకి :**

ప్రఖ్యాత సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు ప్రతీఏటా ఖాదీ సంస్థ నుండి రూ॥ 40వేలు విలువచేసే వస్త్రాలను తెప్పించుకుంటున్నారు. పలు సినిమాల్లో ఆయన పొందూరు ఖాదీ ప్రసక్తిని తెచ్చి ప్రోత్సహిస్తున్నారు. అక్కినేని అంచు పంచెలకు మంచి గిరాకీ ఉంది. అక్కినేని సొంతంగా ఒక అంచును ప్రత్యేకంగా 40 ఏళ్ల

క్రితం డిజైన్ చేయించారు. దాన్ని పొందూరు ఖాదీ కార్యాలయానికి పంపించారు. ఆ డిజైన్ చూడగానే పొందూరు కార్మికులు ఎంతో సంతోషించారు. అక్కినేని కోరుకున్నట్టే అదే డిజైన్ అంచుతో పంచెను డిజైన్‌చేసి అయనకు ఇచ్చారు. అక్కినేని డిజైన్ చేసిన అంచు పంచెలు మార్కెట్‌లో హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. అక్కినేని పంచె అంచుల గూర్చి చెప్పుకోవాలంటే : ఇవి రెండు రకాలు 5 సెం॥మీ॥ వెడల్పుతో ఉన్న అంచను సింగిల్ బోర్డర్ అంటారు. 10సెం॥మీ॥ వెడల్పు ఉన్న అంచును డబుల్ బోర్డర్ అంటారు.

ఈ అంచులు చాలా వరకు ఆకుపచ్చ లేదా ఊదా లేదా కెంపు రంగుల్లో ఉంటాయి. ఈ పంచెలను నేయడానికి 100వ కౌంట్ దారాన్ని వాడతారు. సూరత్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన బంగారం జెరీని వీటిలో ఉపయోగిస్తుంటారు. సింగిల్ బోర్డర్ ఉంటే దాని కరీదు రూ॥ 4 వేలు, డబుల్ బోర్డర్ అంచు ధర రూ॥ 7వేలు వరకు ఉంటుంది. ప్రతీ ఏటా 6, 7 లక్షలు విలువచేసే ఎ.ఎన్.ఆర్. అంచు పంచెలను ఇక్కడ ఉత్పత్తి చేస్తున్నారు. ప్రముఖ రాజకీయ నాయకులు (తమిళనాడు గవర్నర్) కె. రోశయ్య,. ఆనం రామనారాయణరెడ్డి సోదరులు, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప, ప్రఖ్యాత కవి డా॥ సి. నారాయణరెడ్డి వంటి ప్రముఖులు ఈ పంచెలను కొనుగోలు చేస్తున్నారు. ఈ పంచెలను రూపొందించడంలో ఖాదీ కార్మికులు పూండ్రు సూర్య ప్రకాశరావు, కందాన వీర్రాజు సిద్ధహస్తులు. మాజీ రాష్ట్రపతి ప్రతిభాపాటిల్‌కు చీర నేసిన ఘనత బస్వా మోహనరావు దంపతులకు దక్కుతుంది. 2013 ఆగష్టు 15న ఆయనకు జిల్లా పాలనా యంత్రాంగం ఉత్తమ అవార్డునిచ్చి సత్కరించారు. ఇక ప్రైవేట్ ఖాదీలో యూ.పి.ఎ. ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి, వై.ఎస్.ఆర్.సి.పి. గౌరవ అధ్యక్షురాలు వై.ఎస్, విజయలక్ష్మి కి పొందూరు ఉపసర్పంచ్ కాకర్ల పైడిలింగం ఆధ్వర్యంలో నేత కార్మికుడు అట్ల నీలకంఠం కుటుంబీకులు అపురూపమైన చీరలను నేసి సమర్పించారు.

**ఖాదీపై పరిశోధన :**

సన్నఖాదీ పరిశ్రమపై డా॥ ఉప్పల లక్ష్మణరావు, (బరంపురం) సతీమణి

మెల్లీసోలింగర్ సంయుక్తంగా పొందూరు సన్నఖాదీపై అపురూపమైన సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. ఉద్యోగరీత్యా మాస్కోలో లక్ష్మణరావు పనిచేసిన తరువాత పొందూరు వచ్చి కొన్నాళ్ళపాటు ఇక్కడే ఉండి పరిశ్రమ స్థితిగతులపై అధ్యయనం చేసారు. ఆ దంపతుల కృషిని ఇప్పటికి స్థానికులు గుర్తుచేసుకుంటారు.

## ఖాదీపై సిద్ధాంత గ్రంథం :

### డా॥ ఉట్ల అప్పారావు :



నరసన్నపేట మండలం కిల్లాం గ్రామానికి చెందిన డా॥ ఉట్ల అప్పారావు " స్టేట్ ఆఫ్ ఖాదీ ఇండస్ట్రీ ఇన్ ఆంధ్రప్రదేశ్ " అనే సిద్ధాంత గ్రంథాన్ని రాసారు. ఈ గ్రంథానికి 2005లో ఆంధ్రవిశ్వవిద్యాలయం పిహెచ్.డి ని ఆయనకు ప్రదానం చేసింది. ఆయన ఈ సిద్ధాంత గ్రంథంలో శ్రీకాకుళం జిల్లా ఖాదీపై ప్రత్యేకంగా పలు విషయాలను రాసారు. ఈ గ్రంథంలో కార్మికులు వడుకు పనివార్ల ఆర్థిక సామాజిక పరిస్థితులను చిత్రీకరించారు. ఆచార్య బి.రామక్రిష్ణారావు మార్గదర్శిగా వ్యవహరించారు. డా॥ అప్పారావు శ్రీకాకుళం జిల్లా చేనేత పరిశ్రమపై పరిశోధనచేసి ఎం.ఫిల్ డిగ్రీని పొందారు. ప్రస్తుతం డా॥ అప్పారావు అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులుగా పనిచేస్తున్నారు. అంతకుముందు విశాఖ, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వాణిజ్య విభాగాలలో ఉపన్యాసకునిగా పనిచేసారు. ప్రముఖ చేనేత నాయకుడు వట్టి పార్వతీశం (మాజీ ఆప్కో డైరెక్టర్) వట్టి పార్వతీశం ప్రేరణతో పరిశోధనలు జరిపారు.

## : ఖాదీలో జాతీయ అవార్డు గ్రహీతలు వీరే :

### మాడుగుల సూరమ్మ :

గ్రామీణ హస్తకళల్లో కేంద్ర ప్రభుత్వం ఏటా ఇచ్చే జాతీయ అవార్డు (2006 - 07) పొందూరుకు చెందిన మాడుగుల సూరమ్మ (సూర్యం) దక్కించుకుంది. న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో అప్పటి కేంద్ర రక్షణ మంత్రి ప్రణబ్ ముఖర్జీ రూ॥ 25వేలు నగదు ప్రశంసా పత్రాన్ని సూరమ్మకు

అందజేసారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ధరించిన జరీ అంచుచీరల్లో తాను వడికిన నూలు దారాన్ని ఉపయోగించడం తనకెంతో ఆనందం కలిగించిందని పేర్కొంటారు. ఖాదీ ఉద్యమ పితామహుడు మల్లెమడుగుల కోదండరామస్వామి, విజయలక్ష్మి దంపతులు అందజేసిన రాట్నాన్ని ప్రాణప్రదంగా చూచుకుంటున్నానని సూరమ్మ తనకు అవార్డు వచ్చిన సందర్భంగా తెలియజేసారు. అయితే ఇటీవలే ఆమె కాలధర్మం చెందారు.

**మలిపెద్ది రామారావు:**

న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ స్వర్ణజయంతి ఉత్సవాల్లో స్థానిక ఎ.ఎఫ్.కె.కె. సంఘానికి చెందిన మలిపెద్ది రామారావు జాతీయ ఉత్తమ నేత కార్మిక అవార్డు లభించింది. ఈ అవార్డును కేంద్ర కార్మిక ఉపాధిశాఖామంత్రి ఆస్కార్‌ఫెర్నాండెజ్ చేతులుమీదుగా రామారావు అందుకున్నారు. రూ॥10వేల నగదు, స్వరణ పతకం, ప్రశంసాపత్రం లభించాయి. అయితే ప్రస్తుతం రామారావు ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉండడంతో ఈ పరిశ్రమకు దూరమైనప్పటికి తన కుటుంబీకులచే ఖాదీవడుకుపనిని చేయిస్తున్నారు.

**: ఖాదీ, నేత వడుకు పనివారల్లో ప్రసిద్ధులు :**



బస్వా మోహనరావు



పూంద్రు సూర్యప్రకాశరావు



కందాన వీర్రాజు



పేకల అమ్మలు



కోరుకొండ సరోజిని



ఆట్ల నీలకంఠం



ఆకాశం పైడిరాజు



యర్రా నందీశ్వరరావు

## డా॥ మాడుగుల నాగఫణిశర్మ
### సహస్రావధాని

2001 ఆగష్టు, 8న ప్రఖ్యాత సహస్రావధాని, అప్పటి రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు మాడుగుల నాగఫణిశర్మ పొందూరు ఖాదీ సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అమృత హస్తాలతో రాసిన ఓ పద్యం ఖాదీ చరిత్రలో ఓ ఆణిముత్యంగా నిలుస్తోంది. అపద్య రత్నాణ్ణి ఓసారి చూద్దామా...

పొందూరు ఖద్దరనగా
అందమ్మును చిందు అంచు
అంచల వలె - రూ
పొందిన సరస్వతీ శ్రుతి
సుందర వాహనము ఘనము
శుభమౌ మీకున్!

ఈ ఆశు పద్యంలో పొందూరు అంచు పంచెలను నాగఫణిశర్మ హంసలతో పోల్చి రాసిన తీరు అద్భుతం, అమోఘం. పొందూరు ఖద్దరు అంటే ఆయనకు పంచప్రాణాలు. అంచేతనే ఖాదీ కార్యాలయ సందర్శకుల పుస్తకంలో ఈ పద్యాన్ని రాసారు. ఇలా ఖాదీకి ఆయన నీరాజనం పలికారు.

## : ప్రగతి పథంలో సాయిబాబా చేనేత సహకార సంఘం :

పొందూరులోని సాయిబాబా చేనేత సహకార సంఘం ప్రగతి పథంలో దూసుకొనిపోతోంది. ఈ సంఘం తే01-02-1942దిన ఏర్పాటైంది. మొత్తం 269 మంది చేనేత కార్మికులు ఈ సంఘం పరిధిలో ఉన్నారు. ఈ సంఘం ఏటా రూ॥ 55 లక్షల విలువ చేసే వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నది. రూ॥ 65 లక్షల మేరకు వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. సొసైటీ ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలను ఆప్కో దస్తకర్ ఆంధ్ర (సికింద్రాబాద్) కొనుగోలుచేస్తూ ప్రోత్సహిస్తున్నాయి. సాదా, గడులు, డోరియా, ఏ.ఎన్.ఆర్. పంచెలను, ధోవతులను ప్రకృతి రంగులు గల చీరలను ఉత్పత్తి చేస్తున్నాయి. వినియోగదారుల కోరిక మేరకు చేతి రుమాళ్లను కూడా తయారుచేస్తున్నారు.

చేనేత రంగ పితామహుడు ప్రగడ కోటయ్య, కాశిన అప్పలనరసయ్య, వట్టి పార్వతీశం తదితరులు సంఘాన్ని పలుసార్లు సందర్శించారు. నావికాదళ అధికారుల సతీమణుల సంఘం అధ్యక్షురాలు (నావా) మధులిక వర్మ, రాగిణి చోప్రా బృందం ఈ సంఘాన్ని దత్తత తీసుకొని వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించింది. పొందూరులో పారిశుధ్య కార్యక్రమాలకు చేయూతనిస్తున్నారు. నావా కు అనుబంధంగా ఉన్న ఉద్యోగిక ద్వారా పొందూరు వస్త్రాలను న్యూఢిల్లీకి తెప్పించుకొని కలంకారి, మధుబని పెయింటింగ్‌లతో పాటు అధునాతన డిజైన్లు రూపొందిస్తున్నారు. నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించి కార్మికులకు కంటి శస్త్ర చికిత్సలను జరిపించడం విశేషం. ఈ సంఘం ఉత్పత్తి చేసిన వస్త్రాలను న్యూఢిల్లీ, అహ్మదాబాద్, పూణే, సికింద్రాబాద్, విజయవాడ, గుంటూరు, ఏలూరు, నెల్లూరు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం తదితర చోట్ల నిర్వహించిన వస్త్రమేళాల్లో ప్రదర్శించారు.

ఈ సంఘ అధ్యక్షులుగా గంపల వీరభద్రస్వామి, ఉపాధ్యక్షునిగా ఆకాశం సత్యారావు, మేనేజర్‌గా కొడమటి కృష్ణారావు, డైరెక్టర్లుగా జాడ సాంబశివరావు, ఆకాశం వెంకటరావు, తూతిక నర్సింగరావు, సప్పటి అప్పలరాజు, అంకం సన్యాసిరావు, చందన భారతి, పుచ్చల లక్ష్మి వ్యవహరిస్తున్నారు. పొందూరు కేంద్రంగా భారత ప్రభుత్వ సౌజన్యంతో చేనేత క్లస్టర్‌ను రూ॥ 60లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. దీన్ని శ్రీకాకుళం చేనేత జౌళీశాఖ ఆధ్వర్యం వహిస్తోంది.

## : చేనేతపై పిహెచ్.డి. చేసిన డా॥ జామి భీమశంకర్ :



ఆంధ్ర విశ్వ విద్యాలయం ఎగ్జిక్యూటివ్ మాజీ సభ్యుడు, శ్రీకాకుళం చైతన్య, విద్యాధరి గ్రూప్ విద్యాసంస్థల అధిపతి డా॥ జామి భీమశంకరరావు "శ్రీకాకుళం జిల్లాలో చేనేత పరిశ్రమ స్థితిగతులు ఆదాయ వనరులు, ఉపాధి, ప్రభుత్వసాయం" అనే అంశంపై సిద్ధాంత గ్రంథం రాసారు. ఈ గ్రంథంలో పొందూరుతో సహా 7మండలాలలో క్షేత్ర పర్యటన జరిపి సమగ్ర

సమాచారాన్ని పొందుపరిచారు. ఈయన రాసిన సిద్ధాంత గ్రంథానికి ఆంధ్రవిశ్వవిద్యాలయం 2010లో నిర్వహించిన స్నాతకోత్సవంలో గవర్నర్ నర్సింహన్ గారి చేతులుమీదుగా పి.హెచ్.డి.ని అందుకున్నారు.

## : శ్రీశైలం తలపాగా :

పరమేశ్వరుని పట్ల తమ భక్తి భావాన్ని చాటుకునేందుకు భక్తులు అనేక మార్గాలను అనుసరిస్తుంటారు. శ్రీశైలంలో వెలసిన భ్రమరాంబ, మల్లిఖార్జునులకు స్థానిక చేనేత కార్మికులలో కొందరు భక్తి ప్రపత్తులతో తలపాగా తదితర వస్త్రాలను ప్రతిఏటా మహా శివరాత్రి నాడు శ్రీశైలం మల్లిఖార్జునికి సమర్పిస్తుంటారు. గత 45ఏళ్ల నుండి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. గతంలో దివంగత ఆకాశం ముఖలింగం 33 సార్లు, బూడిద చిన్నారావు, 21సార్లు శ్రీశైలం మల్లన్నకు వస్త్రాలను సమర్పించారు.

## అర్పించే వస్త్రాలివే :

శ్రీశైలం మల్లన్నకు 366 మూరలు (160 మీటర్లు పొడవు 48 సె.మీ. వెడల్పు) ఉన్న తలపాగా, భ్రమరాంబకు 6 మీటర్ల పసుపు అంచు చీర, శెనగల బసవన్నకు 6 మీటర్ల ఎరుపు పంచె సమర్పిస్తుంటారు. ఈ వస్త్రాల నేతకు కనీసం 4 వారాల వ్యవధి పడుతుంది. నేత పూర్తయిన పిమ్మట తలపాగను శివలింగం ఆకారంలో చుట్టి పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తుంటారు.

## : విదేశాలకు ఎగుమతి అవుతున్న పేపర్‌వర్క్ చీరలు :

(చీర ఖరీదు లక్షల్లో...)

కాగితంపై నమూనా ఆధారంగా దారాలతో చూపరులను కట్టిపడేసేలా పొందూరు ప్రాంతంలో చీరలను తయారుచేస్తున్నారు. పేపర్‌వర్క్ జరీ, ముగసిల్క్ (అస్సాంలో లభ్యమయ్యే విశిష్టమైన బంగారు వన్నె పట్టుదారాలు) తదితర చీరలు ఈ తరహాలో తయారువుతున్నాయి. వీటిని కేవలం మగ్గంపై మిల్లులో వాడే రసాయనాల వంటి జోలికి పోకుండా తయారుచేయవచ్చు. యంత్రాలపై తయారుచేసే చీరలకు ఒకవైపే రంగువుంటుంది. నేత చీరలకు రెండువైపులా ఒకేలా ఉంటుంది. పోల్చుకోవడం తేలికకాదు. ఎక్కడా ఉల్టా కనిపించదు. కాగితం

నమూనాప్రకారం చీరలు తయారుచేయడంతో ఫ్యాషన్ డిజైనర్లు, మగువలు వారికి నచ్చిన రీతిలో వీటిని డిజైన్ చేయించుకునే అవకాశం, అవసరమైన 12 రకాల దారాలు ముగ, కాటన్, అంబర్ వంటివి వినియోగిస్తున్నారు. ఈ తరహా చీరలు పొందూరు, తండ్యాంమెట్ట, దేవరవలస, పాతకుంకాం అలాగే రాజాం మండలం పెనుబాక, బొద్దాం, శ్రీకాకుళం మండలం అలికాం, ఆమదాలవలస మండలం వేణమ్మపేట, అక్కులపేట తదితర ప్రాంతాల్లో ఈ తరహా చీరలను నేస్తున్నారు.

"ఈ చీరలు గద్వాల్, బెనారస్, పోచంపల్లి చీరలను మరిపించే విధంగా ఉంటున్నాయి." హైదరాబాద్, ముంబయి, కోల్‌కత్తా, ఢిల్లీలతోపాటు చైనాకు, ప్యారిస్‌కు ఈ చీరలు ఎగుమతి అవుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో చేనేత రంగం చతికిలపడిందని అంతా భావిస్తున్న ఈ తరుణంలో విదేశీ ఆర్డర్లు ఇక్కడి నిపుణులైన కార్మికులకు ఉపాధి మార్గంగా నిలుస్తోంది. ఒక్కోచీర పొడవు రవికతో కలుపుకొని 7 మీటర్లు ఉంటుంది. ఈ చీరల అంచులు రాణీరంగు, ఊదా, పసుపుపచ్చ, ఆకుపచ్చ, లేతఆకుపచ్చ రంగుల్లో ఉంటాయి. బంగారు వెండి జరీలను పొందుపరుస్తారు. చీర తయారు కావడానికి 60 రోజుల నుండి 90 రోజుల వ్యవధి తీసుకుంటుంది. విదేశాల్లో ఒక్కో చీర ఖరీదు రూ॥ 3లక్షల నుండి 4లక్షల వరకు పలుకుతోంది. ఆలీవర్, పైజాల్ రకం డిజైన్‌లకు గిరాకీ అధికంగా ఉంటుంది. పొందూరులో కాలెపు గోవిందరావు-రాజేశ్వరి దంపతులు, యర్రా నందీశ్వరరావు దంపతులు, తండ్యాం మెట్ట ప్రాంతంలో అంకం వీర్రాజు, అంకం పైడిసూరి, కాలెపు రమణ, బసవరాజు, దేవరవలసలో బూడిద సత్యారావు తదితరులు ఈ తరహా చీరలను నేస్తున్నారు.

## :"పట్టు"దలతో "పట్టు"పరిశ్రమ:

ఖాదీ చేనేత పరిశ్రమకు ఆటపట్టుగా ఉన్న పొందూరు పట్టు వస్త్రాల నేతలో కూడా ముందంజ వేస్తుంది. ఇందులో మహిళా కార్మికులే కీలక పాత్రను పోషిస్తున్నారు. పట్టు పరిశ్రమ పరిస్థితి కాస్తా మెరుగ్గా ఉండడంతో పలువురు మహిళలు దీనిపై ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిశ్రమ 1999 నుండి ఇక్కడ

కొనసాగుతుంది. బత్తుల వీధి, బరంపురంవీధి, కొండవీధులకు చెందిన 25 కుటుంబాలు పట్టు వస్త్రాల నేతలో నిమగ్నమైఉన్నాయి. వీరు వివిధ రకాల పట్టుచీరలను, పంచెలను నేస్తున్నారు. ఇందులో ఎలాంటి శిక్షణాలేకుండా స్వయంకృషితోనే ముందడుగు వేస్తుండటం విశేషం. అనంతపురం జిల్లా ధర్మవరం పట్టు వస్త్రాలకు దీటుగా జరీ అంచుపంచెలు, చీరలు నేస్తున్నారు. పంచె లేదా చీరను నేసేందుకు కనీసం 2 నుండి 3రోజులు పడుతుంది. 5.5 మీటర్ల పంచె ఖరీదు రూ।। 3,500 నుండి రూ।। 3,700 ఉంటుంది. అదే నిడివి గల చీర ధర రూ।। 4వేల నుండి రూ।। 5వేల వరకు పలుకుతోంది. వస్త్రాల బరువును బట్టి ధర ఉంటుంది. బరంపురం నుండి పట్టు, బెంగుళూరు నుండి జరీ తెప్పిస్తున్నారు. జరీని కొన్ని సందర్భాల్లో దళారుల నుండి కొనుగోలు చేస్తుంటారు. పట్టుకుఅవసరమైన రంగులు వేసి నేస్తారు. ఈ వస్త్రాలను బరంపురంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు వారసత్వంగా ఉన్న పట్టు వస్త్రాలను నేయడం ఆనందంగా ఉందని కార్మికులు చెబుతున్నారు.

## ప్రగతి పథంలో - పొందూరు ఆప్కో



1986లో స్థానిక పార్కురోడ్డులో ఏర్పాటైన ఆప్కో ప్రగతి పథంలో పయనిస్తోంది. ఈ విభాగాన్ని అప్పటి ఆప్కో డైరెక్టర్ పాలిశెట్టి మల్లిబాబు ప్రారంభించారు. 1986-87లో కేవలం రూ।। 2 లక్షల విలువ చేసే వస్త్రాలు మాత్రమే అమ్ముడయ్యాయి. 2012-13లో రూ।। 43 లక్షల విలువచేసే వస్త్రాలను విక్రయించారు. 1995 ఏప్రిల్ నుండి 2000 అక్టోబర్ వరకు, అలాగే 2005 నుండి 2013 వరకు స్థానిక ఆప్కో మేనేజర్ డి.. అప్పారావు కృషి ఫలితంగా ఆప్కో విక్రయాలు అనూహ్యంగా పెరిగాయి. అప్పారావు గతంలో ఇచ్ఛాపురం, బరంపురం, శ్రీకాకుళం, సునాబెడ, పర్లాకిమిడి, టెక్కలి ఆప్కో విక్రయ శాఖల్లో పనిచేసి గుర్తింపు పొందారు. 1982లో అప్పటి ఆప్కో ఎం.డి., పి.వి.బిడే నుండి

ఉత్తమ అవార్డును దక్కించుకున్నారు. 1992లో ఆప్కో డి.ఎం.ఓ. సి.హెచ్.సన్యాసిరావు, 2003లో ఆప్కో ఎం.డి., సమీర్ శర్మ 2011-12లో ఆప్కో ఎం.డి. ఎం.బుచ్చిబాబు, 2012-13లో ఆప్కో ఎం.డి. గౌరీ శంకర్‌చే ఉత్తమ మేనేజర్ అవార్డులను స్వీకరించారు. " మాటల మాంత్రికునిగా " పేరుపొందిన అప్పారావు వినియోగదారులను ఆకర్షించుకోవడంలో కృతకృత్యులయ్యారు. 36ఏళ్ల పాటు ఆప్కోలో ఆయనందించిన సేవలు మరపురానివి. అప్పారావు గారి సతీమణి ఇంద్రావతి కూడా ఇదే అప్కోలోనే సేల్స్‌ఉమెన్‌గా పనిచేస్తున్నారు. తే30-11-2013దీన పదవీ విరమణ చేసారు. ప్రస్తుతం ఆప్కో మేనేజర్‌గా వి.శ్రీనివాసరావు పనిచేస్తున్నారు.

## : జ్ఞాపికలకు (మొమెంటోలు) పుట్టిల్లు పొందూరు :



జి.ఎ.రాజాచార్యులు



అరసవెల్లి వెంకటరావు ఆచార్యులు



గరుగు - నారాయణరావు

## జ్ఞాపికలు మధుర వీచికలు :

సన్మానమైనా, సత్కారమైనా, ఉత్సవమైనా, వేడుకలు జరిగినా, విజేతలకు బహుమతులు, పదోన్నతి... పదవీవిరమణ... అభినందన సభ... సమావేశం... సభలు... ఇలా ఏకార్యమైనా ఆనాటి మధుర స్మృతిని సంబంధిత వ్యక్తి కలకాలం నిలుపుకునేందుకు జ్ఞాపికలు ఇవ్వడం ఆచారంగా మారింది.

ఈ మధ్య వీటికి మరింత ఆదరణ పెరుగుతోంది. మన సంప్రదాయాలలో జ్ఞాపికలు భాగమయ్యాయి. సృష్టికి ప్రతి సృష్టి చేసే జ్ఞాపికలు మనసులను దోచుకుంటాయి. ఈ జ్ఞాపికలను రూపొందించడంలో పొందూరు కళాకారులు ప్రదర్శిస్తున్న హస్త కళానైపుణ్యం ప్రశంసనీయం, అభినందనీయం. జ్ఞాపికలకు పుట్టిల్లుగా పొందూరు

ఎనలేని కీర్తి, ప్రతిష్ఠలను పొందింది. ఆధునిక పోకడలకు, నవీన నాగరికతకు అనుగుణంగా వీటిని తీర్చిదిద్దుతున్నారు.

ఆకట్టుకునే కళా భంగిమలు పొందూరులో మొత్తం నాలుగైదు జ్ఞాపికల రూపకల్పనా కేంద్రాలున్నాయి. వీటిలో కొన్నింటిని చేతితో, మరికొన్నింటిని కంప్యూటర్ గ్రాఫిక్స్‌ను ఉపయోగించి తయారుచేస్తున్నారు. సందర్భానుసారంగా వినియోగదారులకు చేరువయ్యేందుకు వివిధ ఆకృతులను అందుబాటులోకి తెస్తున్నారు. వినాయకుడు, లక్ష్మి, సరస్వతి, నటరాజు, వెంటేశ్వరస్వామి, అయ్యప్ప, ఓంకారం, గీతోపదేశం, ఏసుక్రీస్తు, గౌతమ బుద్ధుడు వంటి ఆధ్యాత్మిక జ్ఞాపికలు. దేశభక్తిని ఉట్టిపడే భరతమాత, గాంధీజీ, నెహ్రూ, వివేకానంద, సర్వేపల్లిరాధాకృష్ణ, మదర్‌తెరీసా, అల్లూరి సీతారామరాజు, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, ఛత్రపతి శివాజి తదితరుల జ్ఞాపికలను ఆకర్షణీయంగా రూపొందిస్తున్నారు. కొత్తదనాన్ని కోరుకునే నేటి యువతను దృష్టిలో ఉంచుకొని కోణార్క్ రథ చక్రం, డాల్ఫిన్ చేప వంటి విభిన్నమైన కళాకృతులను అందిస్తున్నారు. వీటి తయారీలో ఉపయోగించే ఇత్తడి తదితర లోహాలు సామగ్రిని బట్టి ధరలు నిర్ణయిస్తారు. ప్రస్తుతం రూ॥30 నుండి రూ॥ 2500 వరకు విలువైన మొమెంటోలు లభిస్తున్నాయి.

**ఎగుమతులు :**

జాతీయ పండగలకు : స్వాతంత్ర్య, గణతంత్ర, గురుపూజోత్సవ, విద్యాలయాల స్వాగత, వార్షికోత్సవాలకు వేల సంఖ్యలో మొమెంటోలు అమ్ముడవుతుంటాయి. ఆర్డరుపై వీటిని అందజేస్తుంటారు. ఇక్కడి మొమెంటోలు హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, భీమవరం, రాజమండ్రి, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం, బరంపురం తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.

**ఫైబర్ మొమెంటోల పై పెరుగుతున్న మోజు :**

ఇటీవల కాలంలో ఫైబర్ మొమెంటోలపై ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ఇవి ఇత్తడి మొమెంటోలకన్నా ఆకర్షణీయంగా కనిపిస్తుంటాయి. వీటిని రూ॥ 150 నుండి రూ॥ 200 ధరల్లో లభిస్తున్నాయి.

**టై, బెల్టు, బ్యాడ్జీలు :**

విద్యార్థులు ధరించే టై, బెల్ట్, బ్యాడ్జీలను తయారు చేస్తున్నారు. వీటికి ప్రత్యేకంగా గ్రామంలో రెండు యూనిట్లు ఉన్నాయి. వీటికి అవసరమైన ముడి సరుకును చైన్నై, ఢిల్లీ, హైదరాబాద్ నుంచి తెప్పిస్తున్నారు. టై, పాఠశాల లోగో బెల్టును ఒకే మొత్తంలో కొనుగోలు చేసిన వారికి రూ॥ 25 కే విక్రయిస్తున్నారు.

**1985లో జ్ఞాపికల తయారీకి శ్రీకారం :**

ఈ హస్త కళను పొందూర్పు గ్రామానికి తొలిసారిగా పరిచయం చేసిన కళాకారుడు జి.ఎ.రాజాచార్యులు. 1985లో ఆల్ఫా మెటల్స్ పేరుతో స్థానిక ఆసుపత్రి వీధిలో యూనిట్‌ను ప్రారంభించారు. అప్పటి లఘుపరిశ్రమల శాఖా మంత్రి (పశ్చిమ బెంగాల్) అజిత్రే, రాష్ట్ర హస్త కళల సంస్థ ఛైర్మన్ మిరియాల వెంకటరావు తదితరులు ఈ యూనిట్‌ను సందర్శించి ప్రశంసించారు.

మరో కొత్త కెరటం అరసవిల్లి వెంకటరావు ఆచారి 2000 సం॥లో న్యూ మిలీనియం సందర్భంగా స్థానిక కస్పావీధిలో డాల్ఫిన్ మెటల్స్ పేరుతో మొమెంటాల యూనిట్‌ను ఏర్పాటుచేసారు. ఈయన రూపొందించిన బుద్ధవిగ్రహం మొమెంటోను సరుబుజ్జిలి మండలం దంతపురిలో 2003 మే, 16న నిర్వహించిన బుద్ధ ఉత్సవ్ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎం.పి. దివంగత యర్రంనాయుడు, అప్పటి రాష్ట్ర మంత్రి తమ్మినేని సీతారాం ఆవిష్కరించారు. ఈ మొమెంటో పొడవు 65.5 సె.మీ., వెడల్పు 41సె.మీ., బరువు 3.1కిలోలు ఉంది.

గరుగు నారాయణరావు ఆచారి స్థానిక అంబేద్కర్ కూడలి సమీపంలో " చందు హ్యాండీక్రాఫ్ట్ " ను ఏర్పాటు చేసి చక్కగా నిర్వహిస్తున్నారు. స్థానిక రామ్మోహన్ నగర్ కోలనీలో సూరిబాబు అనే కళాకారుడు కూడా మొమెంటోలను రూపొందిస్తున్నారు.

**: మాధుర్యం కోల్పోని పొందూరు హార్మోనియం : (రాపాక కూడలి)**

కాలం మారినా మాధుర్యాన్ని కోల్పోని నిత్య నూతన సంగీత సాధనం హార్మోనియం. మాధుర్యమే మంచి సంగీతానికి ప్రమాణమన్నది నిత్య సత్యం. గిటార్, జాజ్ (ఎస్.పి.డి.), డ్రమ్స్, కీబోర్డ్ వంటి ఆధునిక సంగీత పరికరాలు



ఎన్ని వచ్చిన హార్మోనియం తన ఉనికిని కోల్పోకుండా ఉంది. సంప్రదాయ వాయిద్యాల్లో హార్మోనియంనకు సాటి అయినది మరొకటి లేదు. హార్మోనియంల తయారీకి పొందూరు (రాపాక కూడలి) ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసిన ఘనత **దివంగత సింహాద్రి సత్యన్నారాయణకే** దక్కుతుంది. ఈయన నట చక్రవర్తి పీసపాటి నర్సింహమూర్తి, జనా వీరభద్రాచారి లాంటి ప్రముఖ రంగస్థల నటుల సరసన హార్మోనిస్టుగా పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారు. హార్మోనియంకు కావలసిన, కడ్డీల, వైర్లు, సెల్యులాయిడ్, ప్లాస్టిక్ తదితర మైనటువంటి వాటిని ముంబాయి నుంచి ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల నుంచి వీటిని దిగుమతి చేసుకుంటారు. సంగీత వాయిద్యాల తయారీకి ఆదరణ అంతంత మాత్రమే అయిన నేపథ్యంలో ఆదాయంకంటే అభిమానమే ముఖ్యమంటూ హార్మోనియం తయారీ కళను తన కుమారులైన శ్రీనివాసరావు, అన్నాజీరావులకు చక్కగా నేర్పించారు. స్థాయిని బట్టి సింగిల్ రీడ్ హార్మోనియం రూ॥ 2500, డబుల్ రీడ్ హార్మోనియం రూ॥ 6వేలు వరకు పలుకుతాయి. అయితే వీరికి వస్తున్న ఆదాయం అంతంత మాత్రమే. తమ తండ్రి ఫత్యన్నారాయణ స్ఫూర్తితోనే ఈ రంగంలోకి వచ్చామని శ్రీనివాసరావు అన్నాజీరావులు పేర్కొన్నారు. ప్రముఖ సినీ సంగీత దర్శకులు దివంగత సాలూరు రాజేశ్వరరావు లాంటి వారు ఎలక్ట్రానిక్ పరికరాలకంటే హార్మోనియానికి ప్రాధాన్యతనిచ్చేవారని అన్నారు. హార్మోనియం అనేది ఓ మామూలు పరికరం కాదని అది వారి హృదయాలను పెనవేసుకున్న ఓ అపురూప బంధమని అన్నారు.

## సమరయోధుడు కీ॥శే॥ వడగ వెంకటేశ్వర్లు :

స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న యోధులలో కీర్తిశేషులు వడగ వెంకటేశ్వర్లు ఒకరు. ఆయన తన కుమారుడు వెంకటరావు మాడుగుల పాపారావులతో కలసి ఉద్యమంలో పాల్గొన్నారు. ఆయనకు ఎన్.జి.రంగా, గౌతు లచ్చన్న, తెన్నేటి విశ్వనాథం, త్రిపురాన రాఘవదాసు తదితరులతో సత్సంబంధాలుండేవి. పొందూరు పంచాయితీ బోర్డు అధ్యక్షునిగా పనిచేసి సేవలందించారు. ఆరోజుల్లో విద్యుత్ సౌకర్యంలేకపోవడంతో గ్రామంలోని ముఖ్య

కూడళ్లవద్ద గ్యాస్‌లైట్లను ఏర్పాటు చేయించారు. సాయిబాబా చేనేత సహకార సంఘం ఏర్పాటుకు తన వంతు సహకారాన్ని అందించారు.

## : యోగా, నృత్యాల్లో అద్వితీయుడు :
## దివంగత చక్రధారి



కొండేటి చక్రధారి పొందూరులో సిద్ధేంద్ర కళాపీఠాన్ని ఏర్పాటుచేసి ఎందరో విద్యార్థులకు యోగా నృత్య కళలను శిక్షణను ఇచ్చారు. పలాస నరసన్నపేట తదితర ప్రాంతాలలో కూడా వందలాదిమంది విద్యార్థులకు ఈ కళల్లో తర్ఫీదునిచ్చాడు. ఇతని తల్లి లక్ష్మి ప్రోత్సాహంతో ఎన్నో విజయాలను సాధించారు. తన మేనల్లుళ్ల మల్లిక్-సౌజన్య లకు ఈ రంగాల్లో ఉన్నతుల్నిగా తీర్చిదిద్దారు. పలువురు అభ్యర్థులకు హిందీ పరీక్షలకు తయారుచేయించి వారి భవిష్యత్తుకు బాటలు వేసారు. " యోగ - కరదీపిక " అనే పుస్తకాన్ని రాసారు. ఈ పుస్తకంలో వ్యాధులు రాకుండా తీసుకోవలసిన అంశాలతో పాటు ఏ రోగ నివారణకు ఏఏ ఆసనాలు వేయాలి తదితర విషయాలను పొందుపరిచారు. గాంధీ మనుమరాలు తారాభట్టాచార్జీ స్వయంగా చక్రధారి ప్రతిభను అభినందించడం విశేషం. యోగా, నృత్యాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలిచ్చి పొందూరు కీర్తిని ఇనుమడింపజేసారు. 1980 జూన్ నెలలో జన్మించిన చక్రధారి కేవలం 27ఏళ్ల మాత్రమే జీవించి 2007 సెప్టెంబర్ 22న పరమపదించారు.

## ప్రముఖ చిత్రకారులకు స్థావరంగా

చిత్రకాళారంగంలో అంగ అప్పారావు మాస్టారు, అతని కుమారుడు సాంబశివరావు విశ్రాంత చిత్రకళా ఉపాధ్యాయుడు ఆర్. అప్పన్న, పి.వి.రమణతో పాటు చదువుల ధనుంజయం, కేత శ్రీను, రావు ఆర్ట్స(వెంకటరావు) తదితరులు ఈ రంగంలో మంచిపేరు ప్రఖ్యాతుల సంపాదించుకున్నారు.

**చిత్రకళలో అగ్రగామి దివంగత అంగ అప్పారావు మాస్టారు :**

మరో రవి వర్మగా గుర్తింపు పొందిన అంగ అప్పారావు మాస్టారు ఇటు

చిత్రకళలో అటు ఫోటో గ్రాఫర్‌గా అగ్రగామిగా నిలుస్తారు. ఆయన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్రకళా ఉపాధ్యాయునిగా పనిచేసారు. రాధాకృష్ణుల ప్రణయం, మీరా, దశావతారాలు, గాంధీజీ, నెహ్రూ, నేతాజీ, పొట్టి శ్రీరాములు, ఆంజనేయస్వామి, ఉమర్‌ఖయ్యాం, గీతోపదేశం, సరస్వతీదేవి, గజేంద్రమోక్షం, అరణ్యకాండ, రాజదర్బారు సీను, వినోబాభావే తదితర చిత్రాలు అప్పారావు కీర్తికి అద్దం పడుతున్నాయి. రామప్పగుడిలోని నృత్య శిల్ప భంగిమలు, అజంతా చిత్రాలను ప్రాతిపదికగా చేసుకొని అపురూప చిత్రాలను రూపొందించిన ఉత్తమ కళాకారుడు అప్పారావు. ఒకప్పుడు అపర భద్రాచలంగా పొందూరులో ప్రతీ ఏటా నిర్వహించే శ్రీరామనవమి వేడుకల్లో ఈయన రూపొందించిన దశావతారాల తైలవర్ణ చిత్రాలను ప్రముఖంగా ప్రదర్శించేవారు. లయిదాంలోని శ్రీ శివానంద ధర్మక్షేత్రంలో వివిధ ఉత్సవాలు సందర్భంగా ఈయన వేసిన ఆధ్యాత్మిక చిత్రాలను ప్రముఖంగా ప్రదర్శించేవారు. ఎన్నో నాటక కంపెనీలకు అవసరమైన సీనులను రూపొందించారు. ప్రముఖ సినీ నటుడు దివంగత సి.ఎస్.ఆర్. ప్రముఖ రచయిత్రి స్వర్గీయ బుర్రా కమలాదేవి (పాపరాజుపేట), నాటి జిల్లాపరిషత్ ఛైర్మన్, మాజీమంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు ఈయన ప్రతిభకు ముగ్ధులై ఘనంగా సత్కరించారు. మాస్టారు గీసిన చిత్రాలు, తైలవర్ణ చిత్రాలు చిరస్థాయిగా నిలిచిపోయాయి. మాస్టారు తేది. 19-12-1987లో పరమపదించారు. ఆయన స్మృత్యర్థం 2004, 2005, 2006 సం॥ల్లో పొందూరులో జిల్లాస్థాయి ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు.

**తండ్రికి తగిన తనయుడు సాంబశివరావు :**



తండ్రి అప్పారావు ప్రభావంతో కుమారుడు సాంబశివరావు మంచి తైలవర్ణ చిత్రకారునిగా, ఫోటో గ్రాఫర్‌గా గుర్తింపు పొందారు. ఆయన రాసిన చిత్రాల్లో జటాయువు, వెన్నెల్లో ఆడపిల్ల, సత్యసాయి, సరస్వతి, మాతృప్రేమ చిత్రాలు ప్రసిద్ధికెక్కాయి. జిల్లా స్థాయి ఆర్ట్ ఎగ్జిబిషన్‌లలో సాంబశివరావు ఉత్తమ బహుమతులను గెలుచుకున్నారు.

**పి.వి.రమణ :**

చిత్రలేఖన ఉపాధ్యాయునిగా, ఫోటోగ్రాఫర్‌గా పేరుతెచ్చుకున్నారు. 26 ఏళ్లపాటు ఉద్యోగబాధ్యతలు నిర్వహించి తే 2007 మే 31దీన పొందూరులో పదవీ విరమణ చేసారు. 54 రామాయణ కథా చిత్రాలను వేసారు.





**రుప్ప అప్పన్న :**





38 వసంతాల పాటు చిత్రకళా ఉపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ చేసిన రుప్ప అప్పన్న ఆదర్శ చిత్రకారునిగా గుర్తింపు పొందారు. గ్లాస్, ఆయిల్, ఎనామిల్ పెయింట్స్‌లో అందెవేసిన చేయి. ఠాగూర్, గాంధీ చిత్రాలు, అలాగే ప్రకృతి చిత్రాలు మాస్టారికి గుర్తింపు తెచ్చాయి.

**చదువుల ధనుంజయం :**





చిత్రలేఖనంలో మంచిదిట్ట. గ్లాస్ పెయింటింగ్‌తో పలుచిత్రాలు రూపొందించారు. చారిచాప్లిన్, భగవద్గీత, దేశనాయకుల చిత్రాలను రాసారు. చిత్రలేఖనంలో టి.టి.సి. చేసారు. ఎం.ఎ., బి.ఇడి. పట్టభద్రులు. ఎయిడ్స్ కంట్రోల్‌బోర్డ్ రాష్ట్రస్థాయిలో 2007లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లోను అలాగే బొరివంక గెస్ట్ అసోసియేషన్ జరిపిన రాష్ట్రస్థాయి వ్యాసరచన (కాలుష్యనివారణ) పోటీల్లో ఉత్తమ బహుమతి పొందారు. కనిమెట్ట ప్రగతి యువజన సంఘం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో (బాల్య వివాహాలు) ప్రథమ బహుమతి పొందారు.

**కేత శ్రీను :**





ఏకలవ్యుని తరహాలో చిత్రలేఖనాన్ని అవుపోసనపట్టారు. నిత్యం బొమ్మల వేస్తూనే కాలాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాడు. మూడు పదుల వయస్సు కూడా లేని శ్రీను ఇంతవరకు సుమారు 100 చిత్రాలను వేసి గుర్తింపు పొందాడు. గౌతమ బుద్ధుడు, ఆకులతో వినాయకుడు, పావలాలతో వినాయకుడు, శివలింగం చిత్రాలతో పాటు, గాంధీజీ, శ్రీకృష్ణుడు, సత్యసాయిబాబా, షిరిడి సాయిబాబా, అంబేద్కర్ తదితర చిత్రాలు అతని పెన్సిల్ ఆర్ట్‌కు నిదర్శనం. సత్యసాయి సేవాసమితి ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలో ఈ యువకుడు రాసిన సాయిబాబా చిత్రానికి బహుమతి లభించింది. అలాగే తే14-04-2010దీన అంబేద్కర్ జయంతి సందర్భంగా శ్రీను గీసిన అంబేద్కర్ చిత్రపటానికి ప్రత్యేక బహుమతి లభించింది, ప్రముఖుల ప్రశంసలు లభించాయి. శ్రీను ముంబయిలో ఉన్నప్పుడు తాను రాసిన పలు చిత్రాలను ఆదర్శ విద్యాలయ్‌కు అందజేసాడు. ఈ యువకుని ప్రతిభను గుర్తించిన జనకళ్యాణి బ్యాంక్ అధికారులు శ్రీనుకు చిత్రలేఖనంలో

శిక్షణ ఇప్పించేందుకు సహకరిస్తామని స్పష్టం చేసారు. అయితే అప్పట్లో ఆయన ఆరోగ్యం బాగులేకపోవడంతో వెళ్లలేకపోయాడు.

## : కళాకారుల కాణాచి - పొందూరు :

కళాకారులను ఆదరించిన ఘనత పొందూరుకు దక్కుతుంది. వారి గూర్చి సంక్షిప్తంగా వివరాలను అందిస్తున్నాం.

### దివంగత ఉయ్యూరు గోపాలస్వామి :-

ఈయన శ్రీకృష్ణ, శ్రీరామ, ఆంజనేయ, హరిశ్చంద్ర, బిల్వమంగళ, భవానీశంకరుడు, కర్ణుడు, తదితర పాత్రలను పోషించి కీర్తి ప్రతిష్ఠలను పొందారు. రాష్ట్ర, ప్రవాసాంధ్ర ప్రాంతాల్లో 2,500 ప్రదర్శనలు ఇచ్చారు. వీరికి గాన రత్నాకర, అభినవ మారుతి, తదితర బిరుదులు ఉన్నాయి. షణ్ముఖిఅంజనేయరాజు, ఏ.వి.సుబ్బారావు, ఎన్.వి.ఎల్. నర్సింహాచార్యులు, సంపత్‌నగర్ లక్ష్మణరావు అలాగే సినీ రంగానికి చెందిన ధూళిపాల, రాజనాల, కాంతారావు, రేలంగి, నాగరాజు తదితర సినీనటులతో కలిసి నటించారు. 1933లో జన్మించిన ఉయ్యూరు తేదీ16-10-1981లో తనువు చాలించారు. ఎంతో మంది కళాకారులను తయారుచేసిన గోపాలస్వామి చిరస్మరణీయులు.

### ఆహార్యంలో (మేకప్) అద్వితీయులు :-



మేకప్ కళాకారులందరికి ఆద్యుడు, మార్గదర్శి పొందూరుకు చెందిన దివంగత **కోరుకొండ మల్లిబాబు.** ఆయన ప్రఖ్యాత నటుడు పీసపాటి నర్సింహమూర్తి వ్యక్తిగత మేకప్ ఆర్టిస్టుగా 30ఏళ్ళు పనిచేసారు. ఉయ్యూరు గోపాలస్వామి తదితర నటులకు కూడా ఆయన ఆహార్యాన్ని అందించారు. రూపశిల్పిగా ఇప్పటికి మల్లిబాబును గుర్తుకు తెచ్చుకుంటారు. 1973, ఆగస్టులో నిర్యాణం చెందారు.

### మరో మేకప్ ఆర్టిస్ట్ రాజారావు ఆచారి :

మరో మేకప్ కళాకారుడు దివంగత వమరవల్లి రాజారావు ఆచారి ఈ రంగంలో విశిష్ట సేవలందించి పేరుప్రఖ్యాతులు తెచ్చుకున్నారు.

## దివంగత కిలారి సత్యన్నారాయణ :-



5 దశాబ్దాలపాటు పౌరాణిక రంగస్థలానికి విశిష్ఠ సేవలందించారు. హరిశ్చంద్ర, శ్రీరామ, భక్తరామదాసు, హిరణ్యకశిప, అర్జున పాత్రలను పోషించారు. హరిశ్చంద్ర పాత్ర ఈయనకు ఎంతో పేరు తెచ్చింది. మన రాష్ట్రంతో పాటు ఒరిస్సా, పశ్చిమబెంగాల్, మధప్రదేశ్ రాష్ట్రాల్లో వేలాది ప్రదర్శనలు ఇచారు. దివంగత షణుకి ఆంజనేయరాజు, అమరపు సత్యన్నారాయణ, ఉయ్యూరు గోపాలస్వామి, విజయరాజు, యడ్ల గోపాలరావు తదితర నటులతో కలసి వివిధ ప్రదర్శనలు ఇచ్చారు. స్వగ్రామం చెట్టుపొదిలాం అయినప్పటికి పొందూరులోనే శేష జీవితాన్ని కొనసాగించారు. 1938లో జన్మించిన కిలారి తేది 01-07-2013లో కీర్తిశేషులయ్యారు.

## కిలారి లలితాదేవి :-



4 దశాబ్దాలుగా రంగస్థల రంగంలో ఉన్నారు. సత్యహరిశ్చంద్రలో చంద్రమతి, లవకుశ నాటకంలో సీత, గయోపాఖ్యానంలో సుభద్ర పాత్రను పోషిస్తూ మంచిపేరు తెచ్చుకుంటున్నారు. ఈమె దివంగత ప్రముఖ రంగస్థల నటుడు కిలారి సత్యం సతీమణి. ఈమె కుమార్తె కిలారి లక్ష్మి చంద్రమతి, శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రలను పోషిస్తూ కళారంగంలో దూసుకొనిపోతున్నారు.

## సింహాద్రి రాజరాజేశ్వరి :-



ఈమె 1965 ఫిబ్రవరి 5న ముఖానికి రంగువేసుకొని కళారంగంలో ప్రవేశించారు. సత్యహరిశ్చంద్ర, లవకుశ, భక్తప్రహ్లాద, కనకతార, మైరావణ, మహిషాసురమర్దిని పౌరాణిక నాటకాలతో పాటు పూలరంగడు, విధివ్రాత, సమర్పణ, పెళ్లిపెద్దలు, చిరిగిన బతుకులు, సుడిగుండాలు,

తదితర సాంఘిక నాటకాల్లో విభిన్న పాత్రలను పోషించి గుర్తింపుపొందారు. ఈమె ప్రముఖ హార్మోణియం కళాకారులు చిన్నయ్య ఆచారి మాస్టారి సతీమణి.

**సింహాద్రి శారదాదేవి :-**



కళాకారుల కుటుంబంలో జన్మించిన సింహాద్రి శారదాదేవి పొందూరు కేంద్రంగా, విజయవినాయక నాట్యమండలి పతాకంతో ఈ రంగంలో రాణిస్తున్నారు. 10ఏళ్ల వయస్సులోనే లవకుశ నాటకంతో ఈమె నట ప్రస్థానం ప్రారంభమైంది. ఆనాటకంలో కుశుని పాత్రను వందల సంఖ్యలో ప్రదర్శించారు. ఆ తరువాత సీత పాత్రను పోషించారు. సత్యహరిశ్చంద్రలో చంద్రమతి, మహిషాసురమర్దినిలో దుర్గాదేవి, భక్త ప్రహ్లాదలో ప్రహ్లాద, శ్రీకృష్ణ తులాబారం నాటకంలో రుక్మిణి పాత్రలను సమర్ధంగా పోషిస్తూ న్యాయంచేస్తున్నారు. ప్రముఖ నటులు జూనియర్ డి.వి.సుబ్బారావు, లింగమూర్తి, నెల్లూరు సుధాకర్ వంటి నటుల సరసన నటించారు. హైదరాబాదు, విజయవాడు, సాలూరు, జైపూర్, ఇచ్ఛాపురం, కవిటి తదితర చోట్ల శారదాదేవికి సత్కారాలు జరిగాయి.

**అభినవ దుర్యోధనుడు ఉరిటి :-**



అభినవ దుర్యోధనునిగా ఎనలేని గుర్తింపు పొందిన విశ్రాంత తెలుగు పండిట్ ఉరిటి మురళీమోహనరావు రంగస్థల రంగంలో కీర్తిప్రతిష్ఠలను నాలుగు దశాబ్ధాల పాటు పౌరాణిక రంగస్థలాన్ని ప్రభావితం చేసారు. కురుక్షేత్రంలో "మయసభ" సన్నివేశం మంచి గుర్తింపు తెచ్చింది. సత్య హరిశ్చంద్రలో విశ్వామిత్ర, గయోపాఖ్యానంలో గయునిగా, బాలనాగమ్మలో మాయలఫకీరు పాత్రలను సమర్ధంగా పోషించారు. 1989లో చెన్నైలోని టి.టి.కృష్ణమాచారి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉ రిటి మాస్టారికి ఉగాది పురస్కారం లభించింది. సినీ గాయనీ ఎస్.జానకి చేతులమీదుగా ఈ అవార్డు స్వీకరించారు. రాష్ట్రప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ

అవార్డును అందజేసి ప్రోత్సహించింది. సాయిసుధ కవితా సంపుటిని రాసి రచయితగా కూడా గుర్తింపు పొందారు.

**అభినవ శ్రీకృష్ణుడు ఉయ్యూరు దుర్గాప్రసాద్ :-**



మూడున్నర దశాబ్దాలుగా రంగస్థలాన్ని ప్రభావితం చేసిన ఉయ్యూరు దుర్గాప్రసాద్ రాష్ట్రంలోని అగ్రశ్రేణి నటులలో ఒకరు. కురుక్షేత్రం, గయోపాఖ్యానం నాటకాల్లో - శ్రీకృష్ణ, రామాంజనేయ యుద్ధంలో - శ్రీరామ, హరిశ్చంద్రలో - నక్షత్రక పాత్రలను పోషిస్తూ ప్రశంసలు పొందారు. తండ్రి దివంగత గోపాలస్వామి నటుడు కావడంతో ఆయన ప్రభావం దుర్గాప్రసాద్‌పై ఎంతగానోపడింది. 1981లో శ్రీరామగోపాల నాటక కళాసమితిని, 1988లో రంగస్థల వృత్తి కళాకారుల సంఘాన్ని స్థాపించి సేవలందిస్తున్నారు. కేవలం మన రాష్ట్రంలోనే కాకుండా ప్రవాసాంధ్ర ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చారు. ఆచంట వెంకటరత్నం, డి.వి.సుబ్బారావు, మద్దాల రామారావు, షణ్ముఖి, సంపత్‌నగర్ లక్ష్మణరావు, ఎం. విజయరాజు వంటి మేటి నటులతో కలసి 2500 మేరకు ప్రదర్శనలు ఇచ్చారు. నట గాయక రత్న, గానరత్నాకర, గాన సుధాకర, రంగస్థల రత్న, నట కిశోర్ తదితర బిరుదులను ఆయా సంస్థలు ప్రదానం చేసాయి.

**ప్రముఖ హార్మోనిస్టు చిన్నయ్యాచారి మాస్టారు :-**



ప్రముఖ హార్మోనిస్టుగా, సంగీత దర్శకునిగా ఎనలేని కీర్తిని సముపార్జించారు. తన పెద్దన్నయ్య దివంగత సత్యన్నారాయణ వద్ద సంగీతంలో సరిగమలు నేర్చుకున్నారు. 1960లో సంగీత కళాప్రపంచంలో అడుగుపెట్టారు. ఆయన హార్మోణియం మెట్లను తాకితే చాలు నవరసాలు పలుకుతాయి. తొలిసారిగా దివంగత ప్రముఖ నటుడు బగ్గు అప్పారావు నాయుడు పోషించిన హరిశ్చంద్ర పాత్రకు ఈయన సంగీత సహకారాన్ని అందించారు. కలగ లక్ష్మయ్య(పెద్దపాడు), ఉయ్యూరు గోపాలస్వామి,

పురుషోత్తం సూర్యనారాయణ తదితర నటులకు వాయిద్య సంగీతాన్ని సమకూర్చారు. ఆతరువాత 1980 జనవరి 13న శ్రీ రాజరాజేశ్వరి నాట్య మండలిని ఏర్పాటుచేసారు. ఈ పతాకం ద్వారా భక్త ప్రహ్లాద, లవకుశ, కనకతార, శ్రీకృష్ణతులాభారం, మహిషాసురమర్ధిని తదితర ప్రదర్శనలు ఇచ్చారు.

**అల్లక పోలారావు :-**

గత 4దశాబ్దాల నుంచి రంగస్థలంలో వివిధ పాత్రలను పోషిస్తూ కళామతల్లికి అంకితమయ్యారు. కురుక్షేత్రం నాటకంలో - ధృతరాష్ట్రుడు, సత్యహరిశ్చంద్ర నాటకంలో - విశ్వామిత్ర, వశిష్టుడు, రామాంజనేయ యుద్ధంలో - లక్ష్మణుడు, కర్ణ నాటకంలో - అభిమన్యుడు తదితర పాత్రలను సమర్ధంగా పోషిస్తున్నారు. ఈయన నటుడే కాకుండా చేనేత కార్మికుడు కూడా. స్థానిక కాశీవిశ్వేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో, పొందూరులో ఈయనకు ఘన సన్మానం జరిగింది.



**దివంగత బోను సన్యాసినాయుడు :-**

ఈయన గొప్ప నటుడే కాకుండా సాముగరిడీల్లో ఘనాపాఠీ. పాండవ ఉద్యోగ విజయాలు నాటకంలో దుర్యోధన పాత్రకు పెట్టిందిపేరు. బొబ్బిలియుద్ధం నాటకంలో తాండ్రపాపారాయుడు, సత్యహరిశ్చంద్రలో విశ్వామిత్ర పాత్రలను పోషించి ప్రేక్షకుల మన్ననలను పొందారు. వృత్తిరీత్యా దర్జీపని-చేసేవారు.

**మేటి నటుడు బూరాడ శ్రీనివాసం :-**

స్వగ్రామం సంతకవిటి మండలం, బూరాడపేట అయినప్పటికి పొందూరులో స్థిరపడ్డారు. చిన్నప్పటి నుంచి పౌరాణిక నాటక రంగంపై ఆసక్తి ప్రదర్శించేవారు. దివంగత ప్రముఖ కళాకారులు యడ్ల సత్యం, సాదూరావు, అల్లంశెట్టి రమణల ప్రోత్సాహంతో సత్యహరిశ్చంద్ర గయోపాఖ్యానం, శ్రీకృష్ణ తులాభారం వంటి సుప్రసిద్ధ నాటకాల్లో వివిధ పాత్రలను పోషించారు. హరిశ్చంద్ర, అర్జున, శ్రీకృష్ణ పాత్రలు ఆయనకు



ఎంతో పేరు తెచ్చాయి. కురిటి సత్యం, అమరపు సత్యన్నారాయణ, ఎ.వెంకటేశ్వరరావు, కురిటి సత్యంనాయుడు, కె. వెంకటరావు గుప్త, టి.లక్ష్మణరావు, విజయరాజు, జమునా రాయులు వంటి ప్రముఖులతో కలిసి నటించి అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. 1987 అక్టోబర్ నెలలో బాసూరులో నిర్వహించిన హరిశ్చంద్ర కాటిసీను ఏకపాత్రాభినయ పోటీల్లో 8మంది హరిశ్చంద్ర పాత్రధారులు పాల్గొనగా ఆయనకు ప్రధమ బహుమతి దక్కింది. 1997 మార్చి 30న పర్లాకిమిడిలో నిర్వహించిన పౌరాణిక ఏకపాత్రాభినయం పోటీల్లో హరిశ్చంద్ర పాత్రను పోషించిన శ్రీనివాసంకు ప్రత్యేక బహుమతి లభించింది. 2006 మార్చి 26న శ్రీ సాయికళానికేతన్ విశాఖపట్నంలో నిర్వహించిన పద్య నాటకోత్సవంలో ఎయాతి పాత్రకు గాను ప్రత్యేక బహుమతి లభించింది. ఆంధ్ర, ఒడిశ రాష్ట్రాల్లో సత్యహరిశ్చంద్ర, శ్రీరామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, కురుక్షేత్రం తదితర నాటకాలు ప్రదర్శించి సెహబాస్ అనిపించుకున్నారు. 1996లో రంగస్థల కళానిధి సి. హెచ్.వాసుదేవరావు ప్రోత్సాహంతో శ్రీనివాస కళాసమితిని ఏర్పాటు చేసారు. ఉపాధ్యాయ సంఘ నాయకునిగా సేవలందించారు. ఈయన ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

**ఉండ్రాళ్ల సత్యన్నారాయణ :-**



18ఏళ్ల వయస్సులోనే ముఖానికి రంగువేసుకొని రంగస్థలంపై వందలాది ప్రదర్శనలిచ్చి ప్రేక్షకుల మన్ననలను పొందారు. కురుక్షేత్రం నాటకంలో దుర్యోధన, భీముడు, సత్యహరిశ్చంద్రలో విశ్వామిత్రుడు, యమాంజనేయ యుద్ధంలో యముడు పాత్రలను పోషించేవారు. మంచి విగ్రహపుష్టితో ప్రేక్షకులను ఆకట్టుకునేవారు. రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాలశాఖ ఈయనకు వృద్ధ కళాకారుల ఫించనును అందజేసింది. 2013లో నిర్యాణం చెందారు.

**ఉత్తమ రంగస్థల నటుడు దివంగత చిగిలిపల్లి :**

ఎరుకలపేట(పొందూరు) చెందిన చిగిలిపల్లి వాసుదేవరావు

6దశాబ్దాలపాటు రంగస్థల రంగాన్ని ప్రభావితం చేసారు. నటునిగా, రంగస్థల దర్శకునిగా, సంగీత దర్శకునిగా విశిష్ట సేవలందించారు. ప్రారంభంలో చంద్రమతి వంటి ఆడవేషాలను కూడా వేసేవారు. దుర్యోధన(కురుక్షేత్రం), సర్దార్ పాపారాయుడు(బొబ్బిలి యుద్ధం), విశ్వామిత్ర(సత్యహరిశ్చంద్ర), ఘటోత్కచ(శశిరేఖా పరిణయం), గయుడు(గయోపాఖ్యానం) తదితర పాత్రలు అయనకు ఎంతో పేరుతెచ్చాయి. ఆచంట వెంకటరత్నం నాయుడు, బద్దాల రామారావు, ఏ.వి.సుబ్బారావు, షణ్ముఖి ఆంజనేయరాజు వంటి గొప్ప నటుల సరసన వివిధ పాత్రలను సమర్థంగా నిర్వహించారు. తే01-05-2010దీన (తన 85వ ఏట) తనువు చాలించారు. ప్రతీ ఏటా ఆయన వర్థంతిని పొందూరు ఎం.ఆర్.సి.లో నిర్వహిస్తున్నారు.

**మరో నటుడు వారణాసి శ్రీనివాసరావు :**



గత ఐదు దశాబ్దాలుగా రంగస్థల రంగంలో సేవలందించారు. 1962లో ఈ రంగంలో అడుగుపెట్టారు. సహదేవుడు పాత్రతో తన నట జీవితాన్ని ప్రారంభించారు. హరిశ్చంద్ర, అర్జున తదితర పాత్రలను పోషించారు. స్వగ్రామం సంతకవిటి మండలం, గోవిందపురం గ్రామమైనప్పటికి పొందూరులోనే స్థిర పడ్డారు. బగ్గు అప్పారావు నాయుడు, జన వీరభద్రాచారి, పీసపాటి నర్సింహమూర్తి, ఎం. విజయరాజు, వాకముల్లు సరోజిని వంటి ప్రముఖ కళాకారుల సరసన నటించి పేరు తెచ్చుకున్నారు.

**రాగసుధ ఆర్కెస్ట్రా :**



పొందూరులో 1985లో శ్రీ రాగసుధ ఆర్కెస్ట్రాను ఉయ్యూరు సుబ్రహ్మణ్యం స్థాపించారు. ఎంతోమంది గాయకులను తీర్చిదిద్దారు. ఆర్గనైజర్‌గా గొలివి ఈశ్వరరావు వ్యవహరిస్తున్నారు. "అక్షరదీపాలు" కార్యక్రమం ద్వారా ఈ సంస్థ బాగా వెలుగులోకి వచ్చింది.

పొందూరు శ్రీ పైడితల్లి అమ్మవారిపై భక్తి గీత మాలిక

అనే సి.డి. ని రూపొందించారు. దీనికి రచనా సహకారం భావశ్రీ, శాంతారాం, గుడ్ల ప్రభాకరరావు అందించారు. గాయకులు మామిడి ప్రసాద్, కవి సత్యారావు, చిన్నరాజా, లక్ష్మి అలాగే వాయిద్య సహకారాన్ని ఉయ్యూరు సుబ్రహ్మణ్యం, గాడిల్లి శ్రీనివాసరావు, బాబూరావు, కూర్మారావు, ఈశ్వరరావు అందించారు. వీరిలో సుబ్రహ్మణ్యం శ్రీకాకుళం ఆర్.టి.సి. 2వ డిపోలో కండెక్టర్‌గా పనిచేస్తూ రాష్ట్ర స్థాయిలో ఆర్.టి.సి. నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో అనేక బహుమతులను పొందారు.

## : తప్పెట గుళ్లు :

పొందూరు పంచాయితీ లక్ష్మీపేట గ్రామంలోని తప్పెటగుళ్లు బృందం గత రెండు దశాబ్దాలుగా ప్రదర్శనలిస్తూ ముందుకు దూసుకుపోతున్నారు. హైదరాబాద్‌లో సైతం ప్రదర్శనలిచ్చారు. ఈ బృందంలో 15మంది సభ్యులున్నారు. దుక్క మల్లేశ్వరరావు జట్టు నాయకునిగా వ్యవహరిస్తున్నారు.

## అంతర్జాతీయ గాయకుడు "సింహాద్రి ప్రసాద్"

### (పొగడరా నీ తల్లి భూమి భారతిని)



పొందూరుకు చెందిన సింహాంద్రి ప్రసాద్ ప్రముఖ గాయకునిగా నేడు అంతర్జాతీయ స్థాయిలో ఎదిగారు. ప్రస్తుతం న్యూజెర్సీ(యు.ఎస్), ఇంటర్‌ఫేస్ డిజైనర్‌గా పనిచేస్తూ మరో పక్క తన సంగీత ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. పొందూరు ఉన్నత పాఠశాలలో చదివినప్పటినుంచి కళాకారులైన తలిదండ్రులు సింహాద్రి రాజేశ్వరి చిన్నయ్యాచారి మాస్టారు, రంగస్థల కళాకారుడు కీ॥శే॥ చిగిలిపల్లి వాసుదేవరావు వద్ద సంగీతంలోని మెలకువలను అవుపోసన పట్టారు. పద్మశ్రీ డా॥ శోభరాజు వద్ద అన్నమాచార్య కీర్తనలను నేర్చుకున్నారు. మీనాక్షి(న్యూజెర్సీ) సమక్షంలో సంగీతంలోని లోటుపాటులను మరింతగా గ్రహిస్తున్నారు. కళాశాల విశ్వవిద్యాలయ స్థాయిలో పాటలు పాడడం, తైలవర్ణ చిత్రాల పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను సాధిస్తూ కీర్తి శిఖరాల పైపైకి అధిరోహిస్తున్నారు. ప్రముఖ సినీ

గాయకుడు ఎస్.పి.బాలు యు.ఎస్.ఎ.లో "ఈ టీవి పాడుగా తీయగా" ధారావాహిక కార్యక్రమానికి ఎంపికై పలు ప్రదర్శనలు ఇచ్చారు.

– స్టార్ టి.వి. అంత్యాక్షరి, ఈ టి.వి. సరిగమలు కార్యక్రమాల్లో బహుమతులు గెలుచుకున్నారు.

– తి.తి.దే. సౌజన్యంతో పద్మశ్రీ శోభరాజ్‌తో కలసి అన్నమాచార్య కీర్తనల ఆలాపన కార్యక్రమాలను షిరిడి, శ్రీకాళహస్తి, రవీంద్రభారతి, ద్వారకాతిరుమలలో

నిర్వహించి ప్రసంసలు పొందారు.

– న్యూజెర్సీలోని టోరీ రేడియోలో నెలకొకసారి మీరుకోరిన పాటల కార్యక్రమంలో గాయకునిగా కళాసేవలందింస్తున్నారు.

– ఆశా, ఆట, సాఫకిన్, నాట్స్ తదితన సేవా సంస్థలతో కలసి పలు ప్రదర్శనలిచ్చి, విరాళాలు సేకరించి సమాజ సేవకు నేనుసైతం అంటూ సేవలందిస్తున్నారు.

– ఉత్తరాఖండ్ వరద బాధితుల కోసం ప్రదర్శనలిచ్చి లభించిన మొత్తాలను వారికి అందజేసి తోడ్పడ్డారు.

ప్రసాద్ పొందూరు పార్కురోడ్డు ప్రాథమిక పాఠశాలలో, ఉన్నత పాఠశాల, జ్యూనియర్ కళాశాలలో చదివారు. ఆ తరువాత శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలో బి.ఎ. పూర్తిచేసారు. చివరిగా హైదరాబాద్‌లో సాంకేతిక ఉన్నత విద్యను అభ్యసించారు.

## విద్యా ప్రవంతిలో...

విద్యారంగంలో పొందూరు ఎంతో పురోగతి సాధిస్తోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 4 ప్రాథమిక పాఠశాలలు, మానసవేణి, మోడరన్ కాన్వెంట్, లక్ష్మి దామోదర విద్యాలయం, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, శ్రీరామా ఐ.టి.ఐ., సిస్టమ్ జూనియర్ & డిగ్రీ కళాశాలు ఉన్నాయి. కాగా వావిలిపల్లిపేట కూడలి వద్ద ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, పొందూరు పాత బస్టాండ్ సమీపంలో శ్రీరామా పబ్లిక్ స్కూల్, జూనియర్ & డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.

**ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ పాఠశాలలు :**

తే 23.06.1928దీన స్థానిక దేవాంగవీధిలో ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ ప్రాథమిక పాఠశాల ప్రారంభమైంది. టీచర్ మేనేజర్‌గా వాండ్రంగి చినగురుమూర్తి వ్యవహరించారు. అయితే ఈ పాఠశాలను తే01-10-1959దీన ప్రభుత్వం స్వాధీనంచేసుకుంది. పట్టుశాలీపేటలో కూడా ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ పాఠశాల ఉండేది దీనికి తొలి టీచర్ మేనేజర్‌గా కుప్పిలి సన్యాసిరావు అలాగే లావేటి వీధిలో సైతం ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ పాఠశాల ఉండేది. దీని తొలి టీచర్ మేనేజర్‌గా కుప్పిలి జగన్నధరావు వ్యవహరించారు. ఈ పాఠశాలలను కూడా తదనంతరం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

**1952లో ఉన్నత పాఠశాల :**

1952-53 విద్యా సంవత్సరంలో ఇక్కడ ఉన్నత పాఠశాల ప్రారంభమైంది. నాన్‌పేనల్ ప్రధానోపాధ్యాయునిగా ఎం. శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈ విద్యాలయం ప్రారంభమైంది. తరువాత పుల్లెల నారాయణశాస్త్రి, డి.బి.ఎన్.రాజు తదితరులు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసారు. ఆతరువాత ఈ పాఠశాల హయ్యర్ సెకెండరీ పాఠశాలగా రూపొందింది. ఈ పాఠశాల తొలి ప్రధానోపాధ్యాయులుగా ఎన్.జగన్నాధరావు, ఆతరువాత పి.ఎ.నర్సింహం, వి.పేరిశాస్త్రి, ఎం.రామారావు, కె.ఎల్.వి.ప్రసాదరావు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి గుర్తింపు పొందారు. ఆరోజుల్లో ఈ పాఠశాలలో డి.వి.అప్పారావు, పి.సీతాపతిరావు, జె.వి.రమణమూర్తి(సినీనటుడు), కె.ఎల్.వి. ప్రసాదరావు, సి.సత్యం, పి.శివరామరాజు, ఆర్.వి.ఎస్.రంగనాయకులు, ఎ.ఎస్.ఆర్.వి. రమణమూర్తి, బి.జె.నాయుడు, మేకా తిరుపతిరావు, వి.హరనాథరావు, పొగిరి జగన్నాధం, పుల్లెల రామక్రిష్ణారావు, ముట్నూరు సూర్యప్రకాశ శాస్త్రి, అంగ అప్పారావు, వై.తవిటయ్య, భూపతి నారాయణస్వామి జి.కృష్ణమాచార్యులు, ఎం.వి.శేషాచార్యులు, వి.వి.రమణ, వి.భీమశంకరరావు, అల్లంశెట్టి కాశిబాబు, కూన జగన్నాధం, వేదుల నరసింహం, సి.వి.రత్నం, ఎ.వి.రాజారావు, ఎం.అప్పారావు వంటి ఉద్దండులైన ఎందరో ఉపాధ్యాయులు పనిచేసారు. కాగా ఎం.సీతారామాచార్యులు అనే ఎస్.జి.టి. పిల్లలను తన బిడ్డలుగా భావించి

నిరంతరం విద్యాబుద్ధులు చెబుతుండేవారు. 1952 ముందు ఇక్కడ మిడిల్‌స్కూల్ ఉండేది.

**1971లో జూనియర్ కళాశాల :**

1971లో ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైంది. ఈ కళాశాల ఏర్పాటుకు పాలిశెట్టి రామారావు, ఎస్.టి.పి.వి. కూర్మాచార్యులు, గుడిశ వెంకటరామకృష్ణారావు తదితరులు కృషిచేసారు. ఈ కళాశాలకు తొలి ఇన్‌చార్జి ప్రధానాచార్యులుగా కె.శేషగిరిరావు ఆతరువాత ఎం. సత్తిబాబు(ఎఫ్.ఎ.సి.), డివిఎస్.ఎన్.మూర్తి, పి.మురళీధరరావు(ఎఫ్.ఎ.సి.), డి. వీరరాఘవరెడ్డి, ఎం. సత్తిబాబు(ఎఫ్.ఎ.సి.), వి. పార్ధసారధి, ఎ.ఎస్.ఎన్.శర్మ, జి.మోహనరావు, ఎం. నాగేశ్వరరావు(ఎఫ్.ఎ.సి.), జె.ఎస్.వి.సుబ్బలక్ష్మి, ఎం. సత్తిబాబు, ఎం. నాగేశ్వరరావు, బి. నర్శింహుల నాయుడు (ఎఫ్.ఎ.సి.), ఎం. నాగేశ్వరరావు, పి.వి.జగన్నాధరావు, కె.ఆనందరావు, కె. గోవిందరాజులు వరుసగా ప్రిన్సిపాళ్లగా వ్యవహరించారు. ప్రస్తుతం కొత్తపల్లి అప్పలరాము ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. కళాశాలకు అనుబంధంగా ఉన్న ఉన్నత పాఠశాల 1998లో విడిపోయి ప్రత్యేక ప్రతిపత్తిని పొందింది. ఉన్నత పాఠశాలకు తొలి ప్రధానోపాధ్యాయునిగా బి.వి.ఎస్. రామారావు వ్యవహరించారు. ఆతరువాత వి.వి.ఎస్.ఎన్.మూర్తి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఈదుల గోవిందరావు ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.

## : డాక్టరేట్లు పొందిన ప్రముఖులు :

**డా॥ ఎం.వి.రావు :**



పొందూరుకు చెందిన డా॥ ఎం.వి.రావు గతంలో ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ వద్ద సాంకేతిక సలహాదారునిగా పనిచేసారు. ఈయన ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ పట్టా పొందారు. స్థానిక దివ్యజ్ఞాన సమాజ మందిరం, విజయ గణపతి మందిరం, బొట్లపేట ఎండల మల్లిఖార్జున స్వామి ఆలయం, పునరుద్ధరణకు ఆర్థిక సాయం అందించారు. డా॥రావు తే10.10.2011దీన నిర్యాణం చెందారు.

**డా॥ కోరుకొండ స్వర్ణలత :**



ఈమె డా॥ ఎం.వి.రావు సతీమణి. "కోనసీమ పొలం పాటలు – జానపద విజ్ఞాన విశ్లేషణ" అనే అంశంపై సిద్ధాంత గ్రంథం రాసి ఆంధ్ర విశ్వకళాపరిషత్ నుండి 1991లో పి.హెచ్‌డి పట్టాను పొందారు. ఆమె డా॥ పి.ఆపదరావు పర్యవేక్షణలో పిహెచ్.డి. చేసారు. ఈ గ్రంథానికి మంచి ఆదరణ లభించింది.

**డా॥ డి.వి. సూర్యారావు :**



పొందూరు, శ్రీకాకుళం, విశాఖపట్నంలలో ఈయన విద్యాభ్యాసం సాగింది. విశాఖ బి.వి.కె. డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేసారు. తెలుగులో "బౌద్ధ కావ్యాలు" అనే అంశంపై సిద్ధాంత గ్రంథం రాసి బెర్హంపూర్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టాను పొందారు. విశాఖలో స్థిరపడి సాహిత్య విమర్శకునిగా మంచిపేరు తెచ్చుకున్నారు. " తెలుగువారి పండుగలు – పర్వదినాలు, అన్నాహజారే, జ్యోతిర్గమయ, సృష్టికర్త (అనువాద గ్రంథం), జీవితం ఓ పయనం (అనువాద గ్రంథం), తెలుగు కీర్తి కేతనాలు, వినాయక వైభవం, సి.ఎస్.రావు జీవిత ప్రస్థానం" తదితర గ్రంథాలు రాసారు. విశాఖ సాహితి ఉపాధ్యక్షునిగా, తెలుగు భాషా సంరక్షణ సమితి–విశాఖ జిల్లా కార్యదర్శిగా, టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపీఠం నిర్వాహక కార్యదర్శిగా ఉంటూ సాహితీ సేవలందిస్తున్నారు. 2012 డిసెంబర్‌లో తిరుపతిలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యములో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహా సభలు సందర్భంగా విశాఖ జిల్లా ప్రతినిధిగా డా॥ సూర్యారావు పాల్గొన్నారు.



**డా॥ అల్లంశెట్టి చంద్రశేఖరరావు :**

ఈయన సవర భాష – వర్ణనాత్మక వ్యాకరణం పై సిద్ధాంత గ్రంథం సమర్పించి ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి 1998లో డాక్టరేట్ పట్టా పొందారు. (మరిన్ని వివరాలు వేరే పేజీలో...)

## పొందూరు ఘనాపాఠీ

**రచయిత ఘండికోట బ్రహ్మాజీరావు :**

తెలుగు భారతి సిగలో సిరిమల్లె ఘండికోట బ్రహ్మాజీరావు. ఈయన రచనలన్నీ వాస్తవిక జీవితాలకు దర్పణంగా నిలుస్తాయి. ఈ మహారచయిత ఖాదీకి పర్యాయపదంగా ఉన్న పొందూరు బ్రాహ్మణ అగ్రహారం వీధిలో తే23-12-1922దీన జన్మించారు. ఇక్కడే ప్రాథమిక విద్యను పూర్తి చేసారు. తన 16ఏళ్ల వయస్సు నుంచే కలం ఝళిపించారు. తెలుగు, ఆంగ్లం, సంస్కృతం భాషల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసారు. ఈయన పశ్చిమ బెంగాల్‌లో రైల్వే విభాగంలో ఇంజినీర్‌గా పనిచేసారు. 1980లో పదవీ విరమణ చేసిన తరువాత హాల్దియా పోర్ట్‌లో ప్రత్యేక అధికారిగా ఏడాదిపాటు పనిచేసారు. ఈయన 10కి పైగా నవలలు అతిపెద్ద కథా సంపుటిని, వివిధ గ్రంథాలకు అనువాదంచేసి ప్రసిద్ధికెక్కారు. బ్రహ్మాజీ ఆంగ్ల సంక్షిప్త కథలపై పరిశోధనచేసి అనేక బహుమతులను పొందారు.

పరుగులిడే చక్రాలు, నవ్వింది నాగావళి, ప్రేమమూర్తి, శ్రామిక శకటం, విజయవాడ జంక్షన్, నల్లమబ్బు, కలకత్తా పోర్టులో తనకు ఎదురైన అనుభవాలను ఆధారంగా ప్రేమమూర్తి నవలను రాసారు. విజయవాడ జంక్షన్ నవల థ్రిల్లర్‌గా గుర్తింపు పొందింది. ఆయన రాసిన 95 కథల సంపుటి మయూరాక్షి పేరుతో విడుదలయింది. గైడ్ డాగ్, మలుపు, ఇది కథ, చెప్పు తినెడి కుక్క, మయూరాక్షి, ఆరోహణ-అవరోహణ రచనలు ఈయనకు ఎంతో ప్రీతిపాత్రమైనవి. ఈయన రామాయణంలోని సుందరాకాండను సంస్కృతంలోకి అనువదించారు. అలాగే అరేబియన్ నైట్స్ రచనను తెలుగులోకి అనువదించారు. బ్రహ్మాజి రాసిన శ్రామిక శకటం, విజయవాడ జంక్షన్ నవలలకు అంధ్రజ్యోతి వారపత్రిక నిర్వహించిన నవలల పోటీల్లో ప్రధమ బహుమతి వచ్చింది. అలాగే "నవ్వింది నాగవళి" నవలకు అంధ్రప్రభ వార పత్రిక నిర్వహించిన నవలల పోటీల్లో ప్రత్యేక బహుమతి లభించింది. ఈయన శ్రీ పర్వతం అనే పెద్ద నవలను రాస్తూ 2012 అక్టోబర్, 12న తుదిశ్వాస విడిచారు.

## పండిత శిఖరం ముట్నూరు మాస్టారు :

ఉభయ భాషా ప్రవీణ, నేత్రావధాని ముట్నూరు సూర్యప్రకాశ శాస్త్రి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 32ఏళ్ల పాటు తెలుగు పండితునిగా పనిచేసి ఎనలేని ఖ్యాతిని పొందారు. అంతకు ముందు కొంతకాలం హిరమండలం ఉన్నత పాఠశాలలో పనిచేసారు. ఆయన పాఠం చెబుతుంటే విద్యార్థులు తన్మయత్వం చెందేవారు. ఇతిహాసాలపై ఆయనకు మంచి పట్టుఉండేది. హరికథలు కూడా చెబుతూ ఉత్తరాంధ్రలో ప్రత్యేక స్థానాన్ని పొందారు. నేత్రావధానంలో అందెవేసిన చేయి. మృదంగ విద్యలో కూడా ఆరితేరారు. రంగస్థల కళాకారులకు అవసరమైన శిక్షణనిచ్చేవారు. విశేషమేమిటంటే పచ్చకామెర్ల నివారణకు మందులిచ్చి సేవచేసారు. ఈయన విజయనగరం జిల్లా వంతరాంలో జన్మించిన ఉద్యోగరీత్యా పొందూరులోనే స్థిరపడ్డారు. 1912లో జన్మించిన మాస్టారు తే14-06-1999లో తుది శ్వాస విడిచారు. ఇప్పటికి ఎప్పటికి ఆయన చిరస్మరణీయుడే.

## సవ్యసాచి అప్పయ్య కవి :

ఇటు తెలుగు సాహిత్యంలో అటు ఖాదీ నేతలో సవ్యసాచిగా పేరుపొందారు అల్లంశెట్టి అప్పయ్య కవి. పొందూరులో తే14-10-1900దీన జన్మించారు. కేవలం 5వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. ఆయన జి.సిగడాంలో దుబాకుల చిట్టిఅప్పయ్య వద్ద ఆంధ్రం అమరం, పంచకావ్యాలు చదివారు. ఖదీ అంచుపంచెలు డిజైన్ చేయడంలో మంచి దిట్ట. కాన్పూరు, ఢిల్లీ, సూరత్, కుంభకోణం, అవడి తదితర చోట్ల జరిగిన ఖాదీ ఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నారు. కొండకామేశ్వర శతకం(1925), మదనశాయకం (నాటకం), ఈశ్వర శతకం(1930), కావ్యామృతం(1931), యోగానందం(1939), త్రిపుర విజయం(నాటకం), ఈశ్వరార్పణం, రామాయణ సారస్వత దర్శనం, సౌభాగ్య లక్ష్మి స్థవరాజం, తదితర గ్రంథాలు రాసి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో మరో 4 గ్రంథాలు వెలుగు ముఖంలోకి రాలేక పోయాయి. ఈయన రాసిన వివిధ కథలు, పద్యాలు, వ్యాసాలు, సమదర్శిని, ప్రజామిత్ర, ఆంధ్రపత్రిక, మాతృసేవ, త్రిలింగ, భారతి వంటి పత్రికలలో

ప్రచురించారు. అప్పయ్య కవికి మాడుగుల వెంకట సూర్యప్రసాదరావు, విశ్వనాథ కవిరాజు, వసంతరావు వెంకటరావు తదితర సాహితీ ప్రముఖులతో సన్నిహిత సంబంధాలుండేవి. ఆంధ్రభారతి విశ్వవిద్యాలయం వారిచే తే25-05-1929లో " కవితా వినోద ", 1932లో కవితాకోవిద 1964లో సాహిత్యభూషణ బిరుదులు పొందారు. ఈయనను అపర కబీర్‌గా ఆరోజుల్లో పిలిచేవారు. 1970 జూలై 6న కవిగారు అస్తమించారు.

## ప్రముఖ నవలా రచయిత్రి యర్ర గంగాభవానీ :



స్థానిక దివంగత యర్ర గంగాభవానీ 10కి పైగా నవలలు వ్రాసి తెలుగు సాహిత్యానికి తన వంతుగా సేవలందించారు. ఈమె భాస్కర శతకం, ఆవేదన, ఎత్తుగడ, తీరని కోరికలు, ఆరోజు రావాలి తదితర నవలలను రాసారు. స్థానిక నవతా గ్రంథాలయం ఆమెను ఘనంగా సత్కరించింది. గంగాభవానీ, మల్లిఖార్జునరావు దంపతులు ఓ పెద్ద శివాలయాన్ని నిర్మించారు. ఈమె ఈ ప్రాంతానికి గర్వకారణంగా నిలుస్తున్నారు.

## గిడుగు సాహితి వారసుడు డా॥ చంద్రశేఖరరావు :

సవర భాషకు మూల పురుషుడైన గిడుగు రామ్మూర్తి పంతులు గారికి అసలైన వారసుడు విశ్రాంత రీడర్, సవర పత్రిక సంపాదకులు డా॥అల్లంశెట్టి చంద్రశేఖరరావు. సంప్రదాయ కవి దివంగత అల్లంశెట్టి అప్పయ్య కవి కుమారుడే చంద్రశేఖరరావు. ఈయన విజయనగరం ఎం.ఆర్. కళాశాలలో డిగ్రీ చదువుతున్నప్పుడు ఆచార్య రోణంకి అప్పలస్వామి దగ్గర ధ్వని శాస్త్రాన్ని అధ్యయనం చేసారు. ఆ తరువాత ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాక 1972-73లో మైసూరులోని కేంద్రీయ భారతీయ భాషల అధ్యయన సంస్థలో తమిళం నేర్చుకుంటూ అక్కడి భాషా శాస్త్రవేత్తల వద్ద భాషా శాస్త్రాన్ని బాగా అధ్యయనం చేసారు. ఆంధ్ర విశ్వవిద్యాలంలో భాషా శాస్త్రంలో డిప్లమా చేసారు. 1993 - 98 మధ్య " ఎ డిస్క్రిప్టివ్ గ్రామర్ ఆఫ్ సోరా " (సవర) లాంగ్వేజ్ అనే అంశంపై సిద్ధాంత

గ్రంథాన్ని రాసి ఎ.యు.కి సమర్పించి పి.హెచ్.డి. పొందారు. ఈ గ్రంథానికి ఉత్తమ పరిశోధన క్రింద రఘుపతి వెంకటరత్నం స్మారక స్వర్ణపతకం, త్రిపురనేని గోపీచంద్ బంగారు పతకం లభించాయి. 1999 నుంచి చంద్రశేఖరరావు శ్రీకాకుళంలోని ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, గిరిజన వసతి గృహాల్లో ఉన్న సవర విద్యార్థులకు తెలుగు లిపిలో సవర భాష రాయడం నేర్పించారు. ఆ విద్యార్థులచే సవర భాషలో కథలు రాయించారు. 2000 సం॥రం ఆగష్టు 29 గిడుగు జయంతి సందర్భంగా సవర భాషా సంఘాన్ని ఏర్పాటు చేసారు. 2005 ఆగష్టు నుంచి 2006 జూలై వరకు సవర బులిటెన్ మాస పత్రికను 2006 జూలై వరకు నడిపారు. గిడుగు సేకరించిన కథలు, పాటలను తెలుగు అనువాదంతో ప్రచురించారు. గిడుగు సౌజన్యంతో సవర పాటలు అనే పేరుతో 2009లో ఓ పుస్తకాన్ని చంద్రశేఖరరావు ప్రచురించారు. 2010లో ఆయన సవరభాషపై 250 పుటల వ్యాకరాన్ని రాసి ప్రచురించారు. ఆయన కృషి ఫలితంగానే పర్లాకిమిడి మహరాజా కళాశాలలో 2012 ఆగష్టు 29, 30 తేదీల్లో సవరభాషపై జాతీయ సదస్సులు నిర్వహించారు. 2013 ఆగష్టు 29న గిడుగు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు గిడుగు పురస్కారం కింద సి.ఎం. కిరణ్‌కుమార్ రెడ్డి చేతులుమీదుగా రూ॥ 10వేల నగదు, ప్రశంసా పత్రం అందజేసారు.

## : ఆధ్యాత్మిక రంగంలో పొందూరు

## ప్రార్థనాలయాలకు ఆటపట్టుగా... :

కోదండరామ స్వామి, రామలింగేశ్వర స్వామి, మల్లిఖార్జున స్వామి, కాశీవిశ్వేశ్వర స్వామి, సోమలింగేశ్వర స్వామి, పైడితల్లి అమ్మవారు, అక్కమాంబ పేరంటాలు, పెదబండార్లమ్మ, చినబండార్లమ్మ, సత్యసాయిబాబ, వీరబ్రహ్మేంద్రస్వామి, సంతోషిమాతా, విజయగణపతి, కంచి కామాక్షి, కల్కి భగవాన్, రాజరాజేశ్వరి, వెంకటేశ్వర స్వామి ఆలయాలు ప్రసిద్ధిచెందాయి.

పైడితల్లి అమ్మవారి ఆలయ మార్గంలో అయ్యప్పస్వామి ఆలయం, జోగన్నపేట మార్గంలో ప్రముఖ వాణిజ్యవేత్త జె.వి.ఆర్. ఆధ్వర్యంలో మరో అయ్యప్పస్వామి ఆలయాలు నిర్మాణంలో ఉన్నాయి. పొందూరులో ప్రతీ ఏటా ఆషాడ మాసంలో పూరీ సంప్రదాయంలో రథయాత్ర జరుగుతోంది. క్రైస్తవ మతానికి సంబంధించి లక్ష్మీపేట మార్గంలో ఓ చర్చి అలాగే ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో మరో చర్చి ఉన్నాయి. ముస్లింలకు సంబంధించి స్థానికి ఆర్.టి.సి. బస్టాండ్ సమీపంలో ఓ మసీదు ఉంది.

## అమ్మలుగన్న అమ్మ పైడితల్లి అమ్మవారు :



పొందూరు గ్రామానికి దక్షిణ దిశలో సుందర వనాల నడుమ వెలసిన స్థానిక పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు 1985 సం॥ నుండి యంగ్‌స్టార్స్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజలు సహకారంతో నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో జాతరను జరుపుతున్నారు. కోరిన కోర్కెలు తీర్చిన కల్పవల్లిగా పొందూరు ప్రాంతీయులకు ఇలవేల్పుగా ఉన్న అమ్మవారిని జాతరలో వేలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు. ప్రతీ మంగళ, గురువారాల్లో ఈ ప్రాంత ప్రజలు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేస్తుంటారు. నూతన వధూవరులు అమ్మవారిని దర్శించుకొని దీవెనలు పొందుతుంటారు. అయ్యప్ప స్వామి, దుర్గాదేవి, షిరిడీసాయి, వెంటేశ్వర స్వామి మాలాధారణను, దీక్షలను చేపట్టే భక్తులు తప్పనిసరిగా అమ్మవారిని దర్శించుకుంటారు. అలాగే కొత్త వాహనాలను కొనుగోలు చేసేవారు వాటిని అమ్మవారి ఆలయానికి తెచ్చి పూజలు జరుపుతుంటారు. విజయనగరం పైడితల్లి అమ్మవారికి మూలం పొందూరు పైడితల్లిగా పేర్కొంటారు. ఇక్కడకు సమీపంలోని ఓ పెద్దకొండను పైడి కొండగా అమ్మవారి పేరుతో పిలవడం విశేషం. ఈ ఆలయానికి ఏటా రూ॥ 2 నుండి రూ॥ 3లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. అమ్మవారి ఆలయానికి

90సెంట్ల మాన్యం ఉంది. ఆలయం పరిసరాల్లో కళా వేదికను కూడా ఉంది. దీని పైనే సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహిస్తుంటారు.

**సత్యసాయి సేవా సమితి :**




ప్రేమ, సేవ, సత్యం, ధర్మం, శాంతి, సహనం, సానుభూతి, త్యాగం, పరోకారం వంటి ఉత్తమ భావాలను ప్రతిఫలింపజేసే లక్ష్యంతో పొందూరు సత్యసాయి సేవా సమితి 1994లో అవతరించింది. ఈ సమితి విశిష్ట సేవలందిస్తోంది. ఆధ్యాత్మిక, మహిళా, బాలవికాస్ సేవా విభాగాలు చేస్తున్న కృషి ప్రశంసనీయం. ఏడాది పొడవున స్వామికి పూజలు, నగర సంకీర్తన, ముఖ్యదినాల్లో సాయి వ్రతాలు, సామూహిక అభిషేకాలు, లక్షకుంకుమార్చలను జరుపుతుంటారు. వినాయక చవితి, కృష్ణాష్టమి, దశరా, ఉగాది, శ్రీరామ నవమి తదితర పండుగలను నిర్వహిస్తుంటారు. పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు పొందూరు, వాండ్రంగి, సంతవురిటి గ్రామాల్లో బాలవికాస్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. సంస్కృత పరిచయ కార్యక్రమంతో పాటు నీతి కథలను చెబుతుంటారు. ఆధ్యాత్మిక, క్విజ్, ఆటల, పాటల పోటీలను నిర్వహిస్తూ బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. ఏటా 10వ తరగతి, ఇంటరలలో హెచ్చు మార్కులు తెచ్చుకున్నవారికి ప్రోత్సాహ బహుమతులను అందజేస్తున్నారు. గురుపూర్ణిమ రోజున గురువులను సత్కరిస్తున్నారు. ప్రతీ ఆదివారం మందిర వద్ద నారాయణసేవ నిర్వహిస్తున్నారు. అనారోగ్యంతో ఇంటిపట్టునే అలమటిస్తున్న 18మంది అనాథలకు రోజూ క్యారేజీలతో భోజనాన్ని వారి ఇంటివద్దకే ఆట్ల శ్రీనివాసరావు ద్వారా పంపుతున్నారు. ఏటా స్వామి జన్మదినోత్సవ సందర్భంగా నవంబర్ 19 నుండి 23 వరకు ప్రత్యేక కార్యక్రమాలను జరుపుతున్నారు. ఈ సందర్భంగా పేదలకు చీరలు, దుప్పట్లు అందిస్తున్నారు. లక్ష్మీపేట గ్రామాన్ని దత్తత తీసుకొని సేవలందిస్తున్నారు. ఈ పల్లెలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి విద్యార్థులకు గ్లాసులను, కంచాలను అందజేసారు. ఈ సేవా సమితి తరచుగా ఉచిత వైద్య, నేత్ర చికిత్సా శిబిరాలను నిర్వహిస్తున్నారు.

## దివ్యజ్ఞాన సమాజం :

1946 ఫిబ్రవరి 6న పొందూరులో శ్రీకృష్ణ దివ్యజ్ఞాన సమాజం ఏర్పడింది.. అప్పటి నుండి ఈ శాఖ ఆధ్యాత్మిక కార్యక్రమాలను కొనసాగిస్తుంది. కాకరపర్తి సత్యన్నారాయణ, గాడి బంగారయ్యల చొరవతో ఈ శాఖ ఏర్పడింది. 1951లో శాశ్వత భవనం సమకూర్చింది. భవన నిర్మాణానికి పమ్మిన సూర్యం, పాలిశెట్టి సూర్యం, గుడిశ లోకనాధం, జల్లేపల్లి అమ్మాజి తదితరులు సహకరించారు. ఈ శాఖకు 32ఏళ్ల పాటు పమ్మిన సూర్యం అధ్యక్షులుగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షులుగా పాలిశెట్టి సూర్యం 38ఏళ్ల పాటు వ్యవహరించారు. ఆ తరువాత పాలిశెట్టి రామారావు సుదీర్ఘకాలం గౌరవ అధ్యక్షునిగా పనిచేసేరు. ఈయన హయాంలోనే 1996 అక్టోబర్, 28న స్వర్ణోత్సవాలు జరిగాయి. మలిపెద్ది చినవెంకయ్య (1978-88), వడ్డిపల్లి సూర్యనారాయణ (1988-2000), గుంటుకు మోహనరావు (ప్రిన్సిపల్) (2000-03) తదితరులు అధ్యక్షపీఠాన్ని అలంకరించినవారిలో ఉన్నారు.

ప్రస్తుతం ఆట్ల సూరిబాబు, దండా అప్పారావు అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరిస్తున్నారు. 1962 నుంచి 80 వరకు రామక్రిష్ణ మిషన్‌కు చెందిన స్వామి ఆనంద్ సాగర్ భక్తి, జ్ఞాన, కర్మ యోగాలపై ధారావాహిక ఆధ్యాత్మిక ఉపన్యాసాలిచ్చి భక్తులను పరవశింపజేసారు. డా॥ ఎం.వి.రావు, డా॥ స్వర్ణలత దంపతులు 2006లో దివ్యజ్ఞాన సమాజ భవనాన్ని పునరుద్ధరించారు. అదనపు భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఈ సమాజ శాఖలో మలిపెద్ది వెంకటరావు, బస్వా దివాకరరావు, సింహాద్రి మృత్యుంజయరావు, పొగిరి జగన్నాధం, గుడ్ల అప్పారావు, ఎర్ర తవిటయ్య తదితరులు ఆధ్యాత్మిక ఉపన్యాసాలిస్తున్నారు. ఈ సమాజంలో 140 మంది సభ్యులున్నారు. ప్రతీ రోజూ ప్రార్థన నిర్వహిస్తారు. ప్రతి ఆదివారం భారత సమాజ పూజ, ప్రతి మంగళవారం సాయంత్రం ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఉంటాయి. కల్నల్, ఆల్‌కాట్, మేడమ్ బ్లివటస్కీ అనీబ్‌సెంట్, జిడ్డుకృష్ణమూర్తి, జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

బాగా వికసించినపుడే పూలు కోసుకో... ఆలస్యం చేసే వాడిపోతాయి...

## పొందూరు నిర్మాత - పాలిశెట్టి సూర్యం :

పొందూరు సర్పంచ్‌గా సుదీర్ఘకాలం పనిచేసి ఎనలేని సేవలందించిన ఘనత దక్కుతుంది. 1956 నుండి 17ఏళ్ల పాటు సర్పంచుగా ఎన్నికై మంచి పేరు తెచ్చుకున్నారు. గొప్ప దాతగా, కళాపోషకునిగా గుర్తింపు పొందారు. స్థానిక బ్రాహ్మణఅగ్రహారం వీధికి సమీపంలో ఉన్న పీతల చెరువు ప్రజలకు ఎంతో ఇబ్బందిగా ఉండేది. ఆయన సొంత నిధులతో చెరువును కప్పించి నెహ్రూ పార్కును నిర్మించారు. స్థానిక పశువుల ఆసుపత్రికి సొంత నిధులను వెచ్చించి శాశ్వత భవనాన్ని నిర్మింపజేసారు. స్థానికంగా ఉన్న పలు చెరువులను పునరుద్ధరింపజేసి రైతులకు సాగునీటిని అందుబాటులోకి తెచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయించడంలో ఎంతో కృషిచేసారు. గుడిశా రామకృష్ణారావు, పాలిశెట్టి రామారావు తదితరులు కూడా తమ సహకారాన్ని అందించారు. శ్రీరామనవమి ఉత్సవాలను భారీఎత్తున నిర్వహించేవారు. పొందూరును అపర భద్రాద్రిగా చేసిన ఘనత ఆయనదే. ప్రముఖ బుర్రకథ కళాకారుడు నాజర్‌ను పొందూరు తెప్పించి ఆయనచే ప్రదర్శననిప్పించారు. ప్రముఖ నటులు పీసపాటి నర్సింహమూర్తి, జనా వీరభద్రాచారి, ఉయ్యూరు గోపాలస్వామి, హరికథా ప్రవీణ ఆకెళ్ళ అప్పారావు తదితరులకు మంచి ప్రోత్సాహాన్నిచ్చి ఆదరించారు. పేదసాదలకు విరాళాలు అందజేసి తోడ్పడ్డారు. దాతృత్వానికి మరో పేరుగా నిలిచిన పాలిశెట్టి సూర్యం పొందూరు చరిత్రలో ఓ ఆణిముత్యం. ఆయన చేపట్టిన పలు కార్యక్రమాల్లో వీరకాడు పమ్మిన సూర్యం పాత్ర ఎంతో ఉంది.

## ఆధ్యాత్మిక వైతాళికుడు - పమ్మిన సూర్యం :

అప్పటి సత్యన్నారాయణ ఆయిల్ మిల్స్ అధినేతగా వ్యవహరించిన స్వర్గీయ పమ్మిన సూర్యం ఆధ్యాత్మిక, కళా రంగాలకు చేసిన సేవలు మరపురానివి. 1946 ఫిబ్రవరి 6న శ్రీకృష్ణ ద్వివ్యజ్ఞాన సమాజ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టి 1978 వరకు కొనసాగారు. ఆ పదవికి ఎంతో వన్నె తెచ్చారు. ఆయన హయాంలోనే దివ్యజ్ఞాన సమాజం పేరు అడయారు (తమిళనాడు) వరకు

వ్యాపించింది. పొందూరులో జరిగే వివిధ కళాప్రదర్శనలకు ఆయన పూలదండలో దారంలా సహకరించేవారు. నిత్యం ఖాదీ వస్త్రాలనే ధరించే వారు. మితభాషిగా, మృదుభాషిగా గుర్తింపు పొందారు. ఆయన తే11-11-1978లో నిర్యాణం చెందారు.

## : మన ప్రజా ప్రతినిధులు :



**కిల్లి కృపారాణి,**
**ఎం.పి., శ్రీకాకుళం**
**2009 - 14**



**కోరుకొండ జయలక్ష్మి**
**సర్పంచ్, పొందూరు.**



**బొడ్డేపల్లి సత్యవతి,**
**ఎం.ఎల్.ఎ., ఆమదాలవలస**
**2009 - 14**

## పొందూరు ఎలా అయింది?

పొందు అంటే స్నేహం అని అర్థం. స్నేహపరిమళాలను అందజేసే పట్టణమిది. ఇక్కడి ప్రజలు పరస్పరం ఎంతో అభిమానించుకుంటారు. ఆప్యాయతతో వ్యవహరిస్తుంటారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా వచ్చిన వారు ఇక్కడే స్థిరపడుతుంటారు. ఇక్కడి జీవన విధానం ఆదర్శప్రాయంగా ఉంటుంది. అంచేతనే దీనికి పొందూరు అనే పేరు వచ్చిందని చెబుతుంటారు.

## : పొందూరు మేజర్ పంచాయితీ :

తే01-03-1919దీన పొందూరు మేజర్ పంచాయితీ ఏర్పాటైంది. 2011 జనాభా లెక్కల ప్రకారం పొందూరు జనాభా 12,659. వీరిలో పురుషులు 5957 కాగా మహిళలు 6702. ఈ పంచాయితీలో పొందూరు, జోగన్నపేట, లక్ష్మీపేట, ఎరుకులపేట, అలబోయినపేట, ఎరుకులకోలనీ, తాపీమేస్త్రి కోలనీ ఉన్నాయి. పంచాయితీ విస్తీర్ణం 110.32 హెక్టార్లు.

పంచాయితీకి సాలీన రూ॥20లక్షల ఆదాయం వస్తోంది. వ్యయం రూ॥17లక్షలు. పంచాయితీలో మొత్తం 16వార్డులు ఉన్నాయి. కాలువలు -75,

తాగునీటిబోర్లు - 83, చెరువులు-3, నూతులు - 42, రక్షిత మంచినీటి పథకాలు -3 ఉన్నాయి. పంచాయితీలో 615ఎకరాలు పల్లం, 1500ఎకరాలు మెట్టు భూమి ఉంది. 89 ఎకరాల్లో తోటలు ఉన్నాయి.

## : సర్పంచులు వీరే :

పొందూరు సర్పంచ్‌లుగా మాడుగుల రామన్న, వడగ వెంకటేశ్వర్లు, కనకల అప్పలస్వామి నాయుడు, రేపాక తరిణయ్యశెట్టి, అనకాపల్లి రామ్మూర్తినాయుడు, పాలిశెట్టిసూర్యం, అనకాపల్లి ధర్మారావు, పాలిశెట్టి రామారావు,అనకాపల్లి విజయలక్ష్మి, గంగిరెడ్ల ఉమాదేవి, కాకర్ల పైడిలింగం వ్యవహరించారు. 2013లో కోరుకొండ జయలక్ష్మి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

ఆరోజుల్లో అధికారులపాలన కొంతకాలం సాగిన తరువాత పంచాయితీ అధ్యక్షుల పాలనకు శ్రీకారం జరిగింది. గతంలో పంచాయితీలను బోర్డులుగా పిలిచేవారు. పాలకవర్గాల పదవీ కాలం 3ఏళ్లే ఉండేది.

### మాడుగుల రామన్న :



ఆయన గుర్రపు జట్కాపై పంచాయితీ కార్యాలయానికి వచ్చేవారు. ఎక్కడికి వెళ్లిన జట్కామీద వెళ్లేవారు. తనను సంప్రదించే వారిని ఎంతో ఆదరించి ప్రాణంపెట్టేవారు. విశాఖ కోర్టు అనధికార సభ్యునిగా, జిల్లా బోర్డు సభ్యునిగా పనిచేసారు. పొందూరులో బోర్డు స్కూలును ఏర్పాటుచేసారు.

### వడగా వెంకటేశ్వర్లు :



ఆయన మంచి పరిపాలనా దక్షునిగా పేరు తెచ్చుకున్నారు. పొందూరు ప్రకాశం పంతులుగా ఆయనను పేర్కొనేవారు. పొందూరులోని ప్రధాన కూడళ్లలో గ్యాస్ దీపాలను ఏర్పాటు చేయించారు. ఆయన మాటే శాసనంగా చలామణి అయింది.

**కనకల అప్పలస్వామి నాయుడు :**



ఆయన హయాంలో గ్రామంలో శాంతి భద్రతలు బాగుండేవి. ఏవైనా తగాదాలు జరిగితే ఉభయ వర్గాలను పిలిచి తనదైన శైలిలో మందలించి పరిష్కరించేవారు. ఆయనను జస్టిస్ నాయుడుగా అంతా పిలిచేవారు. విశాఖ కోర్టు అనధికార సభ్యునిగా కూడా పనిచేసేవారు. ఎప్పుడూ తలపాగాను ధరించేవారు. చేతిలో నగిషీతో ఉన్న కర్ర కూడా ఉండేది.

**రేపాక తరిణయ్యశెట్టి :**



పంచాయితీలో సమర్ధ పాలనను అందించారు. వ్యక్తిత్వం దెబ్బతినకుండా ఎక్కడా రాజీపడేవారుకాదు. ఆయన హయాంలో స్థానిక ఆర్యవైశ్య వీధిలో వినాయక నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేవారు. నీతి నిజాయితీలకు విలువ ఇచ్చేవారు.

**అనకాపల్లి రామ్మూర్తి నాయుడు :**



ఆయన తనను సంప్రదించేవారి పనులను చక్కదిద్దేవారు. ఆయన నోట "నో" అనే మాట వచ్చేది కాదు. ప్రతి దానికి ఆల్‌రైట్, ఆల్‌రైట్ అనే ఊతపదం వాడేవారు. సహకార సంఘ అధ్యక్షునిగా కూడా పనిచేసారు.

**పాలిశెట్టి సూర్యం :**



2 దశాబ్దాల పాటు సర్పంచ్‌గా కొనసాగారు. పంచాయితీ ప్రగతికి సొంత సొమ్ము వినియోగించేవారు. పార్కును, పశువుల ఆసుపత్రి భవనాన్ని కూడా నిర్మించింది ఆయనే. (మరిన్ని వివరాలు వేరే పుటల్లో...)



**అనకాపల్లి ధర్మారావు :**

సౌమ్యునిగా గుర్తింపు పొందారు. ఎవరికైనా సంతకాలు కావలసి వస్తే మార్గమధ్యమంలోనైనా పెట్టేవారు. గ్రామంలో రోడ్ల నిర్మాణాన్ని రికార్డు స్థాయిలో చేపట్టారు. హెచ్చుకాలం పంచాయితీ కార్యాలయంలోనే గడిపేవారు. ఆయన సర్పంచ్‌గా 5ఏళ్లు, ఉపసర్పంచ్‌గా 29ఏళ్లపాటు కొనసాగారు.



**పాలిశెట్టి రామారావు :**

తన పదవీకాలంలో ప్రజాభిమానాన్ని పుష్కలంగా పొందారు. కార్యదీక్షాపరునిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. (మరిన్ని వివరాలు వేరే పేజీల్లో...)



**అనకాపల్లి విజయలక్ష్మి :**

ఆమె హయాంలో జె.ఆర్.వై. కింద వివిధ అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. తన మామ ధర్మారావు సూచనలు మేరకు పంచాయితీ రథాన్ని నడిపారు.



**గంగిరెడ్ల ఉమాదేవి :**

ఆమె హయాంలో నెహ్రూపార్కు పునరుద్ధరణ పెద్దఎత్తున జరిగింది. ప్రతీ రోజు కార్యాలయానికి వెళ్తూ పాలన సాగించేవారు. స్వతంత్రంగా వ్యవహరించేవారు. మంచి వక్తగా గుర్తింపు పొందారు. పరిపాలనా దక్షురాలిగా పేరుతెచ్చుకున్నారు. పైడితల్లి అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డును నిర్మించారు. ఇంకా ఎన్నో వీధుల్లో రోడ్లను నిర్మించారు.



**కాకర్ల పైడిలింగం :**

ఆయన హయాంలో చేపట్టిన కొన్ని పనులకు 10శాతం సొంత నిధులు వినియోగించేవారు. నిజాయితీగా వ్యవహరించారు. (మరిన్ని వివరాలు వేరే పేజీల్లో...)



### కోరుకొండ జయలక్ష్మి :

2013 ఆగస్టు 2న పంచాయితీ పగ్గాలను చేపట్టారు. పంచాయితీకి ఏదో చేయాలనే తపన ఉంది. ఆదిశగా అడుగులు వేస్తున్నారు. శిథిలమైన పంచాయితీ కార్యాలయ భవనం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించాలన్నది ఆమె ఆలోచన. తన కుమారుడు సాయికుమార్ సహకారాన్ని తీసుకుంటున్నారు.

## : సమితి / మండల పరిషత్తుల పాలన :

ఎం.పి.పి., జెడ్.పి.టి.సి. వ్యవస్థ రాకముందు సమితులు ఉండేవి. ఈ సమితుల వ్యవస్థ 1956లో ఏర్పాటైంది. సమితులకు సంబంధించి ఎస్.ఎం.పురం / పొందూరు (బ్లాక్) తే01-12-1959దీన ప్రారంభమైంది. అప్పట్లో ఈ సమితి పరిధిలో పొందూరు, .జి.సిగడాం, ఎచ్చెర్ల ఫిర్కాలు ఉండేవి. సమితిలో 7 స్థాయి సంఘాలు ఉండేవి. విద్యా, రహదారులు, వ్యవసాయం తదితర రంగాలకు అగ్రతాంబూలమిచ్చేవారు. సమితి తొలి అధ్యక్షునిగా పనిచేసిన ఖ్యాతి కూన సత్యన్నారాయణకి దక్కుతుంది. ఆతరువాత టంకాల అక్కలనాయుడు 18ఏళ్లపాటు వరుసగా ఈ సమితికి అధ్యక్షులుగా పనిచేసి రికార్డు సృష్టించారు.

### తొలి అధ్యక్షులు కూన సత్యన్నారాయణ :



సమితి తొలి అధ్యక్షునిగా కూన సత్యన్నారాయణ (పెనుబర్తి) వ్యవహరించారు. తన పదవీ కాలంలో ప్రజాపనులను ఎన్నో చేపట్టి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. ఆయన స్వగ్రామం పెనుబర్తి. అవినీతి రహిత పాలనను అందించారు. రహదారులు లేని ఆరోజుల్లో సమితి పరిధిలోని అన్ని గ్రామాలను పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేవారు. జిల్లాస్థాయిలో పరిష్కారం కావలసిన సమస్యలను జిల్లా బోర్డు అధ్యక్షులు బెండి కూర్మన్నను కలిసి చక్కబెట్టేవారు.

## టంకాల అక్కలనాయుడు :



ఆ తరువాత వెంటనే పదవిలోకి వచ్చిన టంకాల అక్కలనాయుడు (టంకాల దుగ్గివలస) సమితిని అన్ని విధాల అభివృద్ధి చేసి గుర్తింపు పొందారు. ఏ కులం పై కూడా మొగ్గు చూపకుండా సమానత్వం ప్రదర్శించేవారు. తాను సమితికే అధ్యక్షుణ్ణి తప్ప తన కులానికి కాదని ఘంటాపథంగా చెప్పేవారు. ఆరోజుల్లో సమితి పరిధిలో ఉద్యోగాలు వేసుకునే అధికారం అధ్యక్షులకు ఉండేది. ఈ నియామకాల సందర్భంగా ఎవరైనా ప్రలోభాలు చూపితే ఆయన అగ్గిమీదగుగ్గిలం అయ్యేవారు. ఓసారి రాత్రి కాపలాదారు ఉద్యోగం పొందిన ఓ వ్యక్తి ఓ పెద్ద ఆవును తీసుకొని ఆయన ఇంటికి వెళ్లినపుడు చేదు అనుభవం ఎదురైంది. ఇకముందు ఇలాంటి పనులు చేయొద్దని హెచ్చరించారు. ఈ సంఘటనను స్థానికులు ఇప్పటికి చెప్పుకుంటారు. విద్య వ్యవసాయ రంగాలకు ఆయన పెద్దపీట వేసేవారు. పొందూరు శాఖా గ్రంథాలయ భవన నిర్మాణానికి టి.జి.కె.పి. కింద నిధులు సమకూర్చారు. 1981-82లో ఎస్.ఎం.పురం సమితి కేంద్రాన్ని పొందూరుకు తరలించిన ఘనత ఆయనకే దక్కుతుంది. పొందూరు జూనియర్ కళాశాల ఏర్పాటులో ఆయన పాత్ర ఉంది.

ఆయన జిల్లా స్థాయిలో సమితికి అవసరమైన అన్ని పనులను అప్పటి జిల్లాపరిషత్ అధ్యక్షులు, రాష్ట్ర మధ్యతరహా నీటిపారుదల, వెనుకబడిన తరగతుల శాఖ మంత్రి గొర్లె శ్రీరాముల నాయుడు సహకారం తీసుకునేవారు. ఆయన సతీమణి టంకాల సరస్వతమ్మ 1989లో చీపురుపల్లి శాసన సభ్యురాలిగా గెలిచారు. కుమారుడు అనిరుద్రుడు జి.సిగడాం జెడ్.పి.టి.సి సభ్యునిగా, కోడలు లక్ష్మి జి.సిగడాం ఎం.పి.పి.గా వ్యవహరించారు. ఎచ్చెర్ల శాసన సభ్యులు మీసాల నీలకంఠం నాయుడు(2009-14) అక్కలనాయుడు శిష్యుడే.

## : మండల వ్యవస్థ :

పొందూరు తొలి ఎం.పి.పి.గా బి.ఎల్.నాయుడు, గోరింట(1987-92) అలాగే 1995-2000 తొలి జెడ్.పి.టి.సి. సభ్యునిగా ఆయనే ఎన్నికయ్యారు,

కూన రవికుమార్, పెనుబర్తి (1995-2000)లో ఎం.పి.పి.గా గెలిచారు. 2001-2006లో కూన ప్రమీల, పెనుబర్తి ఎం.పి.పి.గా, కూన రవికుమార్ జెడ్.పి.టి.సి.గా విజయం సాధించారు. 2006-11లో ఎం.పి.పి.గా కూన ప్రమీల, జెడ్.పి.టి.సి. సభ్యురాలిగా లోలుగు అనూరాధ (లోలుగు) ఎన్నికయ్యారు.

**బి.ఎల్.నాయుడు :**



పొందూరు తొలి ఎం.పి.పి.గా, తొలి జెడ్.పి.టి.సి. సభ్యునిగా బి.ఎల్.నాయుడు (గోరింట) వ్యవహరించారు. ఆయన హయాంలో ఆపరేషన్ బ్లాక్‌బోర్డ్ (ఒ.బి.బి) పథకం కింద మండలంలోని 53 పాఠశాలలకు భవన నిర్మాణాలు చేపట్టి కృతకృత్యులయ్యారు. ఎం.ఎ.,బి.ఎల్ పట్టభద్రులు. సౌమ్యునిగా గుర్తింపు ఉంది.

**కూన రవికుమార్ :**



పొందూరు ఎం.పి.పి.గా, జెడ్.పి.టి.సి. సభ్యునిగా వ్యవహరించిన రవికుమార్ ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు పొందారు. సమర్థుడైన పాలకునిగా పేరుంది. ప్రజా సమస్యలను పరిష్కరించే దిశలో చతుర్విధ ఉపాయాలను ప్రయోగిస్తుంటారు. తనను సంప్రదిస్తే చాలు వారి ముందే సంబంధిత అధికారికి ఫోన్‌చేసి ఆపని చేసి పెడుతుంటారు. రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చేవారు. మండల పరిషత్ ఆవరణలో వివిధ కార్యాలయాలకు తన సతీమణి ప్రమీలతో కలసి భవనాలను నిర్మించారు. మరికొన్ని కార్యాలయాలకు వసతిని సమకూర్చి సహకరించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, నియమ, నిబంధనలపై మంచి పట్టుఉంది. అంచేత అధికారులెవ్వరూ ఆయనను తప్పుపట్టించే అవకాశమేలేకుండా పోయింది. దటీజ్ రవికుమార్. ఆయన బి.ఇ. పట్టభద్రులు.

> నూరు పూలు వికసించనీ...
> వేయి భావాలు సంఘర్షించనీ... – మావో

**కూన ప్రమీల :**



రవి కుమార్ సతీమణి ప్రమీల వరుసగా రెండు సార్లు ఎం.పి.పి.గా వ్యవహరించారు. ఎం.ఎ. పట్టభద్రులు. భర్త రవి కుమార్ సూచనలను పరిగణనలోకి తీసుకొని పరిపాలన సాగించారు. కొత్తలో ఉపన్యాసాలివ్వడంలో తడబాటుపడినా, అనుభవం నేర్పిన పాఠాలతో ఆమెలో ఎంతో పరిణితి కన్పించింది. చక్కగా ఉపన్యాసాలు ఇవ్వగలుగుతున్నారు. ఆమె హయాంలో కమ్యూనికేషన్లు, విద్య, ఆరోగ్యం తదితర విభాగాలు ఎంతో అభివృద్ధికి నోచుకున్నాయి. సౌమ్యురాలిగా మన్ననలు పొందారు

**లోలుగు అనూరాధ :**



ఈమె హయాంలో తాగునీటి పథకాలు హెచ్చుస్థాయిలో రూపుదిద్దుకున్నాయి. జిల్లా పరిషత్ నుంచి అవసరమైన అన్ని ప్రజా పనులకు నిధులను రాబట్టి మండలాన్ని అభివృద్ధి చేసారు. భర్త శ్రీరాములనాయుడు సలహాలను తీసుకొని తన బాధ్యతలను నిర్వహించారు.

**: చరిత్ర పుటల్లో మిగిలిన పొందూరు అసెంబ్లీ సెగ్మెంట్ :**

జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు పొందిన పొందూరు ఒక్కప్పుడు శాసనసభ నియోజకవర్గ కేంద్రంగా ఉండేది. 16ఏళ్ల పాటు ఈ నియోజకవర్గం కొనసాగి కాలగర్భంలో కలిసిపోయింది. 1962లో చీపురుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి విడిపోయి ప్రత్యేక సెగ్మెంట్‌గా రూపుదిద్దుకున్న పొందూరు ప్రాంతం 1978లో తిరిగి అదే చీపురుపల్లి సెగ్మెంట్‌లో విలీనమైంది అక్కడితో ఆగలేదు. తిరిగి 2009లో చీపురుపల్లి నుంచి పొందూరు ప్రాంతం విడిపోయి ఆమదాలవలస సెగ్మెంట్‌లో కలిసిపోయింది. 1962లో పొందూరు (ఎస్.సి) నియోజకవర్గం నుంచి కొత్తపల్లి పున్నయ్య(కాంగ్రెస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే పున్నయ్యకు జిల్లా సెషన్స్ జడ్జి ఉద్యోగం రావడంతో పదవికి రాజీనామా చేసారు. దీంతో 1964లో జరిగిన ఉపఎన్నికల్లో కొత్తపల్లి నరసయ్య(కాంగ్రెస్) ఎన్నికయ్యారు. 1967లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ అసెంబ్లీ సెగ్మెంట్

జనరల్ సీటుగా మారింది. ఈ ఎన్నికల్లో స్వతంత్ర పార్టీ(నక్షత్రం గుర్తు) అభ్యర్థి చౌదరి సత్యన్నారాయణ గెలిచారు. 1972లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి లుకలాపు లక్ష్మణదాసు గెలిచారు. 1978లో చీపురుపల్లి నియోజకవర్గంలో పొందూరు ప్రాంతం విలీనమైంది. 1978లో చిగిలిపల్లి శ్యామలరావు(కాంగ్రెస్-ఐ) శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. 1983లో త్రిపురాన వెంకటరత్నం(తె.దే.పా), 1985లో కెంబూరి రామ్మోహనరావు (తె.దే.పా), 1989లో టంకాల సరస్వతమ్మ (తె.దే.పా), 1994,1999 ఎన్నికల్లో వరుసగా గద్దె బాబూరావు (తె.దే.పా) ఎన్నికయ్యారు. 2004లో బొత్స సత్యన్నారాయణ (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. 2009లో తిరిగి పొందూరు ప్రాంతం ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గంలో కలిసిపోయింది. ప్రస్తుతం ఆమదాలవలస శాసనసభ్యురాలిగా బొడ్డేపల్లి సత్యవతి వ్యవహరిస్తున్నారు. ఈమె హయాంలో 2013-14సం॥లో పొందూరుకు జ్యూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు కావడం విశేషం.

## పొందూరు చరిత్రలో కీలక ఘట్టం

## (జై ఆంధ్ర ఉద్యమంలో 6గురు మృతి)

2013 సమైక్యాంధ్ర ఉద్యమ నేపథ్యంలో ఒకనాటి "జై ఆంధ్ర" ఉద్యమాన్ని గుర్తుకు తెచ్చుకోవడం అవసరం. పొందూరు ప్రజానీకం నాటి ఉద్యమంలో గణనీయమైన పాత్రను పోషించింది. 1972-73 సం॥లో ముల్కీ నిబంధనలకు వ్యతిరేకంగా " జై ఆంధ్ర " ఉద్యమాన్ని నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ గళమెత్తారు. " జై ఆంధ్ర జైకొట్టు - జగమంత వినిపించు, నవ్యాంధ్ర నవశక్తి - ధరణంత కదిలించు " అంటూ నినాదాలు చేసారు. ఈ ఉద్యమంలో సర్దార్ గౌతు లచ్చన్న, చిగిలిపల్లి శ్యామలరావు (మాజీ మంత్రులు), గురుగుబెల్లి స్వామినాయుడు తదితరులు పొందూరులో నిర్వహించిన ఉద్యమ సభల్లో పాల్గొని ప్రజలను చైతన్యపరిచారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని కోరుతూ ఆచంట సాంబశివరావు(ఎల్.ఐ.సి) ఆమరణ నిరాహారదీక్ష జరిపారు. అయితే కొన్ని రోజులు గడిచాక పోలీసులు ఈ దీక్షను భగ్నం చేసారు.

ఈ ఉద్యమంలో భాగంగా తే08-02-1973దీన స్థానిక టెలిఫోన్

ఎక్సేంజీని ధ్వంసం చేసారన్న అభియోగంపై విద్యార్థి నాయకులు పైడి దామోదరరావు, ఆచంట విజయకుమార్, జి.ఎల్.ఎన్.గుప్త, మొకర పైడినాయుడు, దండాసూరిబాబు, వడగ జగన్మోహనరావు, కోరుకొండ బుచ్చిరమణలను అరెస్టు చేసారు. అయితే 11-02-1973దీన వీరిని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచేందుకు పోలీసులు సిద్ధమౌతున్న సంగతిని తెలుసుకున్న ప్రజలు పోలీస్టేషన్ ఎదుట గుమిగూడారు. ఖాకీలకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. అయితే జనంలో ఎవరో తెలియని ఒకరిద్దరి వ్యక్తులు పోలీసులపై ఆవేశంతో రాళ్ళు విసిరారు. అప్పటి చీపురుపల్లి తాహశిల్దార్ ఆదేశాలమేరకు పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో మొత్తం 6గురు చనిపోయారు. వీరిలో ప్రముఖ రంగస్థల నటుడు, టైలర్ నల్లి సన్యాసినాయుడు ఉన్నారు. ఈయన రంగూన్ రౌడీ సాంఘిక నాటకంలో కథానాయకుని పాత్రను పోషించి ఎంతో గుర్తింపు పొందారు. ఈ ఉదంతంలో బండారు కృష్ణారావు, బెవర రామినాయుడు, చదువుల సత్యలింగం తీవ్రంగా గాయపడ్డారు. ఆ సంఘటనలో పోలీసులు మొదట లాఠీచార్జీని, ఆతరువాత బాష్పవాయువు ప్రయోగాన్ని జరపాల్సి ఉండగా నిబంధనలను నిలువున పాతేసి నేరుగా కాల్పులను జరిపి ఘోరం చేసారు. మొత్తం మీద టెలీఫోన్ ఎక్సేంజ్ కేసులో అరెస్టయిన 5గురిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు నెలరోజులపాటు కర్ఫ్యూ విధించారు. ఇదే అదనుగా తీసుకొని కొందరు సి.ఆర్.పి.లు మహిళలపై అత్యాచారానికి పాల్పడిన ఉదంతాలు ఇప్పటికి ఈ ప్రాంతంలో వృద్ధులంతా చెబుతుంటారు. ఇదిలా వుండగా ఈ సంఘటనకు సుమారు 30 మందిని పోలీసులు అరెస్టుచేసి చీపురుపల్లి ఉపకారాగారానికి తరలించారు. అరెస్టయిన వారిలో మోదుకూరు చరణ్‌బాబు, గుంటుకు జగన్నాధరావు, గుడ్ల చంద్రశేఖరావు ఆట్ల మణిభూషణరావు, డి.వి.సూర్యారావు, వి.కొండలరావు(ఈ పుస్తక రచయిత), వడగ జగన్మోహనరావు, గుంటుకు రాఘవులు, సాదు విజయ్‌శంకర్ తదితరులు ఉన్నారు. జీపు దగ్ధం కేసులో హంస వెంకటరావు, మొకర పైడినాయుడు అయితే ఆ తరువాత ఈ కేసులను రాష్ట్ర ప్రభుత్వం కొట్టివేసింది.

## : 2013లో సమైక్య ఉద్యమం :

2013లో ఆగస్టు, సెప్టెంబర్లో సమైక్యాంధ్ర కోసం జరిగిన ఉద్యమంలో ఉపాధ్యాయ, ఎన్.జి.ఒ. విశ్రాంత ఉద్యోగుల జె.ఎ.సి., అన్ని వృత్తి, కుల సంఘాలు, ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు, కూలీలు, రైతులు ఇలా అన్ని వర్గాల పాల్గొన్నాయి. పొందూరు ఆర్.టి.సి. కాంప్లెక్స్ ఆవరణలో నిరంతర ధర్నా కార్యక్రమాన్ని కొనసాగించారు. సెప్టెంబర్ 30న జాతీయ సంప్రదాయ, సాంస్కృతిక మండలి నిర్వాహకురాలు సత్యవాణి ఉద్యమ సభలో పాల్గొని ప్రజలను చైతన్యపరిచారు. ఈ ఉద్యమానికి ప్రజలే నాయకత్వం వహించడం ఓ గొప్ప పరిణామం. ప్రతీ ఒక్కరూ ఓ నాయకునిగా పాత్రను పోషించి రాష్ట్ర సంక్షేమం కోసం పాటుపడటం విశేషం. ఈ ఉద్యమంలో భాగంగా సెప్టెంబర్ 6 నుంచి అక్టోబర్ 10 వరకు స్థానిక ఆర్.టి.సి. కాంప్లెక్స్ ఆవరణలో 35రోజులపాటు జె.ఎ.సి ఆధ్వర్యంలో పలు నిరసన కార్యక్రమాలు జరిగాయి. జె.ఎ.సి సారధ్య కమిటీలో పేడాడ లక్ష్మణరావు, మలిపెద్ది శివరామకృష్ణ, పి.లక్ష్మి కుమారి, పి.వి.నాగేంద్ర, పైడి సూర్యారావు, మొగదాల రమణారావు, బొడ్డేపల్లి జనార్దనరావు, పుణ్యవతి, వి. రాజారావు, ఎ.లింగరాజు ఉన్నారు.

## : పాఠకులకు తోడూనీడ ఆ గ్రంథాలయాలు :

### మహాదేవ గ్రంథాలయం :

పొందూరులో కొన్ని దశాబ్దాల క్రితం ప్రముఖ దాత దివంగత కలగర్ల మహదేవశెట్టి వేలాది పుస్తకాలతో ఏర్పాటు చేసిన " మహదేవ గ్రంథాలయం" ఓ వెలుగు వెలిగి అనంతరం కాల గర్భంలో కలిసిపోయింది. ఆ రోజుల్లో ఈ గ్రంథాలయానికి వేటపాలేం సారస్వత నికేతనం (ప్రకాశం జిల్లా) గ్రంథాలయానికి ఉన్నంత పేరుండేది. ఈ గ్రంథాలయంలో తెలుగు, సంస్కృతం, హిందీ, ఆంగ్ల భాషలకు చెందిన వేలాది గ్రంథాలుండేవి. తాళపత్ర గ్రంథాలుసైతం అందుబాటులో ఉండేవి. ఈ గ్రంథాలయ అధ్యక్షులుగా మహదేవశెట్టి, అల్లంశెట్టి అప్పయ్య కవి, ఆచంటి సూర్యనారాయణ మూర్తి వ్యవహరించారు. ఈ గ్రంథాలయానికి అప్పట్లో గ్రంథపాలకులుగా ఉప్పలపాటి నారాయణమూర్తి

మాస్టారు (వాండ్రంగి), నాళం నర్సింగరావు (పొందూరు), సి. హెచ్.వరహాల నాయుడు (ఎరుకులపేట) పనిచేసారు. ఈ గ్రంథాలయం తొలుత ఆచంటి వీథిలోను తరువాత గ్రామ పంచాయితీ కార్యాలయంలో సోషల్ క్లబ్‌లో ఉండేది. అయితే గ్రంథాలన్నీ కాలక్రమేణా చౌర్యానికి గురయ్యాయి.

**చిరస్మరణీయుడు కలగర్ల మహదేవశెట్టి :**

మహదేవశెట్టి పొందూరుకే గర్వకారణంగా నిలిచిన ప్రముఖ దాత. ఉదార స్వభావుడు. కొవ్వొత్తి తాను కరిగిపోతూ వెలుగునిచ్చే విధంగా ఆయన తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసారు. ఆయన అన్నదాన సత్రాన్ని ఏర్పాటుచేసి పేదలపాలిట పెన్నిధిగా నిలిచారు. ఆయన స్థాపించిన మహదేవ గ్రంథాలయం కనుమరుగైనప్పటికి ఇప్పటికి ప్రజలు ఆగ్రంథాలయ విశిష్టతను చెప్పుకుంటారు. మహదేవశెట్టి విజయనగరం భూమితనకా బ్యాంకు డైరెక్టరుగా, పొందూరు కో-ఆపరేటివ్ స్టోర్స్ డైరెక్టరుగా, సెంట్రల్ గ్రౌండ్ నట్ ఆయిల్ మిల్స్ అధినేతగా, పొందూరు పంచాయితీ కోర్టు అధ్యక్షునిగా వ్యవహరించి పేరుతెచ్చుకున్నారు. 38ఏళ్ల యుక్తవయస్సులోనే 1944 అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నాడు అస్తమించారు. ఈ సందర్భంగా తే 03-10-1944దీన పౌర సానుభూతి సభను పెద్దఎత్తున నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సభలో కవితా కోవిద అల్లంశెట్టి అప్పయ్య కవి మహదేవశెట్టి దాతృత్వంపై ఆశువుగా ఓ కంద పద్యాన్ని చెప్పారు.

**శాఖా గ్రంథాలయం :**

మహదేవ గ్రంథాలయం స్ఫూర్తితో పొందూరులో 1981 సెప్టెంబర్ నెలలో ప్రభుత్వం శాఖా గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసింది. ఈ గ్రంథాలయంలో 4వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. అన్ని వర్గాలకు అవసరమైన ప్రాచీన గ్రంథాలు, నవలలు, కథా సాహిత్యం, పోటీ పరీక్షలు, పాఠకుల ఆరదణను నోచుకుంటున్నాయి. గతంలో సుదీర్ఘకాలం పనిచేసిన వై.సూర్యనారాయణ గ్రంథాలయానికి అంకితమై పనిచేసారు. ఆయన బాటలో మరో గ్రంథ పాలకుడు ఎస్.వి. రమణమూర్తి కూడా విశిష్ట సేవలు అందించారు. గ్రంథాలయంలో

జరిగే ప్రతి కార్యక్రమానికి ఉంద్రాళ్ళ రాజు వెన్నుదన్నుగా ఉండి తన సేవలను కొనసాగిస్తున్నారు.

**నవత గ్రంథాలయం :**

స్థానిక గాంధీనగరంలో 1999 మార్చి 18న ఏర్పాటు చేసిన నవత గ్రంథాలయం ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ఎ.ఎం.అర్జున్ దీని వ్యవస్థాపకులు. ఈ గ్రంథాలయం ఏర్పాటుకు పలువురు దాతలు స్థలాన్ని సమకూర్చారు. అప్పటి బొబ్బిలి ఎం.పి. బొత్స ఝాన్సీలక్ష్మి ఎం.పి. లాడ్స్ క్రింద రూ॥ 2లక్షల మొత్తాన్ని అందజేసారు. హైదరాబాదుకు చెందిన శాస్త్రవేత్త గుంటుకు కృష్ణారావు తన మిత్ర మండలి సాయంతో రూ॥ 50 వేల మొత్తాన్ని అందజేసారు. గ్రంథాలయంలో 400 పుస్తకాలున్నాయి. గ్రంథ పాలకునిగా పి.ఎస్.ప్రకాశరావు వ్యవహరిస్తున్నారు.

**కాశీవిశ్వేశ్వర గ్రంథాలయం :**

ఓ దివ్వె వెలిగించు వేవేల దీపాలు అన్నట్టు స్థానిక బరంపురం వీధి కూడలిలో తేదీ 08-04-2001 లో కాశీవిశ్వేశ్వర స్వచ్ఛంధ గ్రంథాలయం ఏర్పాటైంది. అప్పటి సర్పంచ్, ప్రస్తుత ఉప సర్పంచ్ కాకర్ల పైడిలింగం గ్రంథాలయం ఏర్పాటుకు వెలయు స్థలాన్ని ఉదారంగా అందజేసారు. అప్పటి బొబ్బిలి ఎం.పి. బొత్స సత్యన్నారాయణ ఎం.పి. లాడ్స్ క్రింద రూ॥ 2 లక్షలు కేటాయించారు. ఈ గ్రంథాలయం నిత్యం పాఠకులతో కళకళలాడుతోంది. ఈ గ్రంథాలయాలను వినియోగించుకొని వందలాదిమంది యువతీ యువకులు ప్రభుత్వ, ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే ఉద్యోగాలను పొందారు.

## : స్వచ్ఛంద సేవా సంస్థలు – సేవలు :

**సేవాపథంలో యంగ్‌స్టార్స్ :**

1974లో పరిమిత లక్ష్యంతో యంగ్‌స్టార్స్ జిమ్నాజియం అనే పతాకతో ప్రారంభమై 1976లో విస్తృత ప్రాతిపదికపై యూత్‌క్లబ్ (ఎన్.వై.కె. అనుబంధ సంస్థ) గా రూపుదిద్దుకుంది. ఈ క్లబ్‌ను ఆచంట విజయ్‌కుమార్ (గౌరవ

అధ్యక్షులు), కె.శాంతారాం, ఎ.అక్కలనాయుడు తదితరుల కృషితో క్లబ్ ఏర్పాటైంది. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వీధులను పరిశుభ్రంచేసే కార్యక్రమాలను చేపట్టారు. ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు, వరదలు సంభవించినప్పుడు క్లబ్ సభ్యులు జోలెపట్టి విరాళాలు, వస్త్రాలు, బియ్యం తదితరమైనటువంటి వాటిని సేకరించి బాధితులకు అందజేస్తున్నారు. జాతీయ పండుగులతో పాటు ప్రముఖుల జయంతి ఉత్సవాలను నిర్వహిస్తూ ఈ సందర్భంగా వివిధ పోటీలను జరిపి విజేతలకు బహుమతులను అందజేస్తున్నారు. తరచూ పొందూరు పరిసర ప్రాంత గ్రామాల్లో డా॥ సనపల తిరుపతిరావు తదితరల సహకారంతో వైద్య, ఆరోగ్య శిభిరాలను నిర్వహిస్తూ సేవలందిస్తున్నారు. 1985లో ఇటలీలో నిర్వహించిన అంతర్జాతీయ యువజన సమ్మేళనంలో క్లబ్ సభ్యుడు ఆచంట రమణకుమార్ పాల్గొన్నారు. స్థానిక పశువుల ఆసుపత్రి భవన నిర్మాణానికి, శాఖా గ్రంధాలయ నిర్మాణానికి, 1వ నెంబరు ప్రాధమిక పాఠశాలలో అదనపు భవన నిర్మాణానికి గాను సభ్యులు శ్రమదానం చేసారు. నెహ్రూ యువకేంద్ర సౌజన్యంతో క్లబ్ సభ్యుల ధీక్షతో యూత్ క్లబ్‌కు శాస్వత భవనం ఏర్పాటైంది. క్లబ్ భవనంలోనే వ్యాయామశాలను నిర్వహిస్తున్నారు. అక్షరక్రాంతి, ఎయిడ్స్ నివారణ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల్లో సభ్యులు చురుకుగా పాల్గొంటున్నారు. క్లబ్ స్థానిక అక్కమాంబ ఆలయంలో కొన్నాళ్లపాటు పైడిపాటి రాంబాబు ఆధ్వర్యంలో కార్మికులకు రాత్రి పాఠశాలను నిర్వహించారు. ప్రస్తుతం 2013-14లో యూత్ క్లబ్ అధ్యక్షునిగా పట్నాన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆట్ల చంద్రశేఖరరావు వ్యవహరిస్తున్నారు.

## లయన్స్ క్లబ్ :

పొందూరులోని వివిధ స్వచ్ఛంద సంస్థలు సేవలందిస్తూ ప్రజల మన్ననలను పొందుతోంది. సేవే మా లక్షం - మెరుగైన సమాజ స్థాపనే మా ధ్యేయం అంటూ నిస్వార్ధంగా పేద వర్గాల కోసం పనిచేస్తున్న సంస్థల్లో లయన్స్ క్లబ్ ఒకటి. తే18-02-1983దీన పొందూరులో లయన్స్ క్లబ్ ఏర్పాటైంది.

అప్పటి నుంచి ఇప్పటి వరకు సేవలందించడమే పరమావధిగా లయన్స్ క్లబ్ ప్రస్థానం సాగుతోంది. శాశ్వత ప్రాజెక్టులు, ఉచిత వైద్య శిబిరాలు, నేత్ర వైద్య చికిత్సా శిబిరాలు, పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ తనవంతు కృషి చేస్తుంది. తెలుగు గ్రామీణ క్రాంతి పథం కింద స్థానిక శాఖా గ్రంథాలయానికి శాశ్వత భవనాన్ని నిర్మించింది. స్థానిక దేవాంగ వీధి ప్రాథమిక పాఠశాల శాశ్వత భవనానికి అధనపు హంగులను కల్పించింది.

ఇంత వరకు 320 ఉచిత వైద్య శిబిరాలను, 40 ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించింది. 3500 మందికి కేటరాక్ట్ శస్త్రచికిత్సలు చేసారు. వికలాంగులకు కృత్రిక అవయవాలను అందజేశారు. 150 మంది కేన్సర్ బాధితులకు చికిత్సలు అందించారు. లయన్స్ జిల్లా ఛైర్మన్ డా॥ వై.మల్లిబాబు వివిధ వ్యాధులకు సంబంధించి 15 చిరు పుస్తకాలను ప్రచురించి ఉచితంగా పంపిణీ చేసారు. లయన్స్ క్లబ్ శాశ్వత భవన నిర్మాణానికి సంబంధించి శ్రీశైలం దేవస్థానం దేవాంగ సత్రం డైరెక్టర్, పొందూరు మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు కాకర్ల రాజారావు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎదురుగా 6 సెంట్ల (300 గజాలు) భూమిని ఉదారంగా అందజేసారు. పొందూరు లయన్స్ క్లబ్‌లో బి.జె.నాయుడు, ఎం.వెంకటరావు, కూన రవికుమార్, వై. సతీష్, గోరు అప్పలసూరి, కుప్పిలి శ్రీనివాసరావు, కె. క్రిష్ణవేణి, వై.అనూరాధ, ఎ.కళ్యాణి తదితరులు సేవలందిస్తున్నారు. ప్రస్తుతం 2013-14 లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా వి.సూర్యనారాయణ, కార్యదర్శిగా రాగోలు శేషసాయి, కోశాధికారిణిగా కాకర్ల చల్లమాంబ వ్యవహరిస్తున్నారు.

## మిత్ర ఫౌండేషన్ :

సహృదయత, దాతృత్వం, సమాజసేవల త్రివేణీ సంగమమే పొగిరి సుగుణాకరరావు. 2010-11 సంవత్సరంలో పొందూరులో మిత్ర ఫౌండేషన్‌ను ఆయన స్థాపించారు. ఎందరో నిరుపేద, ప్రతిభావంతులైన విద్యార్థులను అక్కున చేర్చుకొని సంస్థ పక్షాన సేవలందిస్తున్నారు. " వట్టి మాటలు కట్టిపెట్టోయ్... గట్టి మేల్ తలపెట్టవోయ్..." అనే గురుజాడ సూక్తిని అక్షరాల అమలుచేస్తూ

పయనిస్తున్న సుగుణాకరరావు ప్రస్తుతం విజయవాడ నగరపాలక సంస్థ కార్యనిర్వాహక ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. వరుసగా 9ఏళ్లు రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ ఇంజనీర్ అవార్డులు పొందారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో నిర్వహించిన 10 జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని పత్రాలను సమర్పించారు.

## సేవలివే...



మిత్ర ఫౌండేషన్ పతాకంపై వైద్య, ఇంజనీరింగ్, వ్యవసాయశాస్త్రం, పాలిటెక్నిక్‌లలో చదువుతున్న 40మంది విద్యార్థులను దత్తత తీసుకొని ఆదుకుంటున్నారు. ప్రతీఏటా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన అధ్యయన సామగ్రిని రెండువేల మంది విద్యార్థులకు ఉదారంగా అందజేస్తున్నారు. వ్యక్తిత్వ వికాశానికి అవసరమయ్యే శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కెరీర్ గైడెన్స్ ప్రక్రియను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. సుగుణాకర్ ప్రాథమిక విద్య పొందూరు 2వ నెంబర్ ప్రాథమిక పాఠశాల, మాధ్యమిక, ఇంటర్ విద్యను ఇక్కడే కొనసాగించారు. ఎ.యు.లో బి.ఇ., ఎం.బి.ఎ. పూర్తిచేసారు. అక్కడితో ఆయన విజ్ఞానదాహం తీరలేదు. శ్రీకాకుళం జిల్లాలో సూక్ష్మ, కుటీర, మధ్యతరహా పరిశ్రమల అవకాశాలపై సిద్ధాంత గ్రంధాన్ని రాస్తున్నారు. కాకినాడ జె.ఎన్.టి.యు. ఆధ్వర్యంలో పిహెచ్.డి. ని కొనసాగిస్తున్నారు. తల్లిదండ్రులు కాంతమ్మ - జగన్నాథంతో పాటు తన విద్యాభివృద్ధికి స్ఫూర్తినిచ్చిన వి.కృష్ణదాస్ మాస్టారిని, సేవాకాంక్షను రేకెత్తించిన దివంగత పైడిపాటి రాంబాబు సహకారాన్ని మరువలేనని ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

సభ్యుల దీక్షతో యూత్ క్లబ్‌కు శాస్వత భవనం ఏర్పాటైంది. క్లబ్ భవనంలోనే వ్యాయామశాలను నిర్వహిస్తున్నారు. అక్షరక్రాంతి, ఎయిడ్స్ నివారణ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల్లో సభ్యులు చురుకుగా పాల్గొంటున్నారు. క్లబ్ స్థానిక అక్కమాంబ ఆలయంలో కొన్నాళ్లపాటు పైడిపాటి రాంబాబు ఆధ్వర్యంలో కార్మికులకు రాత్రి పాఠశాలను నిర్వహించారు. ప్రస్తుతం 2013-14లో యూత్

క్లబ్ అధ్యక్షునిగా పట్నాన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆట్ల చంద్రశేఖరరావు వ్యవహరిస్తున్నారు.

**రూ॥ 40 కోట్లతో ఖాదీ అభివృద్ధికి ప్రత్యేక పథకం :**

జిల్లా పాలనాయంత్రాంగం సౌజన్యంతో పొందూరు ఖాదీ సమగ్రాభివృద్ధికి రూ॥ 40కోట్లతో **మిత్రాఫౌండేషన్ చొరవతో** ఓ ప్రత్యేక పథకాన్ని మంజూరు కోసం తీవ్రస్థాయిలో చర్యలు తీసుకొంటున్నారు. ఖాదీలో ఆధునిక సాంకేతిక విజ్ఞానం శిక్షణలు, డిజైన్ ప్రక్రియలు, మార్కెటింగ్ సౌకర్యాలు, ముడి సరకు తదితర అంశాలతో ప్రతిపాదించిన ప్రత్యేక ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అయితే కేంద్రప్రభుత్వం తుది ఆమోదాన్ని ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రక్రియలో సుగుణాకర్ శ్రద్ధ తీసుకొని ప్రాజెక్టు మంజూరుకుగాను కేంధ్ర మంత్రి డా॥ కిల్లి కృపారాణి సహకారాన్ని తీసుకొంటున్నారు. ఆమె సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

**అజంతా ఆర్ట్స్ అకాడమి :**

పొందూరులో 1974-75 ప్రాంతంలో ఏర్పాటు చేసిన అజంతా ఆర్ట్స్ అకాడమీ సాంఘిక నాటక రంగానికి అమూల్యమైన సేవలందించింది. వెంకన్నకాపురం, పల్లెపడుచు, తెరచిరాజు, ఏక్-దిన్-కా సుల్తాన్ తదితర నాటికలను ప్రదర్శించారు. అప్పటి జూనియర్ లెక్చరర్ వంతరాం శ్రీరామమూర్తి, అనకాపల్లి వెంకటరావు, రాచకొండ జగన్నాధరావు, కె. రామరాజు, వారణాశి లక్ష్మణరావు, కొల్లి రామచంద్రరావు, పాలిశెట్టి వెంకన్న, గుడ్ల సాయిరాజు, కె.శాంతారాం, తదితరులు వివిధ పాత్రలను సమర్ధంగా పోషించారు.

**స్ఫూర్తి స్వచ్ఛంధ సంస్థ :**

2012 సెప్టెంబర్ 5న ప్రారంభించారు. ఈ సంస్థ అతి స్వల్పకాలంలోనే ప్రజల అభిమానాన్ని చూరగొంది. ఈ ట్రస్టులోని సభ్యులంతా పూర్వవిద్యార్థులే. వీరిలో ఉద్యోగం చేస్తున్నవారు కొందరైతే, చదుకుంటున్న వారు కొంత మంది. స్థానిక నాయీబ్రాహ్మణ కోలనీలో నిర్మించిన తాగునీటి బోరు వాడుకనీరు సమీప జనావాసాలతో పాటు, 4వ నెంబరు ప్రాధమిక పాఠశాలకు తీవ్ర ఇబ్బంది

కలిగించింది. ఈ నేపథ్యంలో స్ఫూర్తి కార్యకర్తలు స్పందించి బోరు నుంచి వస్తున్న మురుగు నీటిని సమీపంలో ఉన్న కాలువ వరకు పైప్‌లైన్ వేయించారు. పాఠశాల సమీపంలో ఉన్న రహదారులను పునరుద్ధరించారు. స్థానిక 1వ నెంబర్ ప్రాథమిక పాఠశాలలో కుళాయిలు వేసి తాగునీటి సౌకర్యాన్ని చక్కగా అందుబాటులోకి తెచ్చారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులందరికి పల్లాలు, గ్లాసులు అందజేసారు. పర్యావరణ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలకు పాలథీన్ సంచులను ఉదారంగా అందజేసారు.

తే 05-09-2013దీన స్థానిక పట్టుశాలీ కళ్యాణమండపంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వి. కృష్ణదాస్‌ను ఘనంగా సత్కరించారు. స్థానిక దివ్యజ్ఞాన సమాజ మందిరంలో పోటీ పరీక్షలకు తయారైన అభ్యర్థులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక నవత గ్రంథాలయంలో గ్రంథపాలకున్ని నియమించి వేతనాన్ని కూడా ఏర్పాటు చేయించారు. అలాగే నెహ్రూ పార్క్ అభివృద్ధికి కూడా ఈ సంస్థ ముందుకు వచ్చింది.

**చిరుదివ్వె చైతన్య ఫౌండేషన్ :**

"గోరంత దీపం కొండలకు వెలుగు అన్నట్టు" పొందూరులో తే28-09-2012లో విద్యార్థి భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ సంస్థ అతి కొద్ది కాలంలోనే మంచి పేరు తెచ్చుకొంది. ఈ సంస్థ వ్యవస్థాప అధ్యక్షుడు, నిర్వాహకుడు డోకి హరిక్రిష్ణ కీలక పాత్రను పోషిస్తూ, అడ్డంకులను, అవరోధాలను అధిగమిస్తూ దూసుకొనిపోతున్నాడు. ఈ విద్యార్థి స్థానిక సిస్టమ్ డిగ్రి కళాశాలలో చదువుతున్నాడు. లక్ష్మీపేట, గాంధీనగరం 2వ వీధి, లావేరు మండలం, కొత్తకుంకాం, ఎల్.ఎన్.పురం తదితర గ్రామాల్లో 175 మందితో నేత్రదాన అంగీకార పత్రాలపై సంతకాల సేకరణ, నేత్ర వైద్య నిపుణులు డా॥ సనపల తిరుపతిరావు, డా॥ అప్పారావు ఆధ్వర్యంలో 4 వైద్య శిబిరాల నిర్వహణ, 47 మందికి ఉచిత నేత్ర చికిత్సలు, కళ్లద్దాల పంపిణీ, 4 రక్తదాన శిబిరాలను నిర్వహించి వందలాది మందితో రక్తదానం ఈ సంస్థ నిర్వహించింది. పర్యావరణ పరిరక్షణలోల భాగంగా మొక్కలు నాటడం, వికలాంగులకు వస్త్రాల పంపిణీ, ఇటీవల పొందూరులో అస్వస్థతో రోడ్డుపై పడివున్న ఓ వృద్ధుణ్ణి కాపాడి హరికృష్ణ

ఆదుకున్నాడు. తరువాత రిమ్స్‌కు తరలించి చికిత్స జరిపించాడు.

విజయనగరం జిల్లా రామభద్రపురం వెళ్లి ఆ వృద్ధుని కొడుకుల ఆచూకీ తెలుసుకొని వారిని వెంటతీసుకొని వచ్చి తండ్రి వద్దకు చేర్చిన ఉదంతం చిరుదివ్వె చైతన్య సంస్థకు ఎనలేని ప్రాచుర్యం లభించింది. ఈ సంస్థ ప్రగతికి యువజన నాయకుడు కోరుకొండ సాయి కుమార్ అన్ని విధాల సహకరిస్తున్నారు. ఈ సంఘం గౌరవ అధ్యక్షునిగా కె.శాంతారాం, డి. వీరబాబు, ఎం.కళ్యాణి, లెక్చరర్ పాండ్రంకి రమేష్, ఆర్.గణేష్, బి.లక్ష్మి, పి.ఆనంద్, టి.శ్రావణి, ఎస్.నారాయణరావు, పి.రమేష్‌బాబు, జి. ఈశ్వరరావు, మేకా శ్రీకాంత్, ఎం. అచ్చుతకుమార్, ఇ. సత్యన్నారాయణ తదితరులున్నారు.

**ఫ్రండ్స్ అసోషియేషన్ :**

పొందూరులో 1999లో ఫ్రండ్స్ అసోషియేషన్ ఏర్పాటైంది. ఈ సంఘం 10 ఉచిత నేత్ర వైద్య శిబిరాలను, 6 మెగా వైద్య శిబిరాలను, 4 రక్తదాన శిబిరాలను, 4 రక్త పరీక్షా శిబిరాలను నిర్వహించింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలునాటే కార్యక్రమాన్ని చేపట్టింది. పొందూరులో 3నెలల పాటు తాగునీటి సరఫరా కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రతీ ఏటా హోమియో వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను జరుపుతోంది. గతంలో అన్ని ప్రమాదాల్లో సర్వంకోల్పోయిన వందలాది కుటుంబాల బాధితులకు ప్రజలనుంచి సేకరించిన రూ॥ 50వేల మొత్తాన్ని అందజేసి ఆదుకుంది. 2002లో ఈ సంఘానికి జిల్లాస్థాయి ఉత్తమ యువజన సంఘం అవార్డు లభించింది. 2007లో రాష్ట్ర గవర్నర్ అవార్డు దక్కించుకుంది. ఈ సంఘంలో ఎర్రా కిరణ్, ఆర్. రాజేష్, యు.వి.రమణ, కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**రాంబాబు యువజన సంఘం :**

దివంగత సంఘ సేవకుడు పైడిపాటి రాంబాబు సంస్మరణార్థం ఏర్పాటైన రాంబాబు యువజన సంఘం వివిధ సేవా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తోంది. వినాయక నవరాత్ర ఉత్సవాలను భారీఎత్తున కస్పావీధిలో నిర్వహిస్తోంది.

## భవిత పీపుల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ :

పొందూరులోని భవితా పీపుల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ 2007 ఫిబ్రవరి-14న ఏర్పాటైంది. అప్పటి జిల్లా కలెక్టర్ వి.ఎన్.విష్ణు ప్రారంభించారు. సెట్‌శ్రీ, రెడ్డీస్ ఫౌండేషన్ సౌజన్యంతో 120 మంది విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఈ సొసైటీ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించింది. వినియోగదారుల హక్కులు, సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు జరిపారు. ఈ సంఘం ద్వారా లైదాంలోని పేద వికలాంగుడికి త్రిచక్రవాహనాన్ని అందజేసారు. రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో ప్రథమ చికిత్సా శిబిరాలను ఏర్పాటు చేసారు. "భవిత షార్ప్ బ్రెయిన్" పేరుతో జిల్లా స్థాయిలో ప్రతిభ పాటవ పోటీలను ఏర్పాటుచేసారు. అవయవదానంపై హైదరాబాద్ మోహన్‌ఫౌండేషన్ సహకారంతో చైతన్య సదస్సులు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉచిత కొబ్బరిమొక్కలు పంపిణీచేసారు. ఈ సంఘం అధ్యక్షులు **బండారు ప్రతాప్ కుమార్**కు 1999, 2001 సంవత్సరాల్లో నెహ్రూ యువకేంద్ర ఉత్తమ సంఘ సేవకుని అవార్డులను ప్రదానం చేసింది.

## హంస అప్పలనాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ :

తే10-02-2004దీన హంస అప్పలనాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటైంది. అప్పటి నుంచి ఈ సంస్థ పలు సమాజ వికాస కార్యక్రమాలను చేపడుతోంది. స్థానిక పార్కురోడ్ ప్రాథమిక పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. అక్కమాంబ ఆలయం, జంగాలవీధి శివాలయం ఆవరణల్లో తాగునీటి గొట్టపుబావులను ఏర్పాటు చేసింది. శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం ఆవరణలో తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. ఇంకా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. సంస్థ అధ్యక్ష ఉపాధ్యక్షులుగా హెచ్. సూర్యకాంతం, హెచ్.ఎల్.వి.రవికిరణ్(బాబీ) వ్యవహరిస్తున్నారు.

## చేయూత స్వచ్ఛంధ సేవా సంస్థ :

2012లో పొందూరులో ఏర్పాటైన చేయూత స్వచ్ఛంధ సేవా సంస్థ అనాథలకు అండగా ఉంటూ సేవలందిస్తోంది. ఈ సంస్థలో గున్ను శ్రీనివాసరావు, జి. ఈశ్వరరావు, ఎస్. రామారావు, దుబాకుల శ్రీనివాసరావు సభ్యులుగా ఉంటూ సేవలందిస్తున్నారు.

# : సంఘసేవాకార్యకర్తలు :

## ఉత్తమ సంఘ సేవకుడు పైడిపాటి :

స్థానిక కస్పావీధికి చెందిన పైడిపాటి రాంబాబు మాస్టారు అసంఘటిత కార్మికుల కోసం 15ఏళ్ల పాటు రాత్రి పాఠశాలలను నిర్వహించి సేవలందించారు. ఈ పాఠశాలల్లో వయోజనులకు అక్షరదీపాలు వెలిగించడమే కాకుండా, సామాజిక స్పృహకలిగించే నాటికలు నేర్పించి వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేసారు. వీరిచే బూరెల మూకుడు, సూరిగాడు మారిండు, కొడుకు పుట్టాల, మంచంమీద మనిషి అనే నాటికలను ప్రదర్శింపజేసారు. 1978లో భారత యుద్ధం అనే బుర్రకథను పలుచోట్ల ప్రదర్శింపజేసారు. రాంబాబు మాస్టారు మంచి నటుడు కూడా. రుద్రవీణ నాటికలో పి.ఎ. పాత్రను సమర్ధంగా పోషించి ప్రేక్షకుల మన్ననలను పొందారు. యంగ్‌స్టార్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ క్రీడా, సాహితి, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాంబాబు మాస్టారు పాల్గొని సేవలందించారు. ఆయన జ్ఞాపకార్థం స్థానిక మార్కెట్ ఆవరణలో ఓ శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేసారు. రాంబాబు మాస్టారు 1956 జూలై, 8వ తేదీన జన్మించారు. కేవలం 33 సం॥లు మాత్రమే జీవించి 1989 డిసెంబర్ 30న కన్నుమూశారు.

## కాళ్లకూరి శాంతారాం :



1974లో పొందూరులో స్థాపించిన యంగ్‌స్టార్స్ యూత్ క్లబ్ అధ్యక్షునిగా, కార్యదర్శిగా, సంఘసేవా కార్యకర్తగా 40ఏళ్ల నుంచి ప్రజాసేవ కోసం అసంఖ్యాకంగా ఎన్నో కార్యక్రమాలను చేపట్టి ప్రగతి దారుల్లో పయనిస్తున్నారు. అక్షరక్రాంతి ఉద్యమంలో పాల్గొన్నారు. నెహ్రూ యువ కేంద్ర సలహాదారునిగా ఉంటూ వివిధ యువజన సంఘాలను ఏర్పాటుచేసి యువతకు మార్గదర్శకంగా ఉంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల నుంచి విరాళాలను సేకరించి బాధితులకు అందజేస్తున్నారు. 1964లో "చూడబోతే చుట్టాలే" హాస్య నాటికతో ఆయన నటజీవితం ప్రారంభమైంది. 1985లో రాయఘడలో నిర్వహించిన

జాతీయస్థాయి నాటికల పోటీల్లో "రుద్రవీణ" నాటికలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుని పాత్రను పోషించి ఉత్తమ అవార్డును పొందారు. 1995లో "అక్షరం శరణం గచ్ఛామి" టెలీఫిలింలో నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ నిర్మించిన "కొత్త బ్రతుకు" టెలీఫిలింలో కూడా నటించారు. కళా రూపాల్లో కూడా ప్రజల్లో చైతన్యం తెచ్చారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఎన్నో వైద్యఆరోగ్య శిబిరాల్లో పాల్గొని సేవలందించారు. ఎయిడ్స్, పల్స్‌పోలియో, నేత్రదానం తదితర ర్యాలీల్లో పాల్గొంటున్నారు. ఉగ్రవాద నిరోధక చర్యల్లో యువత పాత్ర అనే అంశంపై న్యూఢిల్లీ వెళ్లి అక్కడ జరిగిన కార్యక్రమంలో ఉపన్యసించారు. 2000 సం॥లో శ్రీకాకుళంలో నిర్వహించిన జాతీయ సమైక్యత, సంస్కృతి కార్యక్రమంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు పొందారు. జిల్లా రంగస్థల కళాకారుల సంఘ సభ్యునిగా, మండల రంగస్థల కళాకారుల సంఘ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. పొందూరులో జరిగే ప్రతీ కార్యక్రమాల్లో ఆయన వక్తగా, వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుంటారు. శాంతారాం వృత్తి రీత్యా ఉపాధ్యాయుడే అయినప్పటికి ప్రవృత్తి రీత్యా సేవా కార్యక్రమాలేనని చెప్పవచ్చు. 2013లో జరిగిన సమైక్యాంధ్ర ఉద్యమంలో గుణాత్మక పాత్రను పోషించారు.

### అనకాపల్లి అక్కలనాయుడు :



1982లో భారతీయ మజ్దూర్ సంఘ్‌లో చేరి కార్మిక సమస్యలపై పోరాడుతున్నారు. నేడు జిల్లా బి.ఎం.ఎస్. ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లా కార్మికులకు పి.ఎఫ్., జి.ఐ.ఎస్., కనీస వేతనాలకోసం కృషిచేసి సఫలీకృతులయ్యారు. 1983-84లో పొందూరు మేజర్ పంచాయితీ ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పటి సూపర్‌బజార్ డైరెక్టర్‌గా కూడా పనిచేసి సేవలందించారు. 1977 నుంచి 18ఏళ్ల పాటు యంగ్‌స్టార్స్ యూత్‌క్లబ్ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ ఎనలేని సేవలందించారు. ఎన్నో యువజన సంఘాల ఏర్పాటుకు సహకారాన్ని అందించారు. ఏటా నిర్వహిస్తున్న పైడితల్లి అమ్మవారి జాతర కార్యక్రమంలో

ముఖ్య భూమికను పోషిస్తున్నారు. ఆర్.ఎస్.ఎస్., విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను జరుపుతున్నారు. 1985 నుంచి 2012 వరకు ఎస్.జి.టి.గా పనిచేసారు. ఎ.పి.టి.ఎఫ్. నాయకులుగా కూడా వ్యవహరించి విశిష్ట సేవలందించారు. ఆయన పదవీ విరమణ చేసినపుడు పొందూరులో ఘనంగా పౌర సన్మానాన్ని జరిపారు. ఎన్.ఆర్.ఎన్.కాలనీలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్నప్పుడు పాఠశాల ఆవరణలో బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. ఈ పాఠశాల ఆయన హయాంలో అన్ని విధాల అభివృద్ధి చెందింది. ఆయన 2013లో జరిగిన సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్నారు.

## నిప్పులాంటి మనిషి "విజయ్‌కుమార్" :



యంగ్‌స్టార్స్ యూత్‌క్లబ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆచంట విజయ్ కుమార్ ఫైర్ బ్రాండ్‌గా గుర్తింపు పొందారు. అవినీతి నిర్మూలనకు శక్తివంచనలేకుండా కృషిచేసారు. ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో తనదైన శైలిలో పాల్గొన్నారు. ఎవరు తనను ఆశ్రయించినా వారికి ఏదోవిధంగా సాయంచేసే వ్యక్తిగా ప్రజల హృదయాల్లో స్థానం ఏర్పరచుకున్నారు. ఎ.పి.జి.వి.బి. మేనేజర్‌గా పనిచేసి స్వచ్ఛంద పదవీవిరమణ చేసారు. జై ఆంధ్ర ఉద్యమంలో భాగంగా పొందూరులో జరిగిన కార్యక్రమాల్లో ప్రధాన పాత్రను పోషించారు. పొందూరు పోరాట స్ఫూర్తిని దశ దిశలా వ్యాపింపజేసారు. ఈ సందర్భంగా ఆయనను పోలీసులు అరెస్టు చేసారు కూడా! విశేషమేమిటంటే 2013లో జరిగిన సమైక్యాంధ్ర ఉద్యమంలో కూడా పాల్గొని ప్రజలను చైతన్యపరిచారు.

## ఉత్తమ సేవా అవార్డు గ్రహీత



**"బండారు కృష్ణారావు"** ఆర్.ఎస్.ఎస్. స్వయం సేవక్‌గా మూడున్నర దశాబ్దాలపాటు విశిష్ట సేవలందించారు. 1977లో జనతాపార్టీలో కీలక పాత్రను పోషించారు. ఆతరువాత 1983 నుంచి బి.జె.పి.లో గ్రామ,

మండల, జిల్లా, స్థాయిలో వివిధ హోదాలను నిర్వహించడమే కాకుండా రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యునిగా రెండుసార్లు బాధ్యతలు నిర్వహించారు. మండల ఆహార సలహా సభ్యునిగా, మండల భూప్రదాన కమిటి సభ్యునిగా, సూపర్‌బజార్ డైరెక్టరుగా పొందూరు ప్రజలకు సేవలందించారు. మధ్యం, బెల్ట్ షాపులు, అవినీతికి వ్యతిరేకంగా ప్రజా ఉధ్యమాలను చేపట్టారు. వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరీలో జరిగిన అవకతవకలపై పోరాటం జరిపారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్షునిగా, గౌరవ అధ్యక్షునిగా, వాసవి క్లబ్ కార్యదర్శిగా సేవలందిచారు. పొందూరులో సరస్వతీ శిశు మందిర్ స్థాపించి, 8 ఏళ్ల పాటు నిర్వాహణకు అన్ని విధాల సహకారం అందించారు. లుట్టపేట గ్రామంలో కృష్ణారావు కుటుంబీకులు 45 సెంట్ల భూమిని పాఠశాల భవన నిర్మాణానికి ఉదారంగా అందజేశారు. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షునిగా కూడా సేవలందించారు. పొందూరులో పలు విద్యా సంస్థల అభివృద్ధిలో ఆయన పాత్ర ఉంది. యంగ్‌స్టార్స్ యూత్‌క్లబ్ అధ్యక్షునిగా వ్యవహరిస్తూ ఆయన తే26-1-2001దీన అప్పటి జిల్లా కలెక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి చేతులుమీదుగా ఉత్తమ సేవా ఆవార్డును పొందారు. వివిధ గ్రామాల్లో అగ్ని ప్రమాదాల్లో బాధితులకు ప్రజల నుంచి సేకరించిన విరాళాలను, బియ్యాన్ని అందించి తన వంతుగా సేవలందించారు. కృష్ణారావు సతీమణి నాగమణి 1995 నుంచి 2000 వరకు పొందూరు పి.ఎ.సి.ఎస్. డైరెక్టరుగా రైతులకు సేవలందించారు.

**సేవాభిలాషి గుడ్ల మోహనరావు :**



లియో, లయన్స్, యంగ్‌స్టార్స్ యూత్ క్లబ్బుల ద్వారా గుడ్ల మోహనరావు సామాజిక సేవను నిర్వహిస్తున్నారు. ప్రతీ ఏటా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7, 10, ఇంటర్‌లలో హెచ్చు మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను యంగ్‌స్టార్స్ యూత్‌క్లబ్ ద్వారా అందజేస్తున్నారు. 1995 నుంచి 2000 వరకు పొందూరు ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పి.ఎ.సి.ఎస్.) అధ్యక్షులుగా పనిచేసి రైతులకు సేవలందించారు.

## సేవా తత్పరులు డా॥ వై.మల్లిబాబు :



పొందూరు లయన్స్‌క్లబ్ ద్వారా 30ఏళ్ల నుంచి ప్రజాసేవ చేస్తున్నారు. వయస్సు మీద పడుతున్న సేవాదృక్పథాన్ని కొనసాగించడం విశేషం. పొందూరు పరిసర మండలాల్లో 4వేల మంది నేత్ర రోగులకు కేటరాక్ట్ శస్త్రచికిత్సలను చేయించారు. మొత్తం 40 నేత్ర వైద్య శిబిరాలను ఏర్పాటు చేయించారు. 200 వ్యాధినిరోధక పిల్లల వైద్య శిబిరాలను నిర్వహించారు. 3 అతిపెద్ద బహుళార్ధసాధక వైద్య శిబిరాలకు ఆధ్వర్యం వహించారు. రక్తదానం, ప్రజారోగ్యం, కుష్ఠువ్యాధి, పిల్లల ఆరోగ్యం, కేన్సర్, పచ్చకామెర్లు, కుటుంబ సంక్షేమం, గుండెజబ్బుల నివారణ, ఎయిడ్స్, మధుమేహం, వినికిడి సమస్యలు, జాతీయ విపత్తుల నివారణ అంశాలపై పుస్తకాలను రాసి ఉచితంగా పంపిణీచేసారు. వీటితో పాటు తల్లిపాల ఆవశ్యకత, క్షయ లక్షణాలు, దంతపరిరక్షణ, పిల్లలలో వచ్చే వ్యాధులు నివారణ, ఆరోగ్య సూత్రాలు, దోమల వ్యాప్తిని అరికట్టేదెలా?, అధిక రక్తపోటు నివారణ, మధుమేహ నివారణ అంశాలపై కరపత్రాలను అందించారు. ఈయన 29ఏళ్ల పాటు వైద్యఆరోగ్యశాఖలో వైద్యాధికారిగా పనిచేసారు. పొగిరిలో వైద్యాధికారిగా పనిచేసినపుడు తే26-01-1999దీన జిల్లాకలెక్టరు నుంచి ఉత్తమ అవార్డును పొందారు. పొగిరి కుష్ఠు నివారణ కేంద్రంలో పనిచేసినపుడు 4ఏళ్లపాటు వరుసగా జిల్లాపాలనా యంత్రాంగం నుంచి ఉత్తమ అవార్డులు పొందారు. ప్రస్తుతం ఆయన లయన్స్ జిల్లా ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు. మానవ సేవలు, మధుమేహ అవగాహన, వినికిడి సంరక్షణ, జాతీయ విపత్తుల నివారణ అంశాలపై 4సార్లు లయన్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు (యు.ఎస్) నుంచి ఉత్తమ అవార్డులు పొందారు. లయన్స్ జిల్లాస్థాయిలో 15సార్లు అవార్డులు పొందారు.

**నాలుగు ఎంగిలిమెతుకులు కనబడితే కాకితాను మాత్రమే తినకుండా "కాకా" అని పది కాకులను పిలిచి తింటుంది, అలాగే చీమలు కూడా...**

అయితే మానవుల్లో ఈ ప్రవృత్తి కనిపించదు.

## ప్రతిభాశాలి టేకి రామకృష్ణ :



స్థానిక ఆసుపత్రివీధికి చెందిన టేకి రామకృష్ణ వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఆయన ప్రవృత్తి విజ్ఞానవినోదాలను పంచడమే. గత 15ఏళ్ల నుంచి అనేక రచనలు చేస్తూ రాష్ట్రంలో ఓ ప్రత్యేక గుర్తింపు పొందారు. వివిధ దిన, వార, పక్ష, మాస పత్రికల్లో ఈ యన రాసిన కవితలు, చలోక్తులు, ఫ జిల్స్, జోక్స్, సినీ రాజకీయ వ్యంగ్యాస్త్రాలు ప్రచురితమయ్యాయి. సృజనాత్మక రంగంలో ఆయనదో ప్రత్యేక శైలి. పోస్టు కార్డుకు ఒకవైపు ఏకంగా 12,363 అక్షరాలతో 4121సార్లు శ్రీరామ అనే పదాన్ని వ్రాయడమే కాకుండా, మరోసారి పోస్టు కార్డుకు ఒకవైపు ఏకంగా 103 వేమన పద్యాలు రాసి అందరిని ఆశ్చర్యపరిచారు.

రాజీవ్ విద్యామిషన్ వారి బాలల విద్యావిషయక మాసపత్రిక, " సిక్కోలు సవ్వడిలో " సంపాదక సభ్యునిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఈయన ఆణిముత్యాల్లాంటి చేతిరాతతో " సిక్కోలు సవ్వడి " విడుదలై జిల్లా కలెక్టర్ సౌరభ్‌గౌర్ చేతులుమీదుగా విడుదలై ప్రశంసలు పొందారు. వృత్తికి ప్రవృత్తికి న్యాయంచేస్తూ ముందుకు సాగుతున్నారు.

## : ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వీరే :

స్థానిక 2వ నెంబర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన వాండ్రంగి కృష్ణదాస్, స్థానిక 1వ నెంబర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన పమ్మిన కూర్మారావు, ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్‌గా (లోలుగు) పనిచేస్తున్న వై.గోపాలరావు లకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించగా ప్రస్తుతం స్థానిక పొందూరు 4వ నెంబర్ ప్రాథమిక పాఠశాలలో ఎల్.ఎఫ్.ఎల్ ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న మెండ తవుడుకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఒక్కొక్కరి గూర్చి సంక్షిప్తంగా...

## వాండ్రంగి కృష్ణదాస్ :



1996లో అప్పటి రాష్ట్రపతి డా॥ శంకర్‌దయాల్ శర్మ చేతులు మీదుగా కృష్ణదాస్ మాస్టారు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. తనకు లభించిన రూ॥ 10వేల మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసి దానిపై వస్తున్న వార్షిక వడ్డీతో ప్రతీఏటా అక్టోబర్ 2న తాను గతంలో పనిచేసిన 2వ నెంబరు ప్రాధమిక పాఠశాలలోని పేద విద్యార్థులకు తన తల్లిదండ్రులు దివంగత రాధాకాంతమ్మ-చినగురుమూర్తిల సంస్మరణార్థం దుస్తులను కొని ఉదారంగా అందజేస్తున్నారు. ఈ పాఠశాలలో ఆయన 35ఏళ్ల పాటు పనిచేసారు. మధ్యలో ఫరీద్‌పేట, రాజాం పాఠశాలల్లో పనిచేసారు. పొందూరు 2వ నెంబరు ప్రాధమిక పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి ఎనలేని సేవలందించారు. పాఠశాలకు ప్రహరీగోడ, తాగునీటి సౌకర్యం, అదనపు వసతి, విద్యుత్‌తో పాటు విద్యార్థులకు శౌచాలయ సౌకర్యాల ఏర్పాటుకు కృషిచేసి సఫలీకృతులయ్యారు. ఆయన సేవలకు గుర్తింపుగా పలు స్వచ్ఛంద సంస్థలు ఆయనను ఘనంగా సన్మానించాయి. తే05-09-1993దీన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై అప్పటి విద్యామంత్రి పి.వి.రంగారావు చేతులుమీదుగా అవార్డును పొందారు. తే 05-09-1979న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై అప్పటి రాష్ట్ర మంత్రి గొర్లె శ్రీరాములనాయుడు చేతులు మీదుగా అవార్డును పొందారు. శ్రీకాకుళం-పొందూరు సత్యసాయి సేవా సమితులు, యంగ్‌స్టార్స్, లయన్స్‌క్లబ్, స్ఫూర్తి ఆధ్వర్యంలో ఆయనకు ఘన సత్కారం జరిగింది. గతంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధాశక్తులు ప్రదర్శించిన నేపథ్యంలో అప్పటి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ (డి.పి.ఐ.) ఎల్.బుల్లయ్య అయనకు యోగ్యతా పత్రాన్ని ప్రదానం చేసారు. ఇప్పటికి ఆ పాఠశాలను దాసు మాస్టారి స్కూలుగా ప్రజలు పిలుస్తుంటారు. ఆయన ఇప్పటికి పూర్వ విద్యార్థులను ఎక్కడ కనబడిన పేరుపెట్టి మరీ పిలుస్తారు.

**పమ్మిన కూర్మారావు :**



1988లో పమ్మిన కూర్మారావు మాస్టారు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుం అవార్డును అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్‌శర్మ చేతులుమీదుగా అందుకున్నారు. 1987లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అప్పటి సి.ఎం. ఎన్.టి.రామారావు చేతులుమీదుగా అందుకున్నారు. 1988 ఆగస్టు 15న మాస్టారిని అప్పటి జిల్లాకలెక్టర్ మిశ్రా సన్మానించారు. 1997లో జన్మభూమి అవార్డును పొందారు. బాణాం, అల్లినగరం, పొందూరు-1వ నెంబరు ప్రాథమిక పాఠశాల తదితర చోట్ల ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి విద్యా ప్రగతికి కృషిచేసారు. నవోదయ, గురుకుల విద్యాలయాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులకు తర్ఫీదునిచ్చారు. ఫలితంగా ఎందరో విద్యార్థులు ఆ విద్యాలయాల్లో సీట్లు పొందారు. జాతీయ అవార్డు కింద తనకు లభించిన మొత్తాన్ని స్థానిక 1వ నెంబరు ప్రాథమిక పాఠశాల అభివృద్ధికే వినియోగించారు. మాస్టారు 2సార్లు విశాఖ ఆకాశవాణి కేంద్రం నుండి ప్రసంగించారు. పలుచోట్ల ఆయా సంఘాలచే పురస్కారాలను పొందారు. తాను పనిచేసిన 1వ నెంబరు ప్రాథమిక పాఠశాలకు అదనపు వసతులను కల్పించడంలో కీలక పాత్ర వహించారు. స్థానిక గ్రంథాలయాల, విశ్రాంత ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాలకు బహుమతులను తనవంతుగా అందజేస్తూ సహకరిస్తున్నారు.

**వై. గోపాలరావు :**



ఈయన 2008లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతులుమీదుగా జాతీయ అవార్డును పొందారు. 2007 అక్టోబర్ 5న రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సి.ఎం. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతులు మీదుగా అందుకున్నారు. ఇదే ఏడాది సెప్టెంబరు 5 జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ వి.ఎన్.విష్ణు చేతులుమీదుగా అందుకున్నారు. 2001లో జనాభా గణనలో జాతీయ అవార్డును

పొందారు. పాతకుంకాం, కొత్తకుంకాం, సీతారాంపురం, పొందూరు-2, మండాకురిటి, మర్రివలస, తండ్యాం, ఎస్.ఆర్.ఎన్.కాలనీ పాఠశాలల్లో పనిచేసారు. ఉత్తమ సేవలందించినందుకు గురుదేవోభవ, గురుబ్రహ్మ, ఆణిముత్యం అవార్డులను పొందారు. రాష్ట్ర, జిల్లాస్థాయి అవార్డులను దక్కించుకున్నారు. విద్యార్థులను చైతన్య పరిచేందుకు పలుకార్యక్రమాలను నిర్వహించారు. ఆయన పనిచేసిన అన్ని పాఠశాలల్లో గురుకుల, నవోదయ పాఠశాలల్లో ప్రవేశ పరీక్షలకు గాను విద్యార్థులను తయారుచేయించి వారి ఉత్తీర్ణతకు ప్రత్యేక కృషి చేసారు. ఈయన ప్రస్తుతం లోలుగు జెడ్.పి. ఉన్నత పాఠశాలలో సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఎ.పి.టి.ఎఫ్. నాయుకునిగా ఉపాధ్యాయ ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. యంగ్‌స్టార్స్ యూత్ క్లబ్ సభ్యులుగా ఉన్నారు.

**మెండ తవుడు :**



2013 సెప్టెంబరు 5న గురుపూజోత్సవం సందర్భంగా మెండ తవుడు మాస్టారికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. రాష్ట్ర విద్యాశాఖామంత్రి కె.పార్ధసారధి చేతులు మీదుగా ఈ-పురస్కారాన్ని అందుకున్నారు. గొప్ప దాతగా గుర్తింపు పొందారు. పేద విద్యార్థులకు, అర్హులైన వారికి ఆర్ధిక సాయాన్ని అందజేసి సామాజిక బాధ్యతను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ దేవాలయాల అభివృద్ధికి పేద విద్యార్థుల చదువుకు అలాగే ప్రకృతి వైపరీత్యాలవల్ల నిరాశ్రయులైన వారికి ఆర్థిక సాయాన్ని అందజేసారు. తనకు అవార్డు రూపంగా వచ్చిన నగదు పారితోషికాన్ని తాను పనిచేస్తున్న పొందూరు 4వ నెంబరు ప్రాధమిక పాఠశాల అభివృద్ధికే వినియోగించడం విశేషం. ఇదే ఏడాది అక్టోబర్ 2న విశాఖ మదర్ థెరీసా సోషల్ ఆర్గనైజేషన్ ఆయనకు ఆణిముత్యం, గురుబ్రహ్మ, జీవిత సాఫల్య అవార్డులను ప్రధానం చేసింది. అలాగే ప్రియదర్శిని సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (హైదరాబాద్) సంస్థ మాస్టారికి సేవారత్న జాతీయ అవార్డుతో సత్కరించింది.

1997లో జన్మభూమి జిల్లా అవార్డును పొందారు. 2012లో లయన్స్ క్లబ్ అవార్డును పొందారు. 1997లో రణస్థలం మండలంలో పనిచేసినప్పుడు జన్మభూమి కార్యక్రమంలో జిల్లా స్థాయి అవారు పొందారు. ఆయన విద్యాప్ర"దాత"గా ప్రశంసలు పొందారు. మాస్టారి స్వగ్రామం బురిడికంచరాం. నరసాపురం, సీతంవలస, మచ్చిలేశం, సింగూరు తదితర పాఠశాలల్లో గతంలో పనిచేసారు. ఆయన ఎం.ఎ.,ఎం.ఇడి. పట్టభద్రులు.

## :రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం:



స్థానిక ఆప్కో కార్యాలయం మేడపై రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయం(పొందూరు శాఖ) తే12-09-2010దీన ఏర్పాటైంది. ఈ సంఘంలో మొత్తం 261మంది సభ్యులున్నారు. ఈ సంఘం సభ్యులకు నిరంతర సేవలను అందిస్తోంది. విశ్రాంత ఉద్యోగులకు గుర్తింపు కార్డులను ఉపఖజానా శాఖ ద్వారా అందించింది. పాన్ కార్డులను మంజూరు చేయించేందుకు సహకరిస్తోంది. ఆరోగ్య కార్డులకు సంబంధించి సంఘం ద్వారా ఇప్పించడంలో తగు సాయం అందిస్తోంది. ప్రతీ ఏటా గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటపాటల పోటీలు, క్విజ్ గణిత, వ్యాసరచన పోటీలను నిర్వహిస్తోంది. విజేతలకు బహుమతులను అందజేస్తోంది. తే26-01-2011దీన స్థానిక మండల వనరుల కేంద్రంలో వైద్య శిబిరాన్ని అలాగే తే27-11-2011దీన స్థానిక 2వ నెంబరు ప్రాథమిక పాఠశాలలో ఉబ్బస వ్యాది నివారణ శిబిరాన్ని నిర్వహించింది. విశ్రాంత ఉద్యోగులకు ప్రతీ ఏటా నడక పోటీలను జరుపుతోంది. విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం డిసెంబర్ 17న నిర్వహిస్తూ అందులో బాగా వయోవృద్ధులైన వారికి సన్మానాలను నిర్వహిస్తోంది. సంఘ అధ్యక్షులుగా: దండా సూరిబాబు, సహాయ అధ్యక్షునిగా : నాళం పైడిరాజు, ప్రధాన కార్యదర్శిగా : వి.వి.గోవిందరావు, కోశాధికారిగా వి.దామోదరరావు, ఉపాధ్యక్షులుగా పి.జగన్నాధం, బి.జె.నాయుడు, సి.హెచ్.శ్రీరాములు, కార్యదర్శులుగా :వి.మనోరమ, పి.కూర్మారావు, పి.అప్పారావుతో పాటు మరో

7గురు కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. సంఘ కార్యాలయ భవనానికి అవసరమైన స్థలాన్ని సమకూర్చేందుకు సర్పంచ్ కె.జయలక్ష్మి ప్రయత్నించగలమని హామీనిచ్చారు.

## కేంద్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం :

1997లో ఈ సంఘం పొందూరు శాఖ ఏర్పాటైంది. మొత్తం 70మంది సభ్యులున్నారు. అధ్యక్షునిగా పిట్టా రామక్రిష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా డబ్బీరు దుర్గాప్రసాద్ వ్యవహరిస్తున్నారు. ఫించను దారుల సంక్షేమానికి ఈ సంఘం పాటుపడుతోంది.

## రాష్ట్ర ఎన్.జి.జి.ఒ. సంఘం :

రాష్ట్ర ప్రభుత్వ ఎన్.జి.జి.ఒ. సంఘం, పొందూరు శాఖ ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి చేదోడు వాదోడుగా నిలుస్తోంది. ఈ సంఘ అధ్యక్షులుగా బి. ఈశ్వరరావు, కార్యదర్శిగా కూన నర్సింహమూర్తి, గౌరవ సలహాదారుగా బలివాడ గోవిందరావు వ్యవహరిస్తున్నారు.

## ఉద్యమాల్లో ముందంజలో ఉన్న ఉపాధ్యాయ సంఘాలు :

విద్యారంగ, సామాజిక సమస్యలను పరిష్కరించడంలో ఉపాధ్యాయ సంఘాలు కీలక భూమికను పోషిస్తున్నాయి. " హక్కుల కోసం కలబడు, విధుల కోసం నిలబడు" అనే నినాదంతో ఈ సంఘాలు ముందుకు దూసుకుపోతున్నాయి. ఈ సంఘాల కార్యవర్గాల వివరాలు ఇలా ఉన్నాయి. యూ.టి.ఎఫ్.:-మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ శాఖలో అన్నెపు లక్ష్మణరావు, వావిలపల్లి రాజారావు తదితరులు చురుకైన పాత్ర నిర్వహిస్తున్నారు. మండల ఎ.పి.టి.ఎఫ్.(మార్పు) శాఖలో కూన వాసు, అల్లంశెట్టి రవి, మొగదాల రమణారావు, సన్నశెట్టి రాజశేఖర్‌లు గుణాత్మక పాత్రను పోషిస్తున్నారు. ఎ.పి.టి.ఎఫ్ (ఎస్) : మండల ఎ.పి.టి.ఎఫ్(ఎస్)లో కోరుకొండ విజయకుమార్, దుంపల శ్రీనివాసరావు పేడాడ లక్ష్మణరావు, మెండ తవుడు తదితరులు కీలక భూమికను నిర్వహిస్తున్నారు. డి.టి.ఎఫ్ : మండల డి.టి.ఎఫ్ శాఖలో బలివాడ వెంకటేశ్వర్లు, గురుగుబెల్లి రాజశేఖర్, గురుగుబెల్లి భాస్కరరావు, జి.గోపాలరావు తదితరులున్నారు. పి.ఆర్.టి.యు. మండల శాఖకు ఎం.శివరామ క్రిష్ణ సారధ్యం వహిస్తున్నారు.

## వైద్య వృత్తిలో...

పొందూరులో తొలి తరంలో వైద్య వృత్తి చేపట్టి మన్ననలు పొందిన వారిలో డా॥ అయ్యగారి క్రిష్ణారావు(పంతులు డాక్టర్), డా॥ జోగుల రాజు ప్రసిద్ధులు. నేటి తరంలో డా॥ వై మల్లిబాబు, డా॥ డి.వి.ఎస్.ప్రకాశరావు, డా॥ ఎం.వి.నాగేశ్వరరావు, డా॥ మందుల మోహనరావు, డా॥ గుంటుకు నర్సింగరావు, డా॥ సనపల తిరుపతిరావు, డా॥ ఎం.విజయశంకర్, డా॥ గుంటుకు ఉమాదేవి, డా॥ ఎం.సునీల్ కుమార్, డా॥ సువ్వారి విజయ భాస్కర రావు, డా॥ మాడుగుల పాపారావు వైద్య వృత్తిని కొనసాగిస్తున్నారు.

## న్యాయవాద వృత్తిలో...

తొలితరంలో అయ్యగారి రామ్మోహనరావు, న్యాయవాద వృత్తిని చేపట్టారు. ఆతరువాత ఆచంటి జగన్నాధరావు బి.ఎల్. పూర్తి చేసినప్పటికి ఉపాధ్యాయ వృత్తిలోనే స్థిరపడ్డారు. ప్రస్తుత తరంలో జి.ఎల్.ఎన్.గుప్త, ఎ.రంగారావు, కె.భాస్కరరావు, న్యాయవాదులుగా ఉన్నారు. కాగా కె.రమణమూర్తి (దవళపేట), బి.ఎల్.నాయుడు(గోరింట) గ్రామాలకు చెందినప్పటికి పొందూరులో స్థిరపడి ఈ వృత్తిని కొనసాగిస్తున్నారు.

## ఉన్నత ఉద్యోగాల్లో...

### ఎస్.బి.ఐ.జనరల్ మేనేజర్‌గా మధు :



స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి వాండ్రంగి మధుసూదనరావు ఇంతింతై వటుడింతై అన్నట్టు ప్రస్తుతం భారతీయ స్టేట్‌బ్యాంక్ ముంబయి కార్పోరేట్ సెంటర్ జనరల్ మేనేజర్ (న్యూ బిజినెస్) గా పనిచేస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ రజితోత్సవ కళాశాలలో బి.ఎస్.సి. చదివారు. గణితంలో 300 మార్కులకు 300 పొంది రికార్డు సృష్టించారు. ఆంధ్రవిశ్వ విద్యాలయంలో ఎం.ఎస్.సి (ఫిజిక్స్) చదివారు. 1977లో

ఎ.పి.జి.వి.బి. బి.ఎం.గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1980లో ఎస్.బి.ఐ. పి.ఓ.గా ఎంపికై విజయవాడ గవర్నర్‌పేట శాఖలో బ్రాంచి మేనేజర్‌గా పనిచేసారు. ఆ తరువాత సికింద్రాబాద్‌లో ఏ.జి.ఎం., ఆపిమ్మట ముంబాయి, భువనేశ్వర్‌లలో డి.జి.ఎం.గా పనిచేసారు. అనంతరం మధ్యప్రదేశ్ రాష్ట్ర ఎస్.బి.ఐ. సర్కిల్ జి.ఎం.గా వ్యవహరించారు. 1988-91 మధ్య ఎస్.బి.ఐ. పక్షాన న్యూయార్క్‌లో విదేశీ మారక మార్పిడి విభాగంలో డీలర్‌గా పనిచేసారు. శ్రీలంక, కౌలాలంపూర్, టర్కీ, లండన్‌లలో బ్యాంకింగ్ రంగంలో శిక్షణ పొందారు. "మాన్యువల్ ఫర్ అడ్వాన్సెస్" అనే పుస్తకాన్ని రచించారు. పదవీవిరమణ చేసినతరువాత ఉత్తరాంధ్రలో విద్యార్ధులకు పోటీపరీక్షలకు తర్ఫీదునిచ్చేందుకు ఓ సంస్థను ఏర్పాటు చేయునున్నట్టు ఆయన చెప్పారు. తన తల్లి దండ్రులు ఇందిరాదేవి, తిరుపతిరావుల ఆశీస్సులతో... ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు.

## సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ – కోరుకొండ రమేష్ :



సేవా భావం, ఆదుకునే మనస్తత్వం కోరుకొండ రమేష్ సహజగుణం. ప్రస్తుతం విశాఖలో సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ (టాస్క్‌ఫోర్స్)గా పనిచేస్తున్నారు. 1986లో హైదరాబాద్‌లో ఎ.ఇ.గా ఉ ద్యోగప్రస్థానాన్ని ప్రారంభించారు. వరంగల్ ఆర్.ఇ.సి.లో బి.టెక్ చదివిన, తరువాత హైదరాబాద్ జె.ఎన్.టి.యు.లో ఎం.టెక్ (ఎన్విరాన్మెంటల్) పూర్తిచేసారు. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు పొందూరులోనే చదివారు. వరంగల్‌లో బి.టెక్. చదువుతున్నప్పుడు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన బాల్‌బ్యాట్‌మెంటన్, వాలీబాల్ విభాగాల్లో రజిత, కాంస్య, స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. ఇప్పటకీ క్రీడాభిరామాన్ని కొనసాగిస్తున్నారు. అంధ విద్యార్థులైన వెయిట్‌లిఫ్టర్లు పరపటి రమేష్, పరపటి అప్పన్న, అకురు తారకేశ్వరరావులను అక్కున చేర్చుకొని వారి భవితకు బాటలు వేసారు. విశేషమేమిటంటే రమేష్ అర్హులైన సుమారు 40 మంది నిరుద్యోగులకు

ఉపాధి కల్పించి వారి జీవనరేఖలను మార్చారు. తల్లిదండ్రులు కృష్ణవేణి, రమణారావు, గురువుల ఆశీస్సులతో ఉన్నత స్థానానికి ఎదిగే అవకాశం తనకు కలిగిందని కృతజ్ఞతాపూర్వకంగా తెలియజేసారు.

**శాస్త్రవేత్త - గుంటుకు క్రిష్ణారావు :**



పొందూరుకు చెందిన గుంటుకు క్రిష్ణారావు హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.), ఆర్.సి.ఐ. విభాగంలో శాస్త్రవేత్తగా మంచి పేరు తెచ్చుకున్నారు. వివిధ యంత్రాల పరిశీలనకై రష్యా, యు.ఎస్. దేశాలను పర్యటించారు. 1984-85లో శాస్త్రజ్ఞునిగా ఉద్యోగంలో చేరారు. అప్పటిలో డి.ఆర్.డి.ఒ. జాతీయ అధిపతిగా ఉన్న డా॥ ఎ.పి.జె.అబ్దుల్‌కలామ్ ప్రశంసలను పొందారు. ప్రస్తుతం మన దేశం పక్షాన ఇజ్రయిల్‌లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. విద్యార్థిగా కూడా మంచి రికార్డు ఉంది. స్థానిక 1 నెం. పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తిచేసారు. 6,7 తరగతులను స్థానిక ఉన్న పాఠశాలలో చదివారు. తాడికొండ(గుంటూరు జిల్లా) ఎ.పి. గురుకుల పాఠశాలలో 8,9,10 తరగతులు చదివారు.

ఇంటర్ విద్యను నాగార్జున సాగర్ (ఎ.పి.ఆర్.జె.సి.)లో పూర్తి చేసారు. బి.టెక్. విద్యను వరంగల్ ఆర్.ఇ.సిలో, ఎం.టెక్. విద్యను చెన్నై ఐ.ఐ.టి.లో విజయవంతంగా పూర్తిచేసారు.

**ఎల్.ఐ.సి.లో అగ్రగామిగా... కె.ఎస్.గిరిధర్ :**



స్థానిక కొండవీధికి చెందిన కె.ఎస్.గిరిధర్ జీవిత బీమా సంస్థ(ఎల్.ఐ.సి.) ముంబయి కేంద్రీయ కార్యాలయంలో పి.జి.ఎస్. విభాగంలో కార్యదర్శిగా, సీనియర్ డివిజినల్ మేనేజర్ కేడర్‌లో పనిచేస్తున్నారు. ఈయన దేశవ్యాప్తంగా ఆయారాష్ట్రాలలో ఏర్పాటుచేసిన వివిధ సెమినార్లలో పాల్గొని పత్రాలను సమర్పించారు. పుణేలోని జాతీయ జీవిత భీమా

అకాడమీలో, అలాగే ముంబయిలోని మేనేజనమెంటని సెంటరనలో అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణను కూడా అందజేస్తున్నారు. అఖిల భారత స్థాయిలో ఉన్నత ఉ ద్యోగంలో ఉన్న గిరిధర్ పొందూరు 2వ నెంబరు ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్య, ఉన్నత పాఠశాలలో 6,7 తరగతులు చదివారు. ఆతరువాత తాడికొండ గురుకుల పాఠశాలలో 10వ తరగతి వరకు చదివారు. స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసారు. ఆతరువాత విశాఖ గీతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్. చదివారు. గోఖక్ (కర్నాటక) ఎల్.ఐ.సి. శాఖలో ఎ.ఎ.ఒ.గా 1990లో చేరారు. ఏలూరు, హైదరాబాద్, విశాఖపట్నం లో కొంతకాలం పనిచేసారు. తల్లి దండ్రులు అనసూయ దేవి, కె.ఎల్.వి. ప్రసాదరావుల ప్రోత్సాహంతో ఉన్నత స్థానంలోకి చేరుకున్నట్టు గిరిధర్ పేర్కొన్నారు.

## ఆదర్శాలు – ఆంతర్యాలు

**ఎ.వి. రాజా**
మాజీ అధ్యక్షులు : లయన్స్ క్లబ్-పొందూరు.
సంచార వాణి : 9849876246



రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గాంధీజీ తన సత్యాగ్రహ ఆయుధంతో పారద్రోలి యావత్ ప్రపంచంలో సత్యాగ్రహ ఉద్యమమంటే ఏమిటో తెలియజేసారు. హింసా రహిత సమాజం ఆయన స్వప్నం. ఆయన ఆదర్శాలు మానవాళికి శిరోధార్యాలు. కలియుగంలో మహాత్ముడు అని పిలువబడ్డ ఏకైక వ్యక్తి బాపూజీయే. గ్రామ స్వరాజ్యం కోసం గాంధీజీ ఖాదీ పరిశ్రమనెంతో ప్రోత్సహించారు. దేశం మొత్తం మీద 1500 ఖాదీ సంస్థలు ఉన్నప్పటికి పొందూరు ఖాదీ చుక్కల్లో చంద్రునిలా వర్ధిల్లుతోంది. స్వరాజ్య సాధనలో ఖాదీ కీలక పాత్ర పోషించింది. ఇక క్విట్ ఇండియా ఉ ద్యమంలో భాగంగా గాంధీజీ దక్షిణ భారతదేశ పర్యటనలో తెనాలి వచ్చినపుడు అక్కడి పినపాడు రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద జరిగిన సభకు మా నాన్నగారు నన్ను తీసుకొని వెళ్ళి సభాస్థలికి కేవలం 50 గజాల దూరంలో కూర్చొని గాంధీజీని

చూపించారు. ఇది నా జీవితంలో మరపురాని సంఘటన. గాంధీజీ ఆదర్శాలు ఎంతో ఉత్తమమైనప్పటికి ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల జాతి కొంత నష్టపోయింది. తే30-01-1948దీన గాంధీజీపై దాడి జరిగే అవకాశముందని నిఘావర్గాల ద్వారా సమాచారం తెలుసుకున్న నాటి భారత ప్రధాని నెహ్రూ తన అంగ రక్షకుడైన అర్జున్ దాస్‌ను గాంధీజీ రక్షణకోసం బిర్లా మందిర్‌కు పంపారు. అయితే తనకు భద్రతతో పనిలేదని ఆయుధాలతో పొందే ఆత్మస్థైర్యం కన్నా ఆయుధరహితమైన ఆత్మవిశ్వాసమే బలమైందని గాంధీజీ ఆ అంగరక్షకున్ని అక్కడనుంచి పంపేశారు. ఫలితంగా అదేరోజు సాయంత్రం భారత దేశం ఓ మహా మనీషిని (గాంధీజీ) కోల్పోయింది.

అదే పొరపాటును ఇందిరా గాంధీకూడా చేసింది. 1984 మే నెలలో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో దాగియున్న ఖలిస్తాన్ తీవ్రవాదులను పారదోలేందుకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ " ఆపరేషన్ బ్లూస్టార్ " అనే సైనిక చర్యకు ప్రతీకారం తీసుకునే అవకాశం ఉందని నిఘా వర్గాలు వెల్లడించినప్పటికి ఇందిరాగాంధీ పెడచెవిన పెట్టారు. ఇది సామ్యవాద సమాజమని అటువంటిదేమీ జరగదని త్రోసిపుచ్చారు. ఫలితంగా 1984 అక్టోబర్ 31న తాను నమ్మిన అంగరక్షకులు బియాత్‌సింగ్, సత్యాసింగ్‌ల తుపాకీ గుళ్లకు అమె బలిఅయ్యారు. భారతదేశం ఓ గొప్ప మహిళా నాయకురాలిని కోల్పోయింది. గాంధీజీ ఇందిరాగాంధీ తీసుకున్న తొందరపాటు నిర్ణయాలవల్ల వారి కుటుంబాలే కాదు యావత్ జాతి మహా నాయకులను పోగొట్టుకోవడం దురదృష్టకరం.

అప్రస్తుతమైనప్పటికీ మరో విషయాన్ని మీ ముందుంచుతున్నాను. నటసమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు స్వీయ రచన " ఆ...ఆ..." లులో ఒక దగ్గర మనిషి ఏవిధంగా దానాలు చేయాలో నాటి సినీనటుడు చిత్తూరు పి. నాగయ్య గారి నుంచి నేర్చుకోవాలి. అయితే ఎలా దానం చేయకూడదో వారి నుంచే నేర్చుకోవాలి. ఎందుకంటే దానాలు చేయడం మంచిదే కాని, దానాలు చేసి ఉన్నదంతా పోగొట్టుకొని తాను దానాలు స్వీకరించే స్థితికి రాకూడదని పేర్కొన్నారు. ఏమైనప్పటికి మనం నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఒకటికి 10సార్లు ఆలోచించాల్సిన అవసరం ఉంది. తొందరపడి నిర్ణయాలు తీసుకుంటే మన కనురెప్పలే కాటేసే పరిస్థితి ఎదురుకావచ్చు. (శ్రీ ఎ.వి.రాజా తే15-12-2013దీన ఈ విశాల ప్రపంచాన్ని వీడి వెళ్లారు.)

# పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ

## అధ్యక్షులుగా పనిచేసిన నాయకులు

పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటి 1971సం॥లో ఏర్పాటైంది. ఈ కమిటీ పాలకవర్గ తొలి అధ్యక్షులుగా(1972-73) పాలిశెట్టి రామామావు ఆతరువాత కూడా 2వ సారి ఆయన అధ్యక్షులుగా ఉన్నారు. తదనంతరం కమిటీ అధ్యక్షులుగా నాగిరెడ్డి రామ్మూర్తి, గొర్లె సన్యాసప్పలనాయుడు, జీరు రామారావు, కలిశెట్టి అప్పలనాయుడు, కూన మంగమ్మ పనిచేసారు. పాలిశెట్టి రామారావు సుమారు 10ఏళ్ళపాటు మార్కెట్ కమిటీ అధ్యక్షునిగా వ్యవహరించారు. మార్కెట్ కమిటీ ఏర్పాటుకు ప్రాణం పోసింది ఆయనే. 27.17 ఎకరాల స్థలాన్ని ఇందుకోసం ప్రభుత్వ పక్షంగా సేకరించారు. ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద మార్కెట్‌యార్డు ఇది. ఆయన హయాంలో మార్కెట్ కమిటీలో ఎందరికో ఉద్యోగాలు వచ్చాయి. ఆతరువాత అధికారంలోకి వచ్చిన నాగిరెడ్డి రామ్మూర్తి (జగన్నాధవలస) మార్కెట్‌యార్డులో పశువుల సంతను ఏర్పాటుచేయించినప్పటికి అది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. 3వారాలకే ఆ సంత ముగిసింది. ఆ పిమ్మట గొర్లె సన్యాసప్పలనాయడు (కోటపాలేం) ఛైర్మన్ కుర్చీని కైవసం చేసుకున్నారు. రైతుల సంక్షేమానికి ఎంతో పాటుపడ్డారు. ఆతరువాత జీరు రామారావు (కె.కూర్మినాయుడుపేట) అధికారంలోకి వచ్చారు. రైతులతో సత్సంబంధాలు ఏర్పాటుచేసుకొని మార్కెట్ కమిటీ అంటే ఏమిటో రైతులకు తెలియజెప్పారు. కలిశెట్టి అప్పలనాయుడు (వి.ఎన్.పురం, జె.ఆర్.పురం) మార్కెట్ కమిటీని అన్ని విధాల అభివృద్ధి చేసారు. సిబ్బందితో మంచి సంబంధాలుండేవి. రైతు మిత్ర పథకంలో భాగంగా మార్కెట్ కమిటీ పరిధిలోని

ప్రధాన గ్రామాలలో నేరుగా రైతు ఇంటికే విత్తనాలను పంపిణీ చేయించే సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. అప్పటి సి.ఎం. చంద్రబాబునాయుడు కలిశెట్టి ప్రయోగశీలతను అభినందించారు.

**ప్రతీ మనిషి చెప్పేదాన్ని విను, కాని కొద్ది మందికే జవాబు ఇవ్వు...**
**- షేక్‌స్పియర్**



## కూన మంగమ్మ (2005-09)

ఆతరువాత సింహాసనం అధిష్టించిన కూన మంగమ్మ (2005-08) హయాంలో యార్డు ఆవరణలో అగ్నిమాపక కేంద్రానికి వసతిని కల్పించిన ఘనత ఆమెకే దక్కుతుంది. రైతు బంధు పథకాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయించారు.

## : కుక్కలు చించిన విస్తరిగా నేడు మార్కెట్ కమిటీ :

తొలుత మార్కెట్ కమిటీ పరిధిలో పొందూరు, జి.సిగడాం, ఎచ్చెర్ల, రణస్థలం లావేరు మండలాలుండేవి. అయితే దురదృష్టవశాత్తు 2012 సెప్టెంబర్ నుంచి ఈ మార్కెట్ కమిటీ కేవలం పొందూరు మండలానికే పరిమితమైంది. మిగిలిన 4 మండలాలు కొత్తగా ఏర్పాటైన ఎచ్చెర్ల నియోజకవర్గ మార్కెట్ కమిటీలో విలీనమయ్యాయి. దీంతో పొందూరు మార్కెట్ కమిటీ పరిస్థితి చూస్తే ఒకింత ఆవేదన, ఆందోళన కలిగిస్తోంది.

## మండల పి.ఎ.సి.ఎస్ కార్యవర్గం (2013) :

పొందూరు మండల పి.ఎ.సి.ఎస్. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కూన వెంకట సత్యన్నారాయణ, కొంచాడ అప్పలనాయుడు వ్యవహరిస్తున్నారు. డైరెక్టర్లుగా మొఖర సత్యన్నారాయణ, ఎ.జనార్ధనరావు, సి.హెచ్.వి.సత్యప్రసాద్, వండాన మురళి, సీపాన భాస్కరరావు, సువ్వారి గాంధీ, సువ్వారి రమణమ్మ, డి.వాసుదేవరావు, ఎల్.రాజారావు, పి.అసిరమ్మ, ఎం.వెంకటర్రావు ఉన్నారు. సి.ఇ.ఒ.గా వై.పాపినాయుడు పనిచేస్తున్నారు. మండల పి.ఎ.సి.ఎస్. తొలి అధ్యక్షులుగా కొంచాడ రమణమూర్తి వ్యవహరించారు.

## సహచట్టం పరిరక్షణ కమిటి :



పొందూరులో 2012లో సమాచార హక్కుచట్టం పరిరక్షణ కమిటి ఏర్పాటైంది. **అధ్యక్షులుగా అనకాపల్లి రంగారావు**, ఉపాధ్యక్షులుగా స్వామి శ్రీనివాసానంద సరస్వతి యోగి, ప్రధాన కార్యదర్శిగా బండారు ప్రతాప్ కుమార్, సహాయ కార్యదర్శిగా ఎం.సి.హెచ్. అప్పలనాయుడు,

కోశాధికారిగా వై. భాస్కరరావు ఉన్నారు. వీరిలో రంగారావు న్యాయవాదిగా పనిచేస్తున్నారు. సంఘసేవలో పాల్గొంటున్నారు.

## కిల్లీ కింగ్ మాడుగుల :-

భారతీయ సంప్రదాయంలో కిల్లీ (తాంబూలం) కి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. వివాహాది శుభకార్యాలలో కిల్లీదే ప్రధమ స్థానం. వానలో తడవని వారు, కిల్లీ పేరు విననివారు అసలు ఉండనే ఉండరు. అయితే కిల్లీని నిత్యం వాడే వారి సంఖ్య కూడా ఎక్కువే. కిల్లీనే నమ్ముకొని స్థానిక మార్కెట్ రోడ్‌లో చిరు వ్యాపారం చేసుకుంటున్న కిల్లీ కింగ్ మాడుగుల లక్ష్మణరావు అందరికి సుపరిచితులే. కిల్లీని కట్టడంలో అయనకు ఆయనే సాటి. ఒక సారి ఆ కిల్లీకి అలవాటు పడితే ఇక కొనసాగింపే...! 1970 జనవరి 26న కిల్లీ దుకాణాన్ని ఏర్పాటు చేసుకొని నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. 43ఏళ్ళుగా ఇదే వ్యాపారాన్ని నమ్ముకొని ఉండటం విశేషం. చెక్కాయగాలుకవండు, మిఠాయి, రత్న, గోపాల్, బాబా, బుల్లెట్ తదితర రకాల కిల్లీలను కడుతుంటారు. గతంలో పండాసుబుద్ధి కిల్లీలను ఎక్కువగా వాడేవారు. తాను కట్టిన కిల్లీలను రుచి చూసిన వారిలో మాజీ మంత్రి దివంగత గొర్లె శ్రీరాములనాయుడు, పొందూరు సమితి మాజీ అధ్యక్షులు దివంగత టంకాల అక్కలనాయుడు, ఎచ్చెర్ల శాసన సభ్యులు మీసాల నీలకంఠం, పొందూరు మాజీ సర్పంచ్ కీ॥శే॥ పాలిశెట్టి సూర్యం తదితరులున్నారు. లక్ష్మణరావు కట్టిన కిల్లీ వేసుకుంటే ఏదో చెప్పలేని అనుభూతి, ప్రశాంతత కలుగుతుందని స్థానిక ఐ.సి.టి.సి.కౌన్సిలర్, న్యాయవిద్యా నిష్ణాతుడు బమ్మిడి రాజశేఖర్ వాఖ్యానిస్తుంటారు. గతంలో లక్ష్మణరావు స్థానిక ఆంధ్ర సన్నఖాదీ కార్మికాభివృద్ధి సంస్థ పరిధిలో ఖాదీ కార్మికునిగా పనిచేసారు. అయితే ఆ పని గిట్టుబాటు కాకపోవడంతో కిల్లీ వ్యాపారంలో దిగి మంచి గుర్తింపు పొందారు. లాభం మాట ఎలా ఉన్న తనకు గుర్తింపు నిచ్చిన కిల్లీనే దైవంగా



భావిస్తానని పేర్కొంటారు. లక్ష్మణరావు సమకాలీన, సామాజిక రాజకీయ అంశాలపై వ్యంగ్యాస్త్రాలను విసురుతుంటారు. జోకుల కేకులను కట్‌చేస్తుంటారు.

## స్వీయ సాధనలో... పైడిలింగం

పొందూరులో నిరుపేద చేనేత కార్మిక కుటుంబంలో జన్మించిన కాకర్ల పైడిలింగం స్వయంకృషితో అంచెలంచలుగా ఎదిగారు. సంప్రదాయాలు ఎలా ఉన్న చౌకగా ఖాదీ వస్త్రాలను ఉత్పత్తిచేసే కిటుకును కనుగొని తన వ్యాపార సామ్రాజ్యాని విస్తరింపజేసారు. 40 గ్రామాలకు చెందిన నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. సర్పంచి పదవిని ఇప్పటికే నిర్వహించారు. ప్రస్తుతం ఉపసర్పంచిగా ఉన్నారు. ఆయన "భూదానం" కొనసాగిస్తున్నారు. మండల వికలాంగుల సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి జోగన్నపేట సమీపంలో రూ॥ 2.5 లక్షల విలువచేసే భూమిని ఉదారంగా అందజేసారు. భవన నిర్మాణానికి 2011 అక్టోబర్ 2వ తేదీన ఆమదాలవలస శాసనసభ్యురాలు బొడ్డేపల్లి సత్యవతి శంకుస్థాపన చేసారు. ఈ భవన నిర్మాణానికి శ్రీకాకుళం ఎం.పి. డా॥ కె.కిల్లి కృపారాణి ఎం.పి.లేడ్స్ నుంచి రూ॥ 4లక్షలు మంజూరు చేసారు. పొందూరు లయన్స్ క్లబ్ శాశ్వత భవన నిర్మాణానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎదురుగా గల 150 గజాల స్థలాన్ని వితరణగా అందజేసారు. స్థానిక దేవాంగ కాలనీ ప్రాధమిక పాఠశాల భవన నిర్మాణానికి 400 గజాల స్థలాన్ని, దేవాంగ సామాజిక భవన నిర్మాణానికి 150 గజాల స్థలాన్ని దానంగా అందజేసారు. లక్ష్మీపేటలో రామమందిరం అర్చకుని జీవన బృతికి 20 సెంట్ల స్థలాన్ని అందజేసారు. విజయనగరం జిల్లా, జామి మండలం, విజనగిరిలో చైతన్య యోగాశ్రమం అభివృద్ధికి లక్షలాదిరూపాయలను అందజేసారు. గాజువాకలో ఇదే ఆశ్రమానికి 300 గజాలు స్థలాన్ని పైడిలింగం కుటుంబీకులు అందజేసారు. ప్రతీ ఏటా సంక్రాంతి రోజున వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛనుదార్లైన 1300 మందికి వస్త్ర, అన్న దానాలను నిర్వహిస్తున్నారు.

**" ఉన్నత శిఖరాలు నేలపైనే ప్రారంభమౌతాయి... "**

**" మమకారం మల్లెపొద...**
**అహంకారం ముళ్ల పొద... "**

## శ్రీ శైలం దేవస్థానం దేవాంగ సత్రం డైరెక్టర్ కాకర్ల రాజారావు :



ప్రతిష్ఠాత్మకమైన శ్రీశైలం దేవస్థానం దేవాంగ సత్రం డైరెక్టరుగా పొందూరుకు చెందిన కాకర్ల రాజారావు వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి వెళ్లే చేనేత కార్మికులకు అక్కడ ఉండేందుకు అవసరమైన సహకారాన్ని అందజేస్తున్నారు. పొందూరు లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా ఐదేళ్లపాటు పనిచేసారు. మండల పరిషత్ ఉపాధ్యక్షునిగా కూడా పనిచేసారు. ప్రస్తుతం విశాఖజిల్లా దేవాంగ సంఘం ఉపాధ్యక్షునిగా పనిచేస్తూ సేవలందిస్తున్నారు. పొందూరు లయన్స్ క్లబ్ చేపట్టే అన్ని కార్యక్రమాలకు తన వంతుగా అవసరమైన సాయాన్ని అందిస్తున్నారు.

## : స్వయంకృషితో - జె.వి.ఆర్ :



కనీస విద్యార్హతలు లేనప్పటికి స్వయంకృషితో ఉన్నతస్థాయికి ఎదిగిన వారు ఏ కొద్ది మందో ఉంటారు. అలాంటి వారిలో స్థానిక ఆచంటి వీధికి చెందిన జె.వి.ఆర్. ఒకరు., భైరిసింగుపురంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన జావి వెంకటరమణ(జె.వి.ఆర్.) అత్తవారిల్లయిన పొందూరుకు చేరుకొని స్వయంకృషితో ఉన్నతశిఖరాలు అధిరోహించారు. పాత ఇనప సామాన్ల వ్యాపారాన్ని గత అనుభవంతో ఇక్కడ ప్రారంభించి నేడు వాణిజ్య ప్రముఖుల్లో ఒకరిగా నిలిచారు. కేవలం అదృష్టమే కాకుండా నిరంతర పరిశ్రమ, పట్టుదల, ఏకాగ్రత వంటి సుగుణాలు ఆయన్ను అందలం ఎక్కించాయి. జె.వి.ఆర్.గా ప్రాచుర్యం పొందారు. తనకు ఆరోజుల్లో చదువుకునే అవకాశం లేకపోవడంతో పిల్లల్ని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. పెద్దబ్బాయి అనీల్ కుమార్ ఎం.బి.ఎ. పూర్తిచేసాడు. రెండవ కుమారుడు రతన్ కుమార్ బి.టెక్. పూర్తిచేసాడు. కుమార్తె స్పందన బి.టెక్.విద్యార్థిని. జె.వి.ఆర్. తన వ్యాపారాన్ని ఇక్కడ ప్రారంభించక ముందు ప్రజలు వ్యర్థ పదార్థాలను రోడ్లపై కాలువల్లో పారవేసేవారు.

అయితే జె.వి.ఆర్. వ్యాపారం ప్రారంభించాక వ్యర్థ పదార్థాల విలువ ఏమిటో తెలియవచ్చింది. అయన తన వ్యాపారాన్ని వివిధ రంగాల్లో కొనసాగిస్తున్నారు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వ్యాపారాభివృద్ధికి అక్షరజ్ఞానం ఒక్కటే చాలదని సమర్ధత, సమన్వయం అవసరమని నిరూపించారు. జె.వి.ఆర్ వ్యాపార ప్రస్థానంలో ఆయన సతీమణి జయలక్ష్మి పాత్రకూడా ఎంతో ఉంది.

## : పొందూరు మిర్చి :

పొందూరు ప్రాంతంలో కూరాకుల రకం మిర్చికి జాతీయస్థాయిలో సైతం గుర్తింపు ఉంది. ఈ రకం మిర్చి ఊరగాయచేసుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. పొందూరు-చిలకపాలేం జంట వ్యాపారకేంద్రాల నుండి మిర్చి ఉత్పత్తులను న్యూఢిల్లీ, లక్నో, ఘజియాబాద్, కాన్పూరు, తమిళనాడు, జమ్మూ - కాశ్మీర్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రతి ఏటా 3.5 లక్షల క్వింటాళ్ళ మిర్చిని ఎగుమతి చేస్తుంటారు. పొందూరు చిలకపాలేం కేంద్రాలలో మొత్తం 9 వ్యాపార కేంద్రాలు పనిచేస్తున్నాయి. సుమారు 500 మంది కార్మికులకు ఉపాది దొరుకుతోంది. మిర్చిసీజన్ జనవరి చివరి వారం నుండి జూన్ నెలాఖరువరకు సాగుతుంది. మిర్చి ఉత్పత్తులను ఉత్తర భారతానికి ఎగుమతి చేయడానికి రైల్వే వేగన్లు అందుబాటులో లేకపోవడం వల్ల ట్రక్కులలో వీటిని ఎగుమతి చేస్తున్నారు. దీనివల్ల రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

## : సేంద్రియ వ్యవసాయంలో అగ్రగామి లక్ష్మీపేట :



స్థానిక మేజర్ పంచాయితీలోని లక్ష్మీపేట సేంద్రీయ వ్యవసాయానికి చిరునామాగా వెలసింది. గత 4ఏళ్లుగా ఇక్కడి రైతులు సేంద్రీయ వ్యవసాయ సాగు చేస్తున్నారు. మొత్తం 108 మంది రైతుల్లో 96 మంది ఈ విధానంలో నిమగ్నమైయున్నారు. సేంద్రీయ ఎరువులైన నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, ద్రవజీవామృతం, ఘన జీవామృతం, వంటి కషాయాలను వాడుతున్నారు. వర్మీ కంపోస్ట్ తయారీలో

వీరికి మంచి పేరుంది. ఈ గ్రామానికి 2009-10 సంవత్సరంలో సేంద్రీయ ధ్రువపత్రం లభించింది. ఎస్.బి.ఐ. పొందూరు శాఖ ఇక్కడి రైతులకు పావలా వడ్డీపై రూ॥ 65 లక్షల మొత్తాన్ని అందజేసింది. 2011 నవంబర్ 10-12తేదీ వరకు జరిగిన బెంగుళూరు పేలస్ మైదానంలో జరిగిన అంతర్జాతీయ సేంద్రీయ ప్రదర్శనలో ఎన్.పి.ఎం. ప్రతినిధి ఎం.సి.హెచ్. అప్పలనాయుడు ఆధ్వర్యములో లక్ష్మీపేటకు చెందిన రైతులు పాల్గొని ప్రశంసలు పొందారు. ఈ ప్రదర్శనలో జర్మనీ, అమెరికా, జపాన్, ఇండియాకు చెందిన సేంద్రీయ రైతుల పాల్గొన్నారు. 2012 జనవరి 26 నుండి 31 వరకు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సేంద్రీయ ఉత్పత్తి ప్రదర్శనలో లక్ష్మీపేట రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేంద్రీయ మిర్చి పౌడర్, సోనామసూరీ బియ్యం, వర్మీకంపోస్ట్ నమూనా, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, అగ్నిఅస్త్రం, పుల్లటి మజిగ తదితర కసాయాలను ప్రదర్శించారు. ఈ గ్రామంలోని పండిస్తున్న మిర్చి ఉత్పత్తులను శ్రేష్ఠ అంతర్జాతీయ సంస్థ ప్రతీఏటా కొనుగోలుచేస్తుంది. మార్కెట్ ధరకన్నా 10శాతం మొత్తాన్ని అదనంగా అందజేసి ప్రోత్సహిస్తుంది. ఎస్.బి.ఐ. సౌజన్యంతో గ్రామంలోని మహిళలు పాడి పశువులను కొనుగోలు చేసారు. పాలను ఇదే గ్రామంలోని విశాఖడెయిరీ సేకరణ కేంద్రానికి అందజేస్తున్నారు.

2010 మార్చి 15న తమిళనాడు సేంద్రీయ వ్యవసాయ ఉద్యమ సంచాలకులు ఎం.రేవతి శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా లక్ష్మీపేట గ్రామం సందర్శించారు. దశాబ్దకాలం నుంచి సేంద్రీయ వ్యవసాయాన్ని చేపట్టాలని కోరుతూ ఆసియా దేశాల్లో విస్తృతంగా పర్యటించానని ఈ పుస్తక రచయితతో మాట్లాడుతూ అన్నారు. సేంద్రీయ విధానాలవల్ల పెట్టుబడులు బాగా తగ్గుతాయని ఉత్పత్తులు అధికం కావడమే కాకుండా నాణ్యతా ప్రమాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయని పేర్కొన్నారు. రసాయనికాలతో విశ్వమంతా విషతుల్యమైందని, ఆరోగ్యానికి విఘాతం కలుగుతుందని రైతులోకం తెలుసుకుంటోందన్నారు.

> విజ్ఞానం వికసించే మూడో కన్ను. వివేకం నీకున్న ఒకే ఒక్క దన్ను.
>
> \- ఆరుద్ర

**: ఆయుర్'వనం' :-**



స్థానిక లక్ష్మీపేట రోడ్, చర్చి సమీపంలో పర్యావరణ ప్రేమికుడు వై.భాస్కరరావు తనకున్న అవగాహనతో ఇంటి పెరటిలోని 24సెంట్ల భూమిలో 5ఏళ్ల క్రితం ఆయుర్వేద మొక్కల పెంపకానికి బీజం వేసాడు. అప్పటినుండి వీటిపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ మొక్కలను సేంద్రీయ పద్ధతుల్లో పెంచుతున్నారు. ఓ నమూనా క్షేత్రంగా తీర్చిదిద్దారు. అక్కడే వర్మికంపోస్ట్, బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసారు. ఆవులు, కోళ్లు పెంచుతున్నారు. పశువ్యర్థాలు, సేంద్రీయ పోషకాలనే వీటి పెంపకానికి వినియోగిస్తున్నారు. చీడపీడల నివారణకు గోమూత్రాన్ని పిచికారీచేస్తున్నారు. పి.జి.డి.సి.ఆర్.ఎస్.ను పూర్తిచేసి తొలుత ఆర్టిక్‌లో సేవలందించి ప్రస్తుతం ఐ.కె.పి. ఆధ్వర్యంలోని ఎం.టి.ఎం.లో పనిచేస్తున్నారు. భాస్కరరావు తన క్షేత్రంలో వావిలాకు, అడ్డాసార, కలబంద, సీతాఫలం, తులసి, ఉసిరి, ఆముదం, మునగ, గ్లైసీడియా, బీర, కాకర, బెండ, గోంగూర, తోటకూర మొక్కలను పెంచుతున్నారు. పర్యావరణ వేత్తగా ఆయన గుర్తింపుపొందుతున్నారు.

## సెల్‌ఫోన్‌లో గాంధీతో కాసేపు

మమ్ము మన్నించు బాపూ!! నిన్ను మేం ఎన్నటికీ మరువలేం. నీ ఆశయాలంటే మాకెంతో ఇష్టం. అందుచేతనే వేదికపై ఎక్కి ఉపన్యాస, విన్యాసాలతో ఊదరగొడుతున్నాం. మహాత్మా! ఎన్నికల్లో నీపేరు చెప్పి ఓట్లు దండుకుంటున్నాం. ఓటు వ్యాకుకు నీవొక ఉపకరణంగా పనికొస్తున్నావు. థాంక్యూ! గాంధీజీ. జాతి పితవు నీవు అయితే మేం జాతికి, కులానికి పర్యాయ పదంగా వాడుతున్నాం. కులాల కురుక్షేత్రాన్ని పకడ్బందీగా నిర్మిస్తున్నాం. మానవత్వం నీ మతమైతే దాన్ని మేం చిత్రవథ చేస్తున్నాం. సమానత నీ ధ్యేయమైతే దీనికి మరో అక్షరం అందంగా, అదనంగా చేర్చి 'అ'సమానతలను పెంచి పోషిస్తున్నాం. అలాగే ఇదే బాటలో నీతి, న్యాయం, క్రమం, ధర్మం, తదితర పదాల ముందు 'అ'ను చేర్చి అక్షరాంజలి ఘటిస్తున్నాం. అయితే 'అహింస'లో 'అ'ను తొలగించుకుంటున్నాం. ప్రశాంతంగా

ఉన్న పల్లె సీమల్లో ఇప్పటికే వర్గ దృక్పథాన్ని రగిలించాం. దీన్ని ఇంకా మరింత ఉధృతం చేసి పోలీసు స్టేషన్‌లకు, కోర్టులకు పని చూపిస్తున్నాం. చెట్టు క్రింద ప్లీడర్లకు పునరావాసం కల్పిస్తున్నాం. నీవు కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని పగటి కలలుగా మార్చడానికి పోటీపడుతున్నాం. అక్రమాలకు, అవినీతికి కర్పూర నీరాజనం పడుతున్నాం. రెండు రెళ్లు నాలుగన్న వారిని అసహ్యించుకుంటున్నాం. దేహశుద్ధి చేస్తున్నాం. స్వాతంత్ర్యంవచ్చి ఐదు దశాబ్దాలు దాటినా పల్లె పల్లెకు తాగునీరు,సాగునీరు అందించలేకపోతున్నా బెల్టుషాపుల పరంపరలో సారాను ఏరులై ప్రవహింపచేస్తున్నాం. ప్రజా సంక్షేమం కోసం బ్రాందీషాపులను మరింతగా విస్తరింపచేస్తూ మద్యం అమ్మకాలను రెట్టింపు చేస్తున్నాం.

మాన ఆస్తులను పెంచుకుంటున్నాం. ప్రజలకు పస్తులను కల్పిస్తున్నాం. సారా సంస్కతిని పెంచి 'సారే జహసే అచ్చా' అంటూ దేశభక్తి గీతాలను ఆలాపిస్తున్నాం, ఎంపీటీసీ ఎన్నికల నుంచి ఎంపీ ఎన్నికల వరకు మద్యం ప్యాకెట్లను ఉదారంగా పంచుతున్నాం, ఓ స్థాయి వున్న వీధి నాయకులకు విస్కీతో అభిషేకం చేస్తున్నాం. ఎన్నికల జాతరలో నాటు, నోటులతో జాతక చక్రాలను మార్చేస్తున్నాం, ఇది కూడా తప్పయితే, పోరపాటయితే మమ్ము మన్నించు మహాత్మా! లెంపలేసుకుంటాం, అర్ధరాత్రి ఆడది స్వేచ్ఛగా తిరిగే రోజు కోసం మీరు ఎదురుచూస్తున్నట్లుంది, అదే నిజమైన స్వాతంత్ర్యమని మీరు చెబుతుండేవారు, నేడు మగవాడు కూడా పగటిపూట స్వేచ్ఛగా తిరగలేకపోతున్నాడు, వరకట్న వేధింపులు, సాధింపులు, హత్యలు, ఆత్మహత్యలు, ఆత్యాచారాలు సామూహిక మానభంగాలు, ర్యాగింగులు ఉగ్రవాదంవెర్రితలలు వేస్తున్నాయి, భర్త తన భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించి స్టవ్ ప్రమాదంలో గృహిణి మృతి చెందిందని కాసులతో కేసులను మార్చేస్తున్నాం. హత్యలను ఆత్మహత్యలుగా నమోదు చేయిస్తున్నాం. హింసా కాలుష్యం పెరిగిపోతోందని బాధపడుతున్నావా 'నీ ఆత్మకు అశాంతి కలిగిస్తున్నందుకు మన్నించు మహాత్మా! స్వదేశీ నీ ఆశయం, ఆకాంక్ష... అయితే యేం ఈదేశం డబ్బుతో ఉన్నత చదవులను చదివి విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నాం. మా పిల్లలు స్టేట్స్‌లో ఉన్నారని మురిసిపోతున్నాం. వసుదైక కుంటుంబం స్థాపించాలనే లక్ష్యంతో ఈవిధంగా చేస్తున్నాం. నిజానికి నీ ఆశయం

కన్నా మా ఆశయమే ఉన్నతమైందని భావిస్తూ విదేశాలకు పోతున్నాం. మాకు కావల్సింది డబ్బు...డబ్బు... అందుకే వరల్డ్ బ్యాంకుకు వందనం అంటున్నాం. చేనేత, ఖద్దరు నీకు పంచప్రాణాలని మాకు తెలుసు. అయితే ఈ పరిశ్రమలు కార్మికులకు తిండి పెట్టలేకపోతున్నాయి. ఫలితంగా ఆకలి చావులు... అలాగే భూమిని నమ్ముకున్న రైతు ఇంట్లో ఆకలి మంటలు, ఆత్మహత్యలు ఏదో విధంగా జనాభా నియంత్రణ జయ ప్రదంగా జరిగిపోతోంది. ఇంకా కావల్సింది ఏముంది!

అవినీతి, బాధ్యతారాహిత్యం పెరిగిపోతున్నాయని బాధపడుతున్నావా! నీతి నిరానకమైందని, నిజాయితీ నీరసించిందని, ఎక్కడ చూసినా అందోళనలే,సమ్మె ఘెరావ్‌లే, ఎటుచూసినా హింసాజ్వాలలే, మరోవంక కరువు, ప్రకృతి వైపరీత్యాలు, ఇదీ నేటి భారతం, నీవుపుట్టిన ఈదేశంలో శాంతి కపోతం కన్నీరు కారుస్తోందని ఆవేదన చెందుతున్నావా! ఏటా రాజ్‌ఘట్‌లో నీ సమాధి వద్దకు శ్రద్ధాంజలి ఘటించేందుకు మేం గన్‌మేన్‌ల సాయంతో వెళుతున్నాం, ఏంటి అభద్రతాభావమని అనుకుంటున్నావా! సెక్యూరిటీ ఫోర్సు లేకుండా సెంటు స్థలాన్ని దాటి కూడా వెళ్లలేకపోతున్నాం,

నీ మనమరాలు తారాగాంధీ నీ ఆశయాలను ప్రచారం చేస్తున్నారు, రెండుసార్లు మా జిల్లాలో కూడా పర్యటించారు, తోటి వారితో ప్రేమానురాగాలు పంచుకోవాలని, పెంచుకోవాలని, సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని, హింసా రహిత భారతాన్ని నిర్మించాలని, అహింసే సుఖశాంతులకు సువర్ణ సోపానమని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు, అయితే ఇదంతా బధిరశంఖారావమే అవుతుంది, నీవు ఉదహరించిన మూడు కోతుల కథకు సవరణ చేసి చెడు మాట్లాడుతున్నాం, చెడు చూస్తున్నాం, చెడు వింటున్నాం. ఇలా చేస్తున్నందుకు మన్నించు మహాత్మ!

ఇక సెలవా...

మరి మీకు వీలుంటే మా పాలకులతో కాస్త మాట్లాడండి సెల్, ఇంటర్నెట్ ఎలాగూ ఉంది కదా? (అంతరిక్షంలోని ఆత్మలతో సెల్‌ఫోన్‌లో సంభాషించే సౌకర్యం కలిగిందని భావించి....)

**(తే02-10-02దీ ఈనాడు జిల్లా అనుబంధం)**

# ఖాదీకి నీరాజనం



**మీగడ యోగానంద స్వామి,**
ఎం.ఎ., టి.పి.టి.
తెలుగు విభాగం అధిపతి,
సిష్టమ్ డిగ్రీ కళాశాల, పొందూరు.
సెల్ : 9676127763

సీసం॥ ఖాది పరిశ్రమ కనక కాంతుల గాను
సాహితీ సంస్థలు శాంతి పల్కే
కళలకు నిలయమై కాంతుల నిత్యమై
వెలుగొందుచున్నదీ వేదపురం.

చేనేత పనివాళ్లు చిందులు వేయగా
జాతీయ స్థాయిని ఖ్యాతి గాంచి
విద్య విలువ పెంచి, వేదాంతులున్నట్టి
వెలుగొందుచున్నదీ వేదపురం.

గీ॥ ఖాది చేనేత యున్నట్టి కాంచి పురము
జాతి ఘనతను పెంచిన ఘనుల పురము
కీర్తి ప్రసిద్ధి పెంచిన కాంతి పురము
సహృద సాహిత్యు లున్నట్టి సరస పురము.
ద్యుతి పెంచినది మన పొందూరు పురము.

# పొందికైన పొదరిల్లు పొందూరు



**గుడ్ల ప్రభాకరరావు,**
వాణిజ్య వేత్త,
పొందూరు.
సంచార వాణి : 9704888439

శ్రీ పైడితల్లి అమ్మవారి నిలయం మన పొందూరు
చిక్కోలు సీమలో సిరిమల్లెపువ్వు పొందూరు
" పొందు " కు మరోపేరు పొందూరు
స్నేహ పరిమళాలు అందించే పట్నమిది

చేనేత వర్గాలకు చేయూతనిచ్చె పొందూరు
దేశ విఖ్యాత గాంచిన పొదరిల్లే పొందూరు
గాంధీజీ ఆశయాలకు ప్రతి బింబం పొందూరు
అక్కినేని అభిరుచి మన ఖాదీ నగర్

ఉయ్యూరు, ఘండికోట ముద్దుబిడ్డల పొందూరు
కళాకారులకు నిలువ నీడనిచ్చిన పొందూరు
మరువలేని మరపురాని మధురానగరి
ఉత్తరాంధ్ర ఆణిముత్యం పొందూరు

పర్యాటక రంగంలో గణుతికెక్కిన ఊరు
హార్మోనియం సప్తస్వరాలను పలికించే మన ఊరు
సేంద్రీయ వ్యవసాయ రంగాన అగ్రగామి పొందూరు
మొమెంటోల అందాలు విరిసిన దిక్కడే.

# సిక్కోలు సిగలో...



**బొడ్డేపల్లి భూపతిరావు**
స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)

సిక్కోలు సిగలో సన్నఖాదీ పుష్పం
ప్రపంచం గుర్తించిన పొందూరు నగరం
రకరకాల ఖాదీలకు ఆలవాలం ఈ నగరం
అద్భుత చేనేతలకు సుందర నిలయం

ఆహ్లాదపరుస్తున్న ఆధ్యాత్మిక సిరులతో
శాంతి కాముకులైన సామరస్య జనులతో
కళకళలాడుతున్న కుటీర పరిశ్రమలతో
ప్రతి ఇంట తిరుగుతున్న రాట్నపు చక్రాలతో
వెలుగుతుంది వెలుగుతుంది పొందూరు నగరం

జాతిపిత ఆశయాలు ఆచరించే నగరం
స్వదేశీ ఉధ్యమంలో ముందునిలిచే ఈ నగరం
స్వయం ఉపాధి జనుల ఆటపట్టు ఈ నగరం
తరతరాల చరిత్రలో తరగని సంస్కృతి నగరం
వెలుగుతుంది వెలుగుతుంది పొందూరు నగరం

మేధావులు మహనీయులు పుట్టినిల్లు ఈ నగరం
కళాకారులెందరికో జన్మనిచ్చే ఈ నగరం
స్నేహ కుసుమాలను గుబాళించే ఈ నగరం
చరిత్రలో ఖ్యాతిగాంచె పొందూరు నగరం

# దేశభక్తి సంకేత వస్త్రమా



ఈవేమన

దేశభక్తి సంకేత వస్త్రమా
సత్యాగ్రహ సంఘీభావ నేస్తమా
మహాత్మాగాంధీ ప్రీతి పాత్రమా
పొందూరు ఖాదీ ఖ్యాతి సూత్రమా

ఎండను మాపే చల్లని నీడవు
స్వేదం ఆర్చే ఖద్దరు మాతవు
తారాగాంధీ మెచ్చిన గుమ్మవు
బాపూజీ అలంకరణకు బొమ్మవు

అగ్గిపెట్టెలో ఇమిడే తేజం నీవు
తెల్లదొరల గుండెల్లో గునపం నీవు
తెలుగోడి విజయ పతాకం నీవు
పొందూరు ఖాదీకి సంకేతం నీవే

# పొందూరు ఖద్దరు వస్త్రమా!



వి.ఆర్.కె.కె.మనోజ్ కుమార్.బందారు
వాసవి ప్రింటర్స్
పొందూరు

స్వాతంత్ర్యపు ఉద్యమానికి ఊపిరి ఈ వస్త్రం
తెల్లదొరల బానిసత్వాన్ని ఎదిరించింది ఈ వస్త్రం
చేనేత కార్మికుల శ్రమదానం ఈ వస్త్రం
పొందూరు పట్టణానికి ప్రపంచ ఖ్యాతినిచ్చింది ఈ ఖద్దరు వస్త్రం

నాయకులకు హుందానిచ్చింది ఈ వస్త్రం
కళాకారులకు అందాన్నిచ్చింది ఈ వస్త్రం
శాంతి, ప్రేమ, స్వేచ్ఛలకు చిహ్నంగా నిలిచింది ఈ వస్త్రం
స్వచ్ఛమైన తెలుగుతనానికి అద్దం పడుతుంది ఈ ఖద్దరు వస్త్రం

చీరగా, పంచెగా, కండువగా, ధోతీగా
ఏ.ఎన్.ఆర్. ఎం.ఎల్.ఏ. అంచుపంచెలుగా
అందరిలో ప్రత్యేకతనిస్తుంది ఈ వస్త్రం
ప్రజల మనసుల్ని చూరగొంది ఈ పొందూరు ఖద్దరు వస్త్రం

రాట్నపు ఒంపు సొంపుల నుంచి దారంగా వచ్చి
చేపముల్లు సాయంతో చేతివేళ్ల మెలికలతో మగ్గంమీద నేసే వస్త్రం
దేశవిదేశాలకు ఎగుమతౌతున్న ఈ వస్త్రం
చేనేత ప్రపంచంలో ధృవతార ఈ వస్త్రం
ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకుంది ఈ పొందూరు ఖద్దరు వస్త్రం.
ఇక ముందు కావాలి అందరిది... మనందరిది...

## : జస్ట్ డయల్ :

" జస్ట్ డయల్ " మన దేశంలో ఓ అద్భుత ప్రయోగం. 1996లో ముంబయిలో దీన్ని ఏర్పాటు చేసారు. దీని ఫోన్ నెంబర్ 040-24444444 లేదా 08888888888. కేవలం మన రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని అన్నిరాష్ట్రాల్లో గల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాలు, వివిధ సంస్థల ఫోన్ నెంబర్లను క్షణాల్లో తెలుసుకోవచ్చు. మనం పై రెండు నెంబర్లలో దేనికి కాల్ చేసిన వెంటనే మన సెల్‌కి సంబంధిత సెల్ నెంబర్లు క్షణాల్లో మెసేజ్ రూపంలో వస్తాయి. నిజం చెప్పాలంటే ఈ ప్రయోగం భారతీయులందరికి ఓ వరం లాంటిది. ట్రావెల్స్, హొటల్స్, కంప్యూటర్స్, విద్యా, వ్యాపార, వాణిజ్య తదితర సంస్థల సమాచారాన్ని వెంటవెంటనే గ్రహించవచ్చు. ప్రతి పౌరుడు ఈ నెంబర్లను తమ సెల్‌ఫోన్‌లలో పొందుపరుచుకోవడం ఎంతైనా అవసరం. ఉదాహరణకు ఫిజికల్ ఎడ్యుకేషన్‌కి సంబంధించి మహారాష్ట్రలో ఉన్న కళాశాలల సమాచారం క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఇలా దేశ వ్యాప్తంగా ఉన్న సంస్థల సమాచారాన్ని సులభంగా తెలుసుకోగలం. త్వరలోనే యు.ఎస్.లో కూడా జస్ట్ డయల్ సేవలు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలిసారి ఈ నెంబర్లకు ఫోన్‌చేసేటప్పుడు మీ పేరును వెంటనే నమోదుచేసుకుంటారు. ఆ తరువాత మనం ఏదైనా పనిపడి ఫోన్ చేస్తే అవతలి నుంచి మన పేరు పెట్టి వాళ్లే పిలవడం మంచి సంప్రదాయమనిపిస్తోంది.

మరిన్ని వివరాలకు : **www. justdial.com** వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.



### : ముద్రణ పితామహుడు "జాన్ గుటెన్ బర్గ్" :

15వ శతాబ్దంలో జాన్ గుటెన్‌బర్గ్ ప్రవేశంతో ముద్రణ రంగం ప్రాచుర్యంలోకి వచ్చింది. 11 శతాబ్దంలో చైనాలో ముద్రణ ప్రక్రియ ప్రారంభమైనప్పటికి అది నామమాత్రమే. కాలానుగుణంగా 21వ శతాబ్దంలో కంప్యూటర్ అనుసంధానంతో ముద్రణ రంగంలో వేగం పెరిగింది. మిలీనియం మహానుభావుడైన "గుటెన్ బర్గును" ఒక్కసారి స్మరించుకుందాం, ఘనమైన నివాళులర్పిద్దాం.

# ఆయన జీవితమే ఓ సందేశం..



బాపూజీ మానవోత్తమునిగా ప్రపంచ ప్రజల ప్రేమ, వాత్సల్యాలను అందుకుంటున్నారు. చిటికెన వేలు సైగతో కోట్లాది భారతీయులను స్వాతంత్ర్య ఉద్యమంలోకి దింపగలిగారు ఆయన.

ప్రపంచాన్ని నేడు వణికిస్తున్న అశాంతి, తీవ్రవాదం, ఉగ్రవాదం వంటి వాటి నిర్మూలనకు గాంధీజీ అహింసా సిద్ధాంతానికి మించింది లేదు.

గాంధీజీ మహాత్ముడు అయ్యాడంటే తాను బోధించిన విషయాలను ఆయన ఆచరించి చూపించారు.

గాంధీజీ బాల్యంలో " సత్య హరిశ్చంద్ర " " శ్రావణుడు " నాటకాలను చూసారు. అవి అతని జీవితంపై ఎనలేని ప్రభావం చూపాయి.

ఒక రోజు గాంధీజీ రైలులో ప్రయాణం చేస్తున్నప్పుడు జాన్ రస్కిన్ రాసిన 'అన్‌టుది లాస్ట్' అనే పుస్తకం చదివారు. ఆ పుస్తకం బాపూ పై చాలా ప్రభావం చూపింది. పారిశ్రామికీకరణను వ్యతిరేకించే రస్కిన్ నిరాడంబర

జీవనం, శారీరక శ్రమ విలువలకు ఆ పుస్తకంలో పట్టం కట్టాడు. ఆ పుస్తకం ప్రభావంతోనే గాంధీ 1904లో డర్బాన్ దగ్గరలో ఫీనిక్స్ ఫారం నెలకొల్పాడు. సామూహిక జీవనం, ప్రత్యామ్నాయ చికిత్స పద్ధతులు, ఉపవాసం వంటి అనేక విషయాలలో గాంధీ ప్రయోగాలు మొదలయింది అక్కడే.

1906లో దక్షిణాఫ్రికా ప్రభుత్వం 'నల్లచట్టం' ఒకటి తెచ్చింది. ఆచట్టం ప్రకారం అక్కడి భారతీయులందరూ వేలిముద్రలు ఇచ్చి పేర్లు నమోదు చేయించుకోవాలి. హక్కుల పోరాటానికి గాంధీ అందించిన అత్యంత శక్తి వంతమైన ఆయుధం " సత్యాగ్రహం " ప్రప్రథమంగా జరిగింది అక్కడే...

గాంధీజీని " మహాత్మా " అని మొదటిగా పిలిచింది విశ్వకవి రవీంద్ర నాథ ఠాగూర్.

మరణించే ముందు గాంధీజీ జీవితం ఇంకా నిరాడంబరంగా సాగింది. ఆహారం తీసుకోవడం తగ్గిపోయింది. ఎక్కువ సమయం ప్రార్థనలోను నూలు వడకడంలోను గడిపారు.

గాంధీజీ చిలకపలుకుల విద్యను నిరసించారు. వృత్తి విద్యలను, చిత్రలేఖనాన్ని, వ్యాయామాన్ని ప్రోత్సహించాలని హితవు పలికేవారు. బేసిక్ విద్యా విధానాన్ని పకడ్బందీగా అమలుచేయాలని ఆయన కోరేవారు.

1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించిన గాంధీజీకి పొందూరు సన్నఖాదీ పరిశ్రమతో ఉన్న అవినాభావ సంబంధం మన అదృష్టమే..

> రక్తమాంసాలతో కూడిన
> ఇలాంటి వ్యక్తి ఈ భూమి మీదే
> నడిచాడంటే ముందు తరాల
> వారు నమ్మడం కష్టం - **ఐన్‌స్టీన్**

## సిద్ధాంతం

◈ ఒక సిద్ధాంతాన్ని బాగా పరీక్షించి, ఆ సిద్ధాంతంలోని సుగుణాలను గమనించి ఆచరణలో పెడితే ఆ సిద్ధాంతానికి అఖండ విజయం సిద్ధిస్తుంది.

యంగ్ ఇండియా - 1921

## సత్యాగ్రహం

◈ సత్యాగ్రహులకు వేరే గౌరవం అక్కరలేదు. సత్యమే వారికి గౌరవం. సత్యాగ్రహులకు వేరే బలం అక్కరలేదు. బాధలు భరించడమే వారికి బలం.

యంగ్ ఇండియా - 1927

## సహాయ నిరాకరణ

◈ సహాయ నిరాకరణోద్యమం ప్రజాభిప్రాయిన్ని తీర్చిదిద్దుతుంది.

యంగ్ ఇండియా - 1921

◈ సత్యాగ్రహమొక కల్పతరువు. శాసనోల్లంఘనం, సహాయ నిరాకరణ దీని శాఖలు. సత్యాన్వేషణే సత్యాగ్రహం. భగవానుడే సత్యం.

యంగ్ ఇండియా - 1924

## సత్యం - అహింస

◈ సత్యం - అహింసలు హిమాలయాలకన్నా అతి ప్రాచీనమైనవి - గాంధీజీ.

◈ ప్రపంచంలో సత్యమైనది దేవుడొక్కడే, మిగిలినదంతా అనిశ్చితం - గాంధీజీ.

## నాయకులు

◈ ధైర్యం, సహనం, సాహసం, స్వార్ధ త్యాగం మొదలగు గుణాలతో నాయకులు విరాజిల్లాలి - గాంధీజీ.

## దేవుడు

◈ సత్యాన్వేషణే దైవాన్వేషణ, సత్యమే దేవుడు, సత్యం ఉంది కనుక దైవం ఉన్నాడు.

హరిజన్ పత్రిక 1939, గాంధీజీ.

## వస్త్రాలు

◈ నువ్వు ధరించే వస్త్రాలను బట్టి నిన్ను అర్ధం చేసుకోవచ్చు. - గాంధీజీ.

◈ నువ్వు తినే తిండిని బట్టి నీమస్తత్వం అర్ధమవుతుంది. - గాంధీజీ.

## పెళ్ళిళ్ళు

◈ తల్లిదండ్రులు పెళ్ళిళ్ల కోసం విపరీతంగా ఖర్చుచేసి నాశనం అవుతున్నారు. - గాంధీజీ.

# జాతిపిత గాంధీజీ సూక్తులివే...

## చరఖా (రాట్నం)

◈ హార్మోనియం, సితార్, వీణ వీటిఖరీదుకంటె రాట్నం ఖరీదు చాలా తక్కువ. నూలు వడికితే లాభసాటి మాత్రమేకాదు. వీటికిమించిన మృదు మధురగానం రాట్నం నుండి వెలువడుతుంది.
యంగ్ ఇండియా - 1920

◈ నూలువడకడమే బ్రతుకుదెరువని ఎవరూ చెప్పరు. కాని పేదలకిది బ్రతుకుదెరువు.
యంగ్ ఇండియా - 1921

◈ నేను ఒంటరిగా ఉండు సమయాల్లో రాట్నం నాకు విడనాడని స్నేహితురాలు
యంగ్ ఇండియా - 1924

◈ నా సర్వస్వం రాట్నానికి ధారపోస్తాను. రాట్నచక్రం తిరుగునపుడల్లా నూలుపోగువెంట ప్రశాంతత, సద్భావం, ప్రేమ తిరుగుతూనే ఉంటాయి.
యంగ్ ఇండియా - 1924

## జాతీయ దుస్తులు

◈ మన దుస్తులు మన వాతావరణానికి తగినట్లు ఉంటాయి. నిరాడంబరంగా, చౌకగా, అందంగా ఉంటాయి. ఆరోగ్యకరంగా ఉంటాయి.
వీటితో ప్రపంచంలో మరే దుస్తులు పోలవు. - గాంధీరచనలు, ఉపన్యాసాలు

## జాతీయ జెండా

◈ ప్రతి జాతికి జెండా ముఖ్యం. జాతీయ జెండా గౌరవ ప్రతిష్టలకై కోటానుకోట్ల మంది ప్రాణాలర్పించారు.
యంగ్ ఇండియా - 1921

## జాతీయత - అంతర్జాతీయత

◈ జాతీయ వాది కానివారు అంతర్జాతీయ వాదులు కానేరరని నా అభిప్రాయం.
యంగ్ ఇండియా - 1925

## దేశభక్తి

◈ దేశభక్తి అంటే మానవత్వమని అర్థం. నేను మానవుడను కాబట్టి నాకు దేశభక్తి కలదు. భూతదయకలదు. నా దేశభక్తి ఇతర దేశాలకు నష్టం కలుగజేయదు.
యంగ్ ఇండియా - 1924

## స్వదేశీ

◈ స్వదేశీ వస్తువులు బాగుండవు. అందువలన విదేశీ వస్తువులను కొంటున్నాను అనడం విదేశీయుడుగా మారడమే.
యంగ్ ఇండియా - 1919

# చిరస్మరణీయులు


పాలిశెట్టి సూర్యం


వాడపల్లి హనుమంతరావు


ఘండికోట బ్రహ్మాజీరావు


ఉయ్యూరు గోపాలస్వామి


అంగ అప్పారావు


చిగిలిపల్లి వాసుదేవరావు


బోను సన్యాసినాయుడు


పమ్మిన సూర్యం


ముట్నూరు సూర్యప్రకాశ శాస్త్రి


అప్పయ్య కవి


అల్లంశెట్టి గవరయ్య


పైడిపాటి రాంబాబు


ఖాదీ కార్మికులను అభినందిస్తున్న ఇందిరాగాంధీ


సేంద్రీయ కృషిలో... లక్ష్మీపేట



" నీ గమ్యాన్ని నిర్ణయించేది
నీ చేతలే తప్ప
నీ అరచేతి గీతలు కావు "
- గౌతమ బుద్ధుడు





అమ్మా నాన్నలు : కీ॥శే॥ రాధాకాంతమ్మ, చినగురుమూర్తి.



ఎ.స్పీ. గురప్ప చేతులుమీదుగా అవార్డు



కలెక్టర్ కోటేశ్వరరావు నుంచి అవార్డు స్వీకరణ



తారాభట్టాజార్జీతో రచయిత



రామోజీరావు చేతులుమీదుగా అవార్డు స్వీకరణ

రచయిత
**వాండ్రంగి కొండలరావు,**
ఎం.ఎ., బి.యిడి.
సీనియర్ పాత్రికేయులు
సెల్ : 9490595391



వాసవిప్రింటర్స్, పొందూరు. 9573577898